మార్చి, 2024
సంపుటి 04, సంచిక 06

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలంగాణ సాహిత్య మాసపత్రిక



## మహిళా దినోత్సవ ప్రత్యేక సంచిక



*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **BHARATHA JAGRUTHI**, Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 4th Floor, Near NTR Stadium, Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక


సృజన సాధకులం మనమే అంటున్న **అనిశెట్టి రజిత** వ్యాసం
**"స్త్రీల రచనలు సమాలోచనలు"** ....పేజీ 53

అలవి గాని ప్రశ్నల పరంపరలో వచ్చిన **కొండపల్లి నీహారిణి** కవిత
**"తొమ్మిది నెలలు ఒక్క జీవితం"** ....పేజీ 26

తెలుగు సినిమా పాటల రచనలలో స్త్రీల ఆవశ్యకతను చెబుతున్న నెల్లుట్ల రమాదేవి వ్యాసం **"తెలుగు సినీగీతరచనలో స్త్రీలు ఎక్కడ?!"** ....పేజీ 63


49

స్త్రీ శక్తిని నిరూపించిన కూతురు కథ
**పురిమళ్ళ సునంద "నన్ను క్షమించు తల్లీ!"**


07

అంతరంగ మథనంలో ఆధునిక యువతి, **యశోదారెడ్డి** నాటి కథ
**"ఎదల్లోని పొరలు"**


17

ఎత్తుకు పై ఎత్తు వేస్తున్న యుగంధరుడు
**అమ్మంగి వేణుగోపాల్** సీరియల్ ప్రతాప యుగంధర కథలు **"వ్యూహం"**


13

సాహిత్య ప్రయాణంలో స్త్రీల కలం బలం **పింగళి భాగ్యలక్ష్మి** వ్యాసం
**"సాహితీమూర్తులకు అక్షర నీరాజనాలు"**


11

స్త్రీ చేయవలసింది ఒంటరి పోరాటమే
**స్వాతి శ్రీపాద "గాజు తెర"** కథ



21

బహుజన విమర్శకున్ని పరిచయం చేసిన **సంగిశెట్టి శ్రీనివాస్ "విస్మృత బహుజన విమర్శకుడు పెదగాడ గంగయ్య"**

47 స్త్రీ ధీర అని చెబుతున్న శిలాలోలిత వ్యాసం **"విజయకేతనాన్ని ఎగరేస్తున్న 'ధీర'ల రోజిద"**

37 తండ్రి అవశేషమైన కోరికలను తాను పూర్తి చేసిన కూతురు తనలో దాగిన నది **కుప్పిలి పద్మ** కథ **"తనలో దాగిన నది"**

చల్లని మాట కోసం చేసే శోధన **జయంతి వాసరచెట్ల** కవిత **"శోధన"** ....పేజీ 16

స్త్రీ ఓర్మికి తన పరిభాషలో నిర్వచనం చెబుతున్న **సరోజ వింజామర** కవిత
**"పాకశాస్త్ర ప్రవీణ"** ....పేజీ 50

విహారయాత్రను అక్షరీకరించిన **అంజలి** కవిత
**"ఆత్మీయ సమ్మేళనం"** ....పేజీ 46

కంచికి చేరిన ఒక స్త్రీ కథ
**దేవకీదేవి "సాండ్విచ్ బస్టైంది"** ....పేజీ 27

కష్టాల్లోనే ఎదిగిన స్త్రీ మూర్తి కథ **మాద నాగాంజలి...**
**'మహి'షాసుర మర్దిని** ...పేజీ 43

కలలు నిజం చేయాలి అంటున్న **నస్రీన్** కవిత **"చాలిక"** ....పేజీ 20

ఈ తరం ఆడపిల్ల రూపం చెబుతున్న **అరుణ నారదభట్ల** కవిత
**"పొద్దు తిరుగుడు పువ్వు"** ....పేజీ 42

మార్కెట్ మాయాజాలంలో స్త్రీని చిత్రించిన **జ్యోత్స్న** కవిత
**"సౌందర్యకాంక్ష"** ....పేజీ 49

పితృస్వామ్య భావజాలం నశించాలంటే పోరాడాలి అంటున్న **తాయమ్మ కరుణ**తో **వెల్దండి శ్రీధర్** ముచ్చట ...పేజీ 57

**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...


**తంగేడులో ప్రచురిస్తున్న రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు ఆయా సృజన కారుల సొంతం. వీటితో సంపాదకులకు ఏకీభావం ఉండవలసిన అవసరం లేదు. విభిన్న ప్రక్రియలకు, అభిప్రాయాలకు, వేదిక కావడమే తంగేడు లక్ష్యం.**

# శుభంబు లొప్పగన్......

**మొల్ల**



ఈనాటి నాటికవయిత్రి ఆతుకూరి మొల్ల 1440-1530 మధ్యలో జీవించారు. మొల్లమాంబగ ఆమె ప్రసిద్ధురాలు. బహుజన జాతికి చెందిన మహిళా కవయిత్రిగా ఆమె సాహితీ లోకానికి సపరిచితం. ఆమెచే విరచింపబడ్డ రామాయణం మొల్ల రామాయణంగా సాహితీ లోకంలో ఆదరింపబడుతోంది.

కేసన ఈమె తండ్రి. జీవితంలోనూ కవిత్వంలోనూ నిరాడంబరంగా ఉండే మొల్ల తెలుగు దేశంలో రెండవ కవయిత్రిగా గుర్తింపు పొందారు. ఆమె రచించిన మొల్ల రామాయణం నుండి ప్రారంభంలోని కొన్ని పద్యాలు మా పాఠకుల కోసం.....

ఉ. శ్రీ మహిమాభిరాముఁడు, వశిష్ఠ మహామునిపూజితుండు, సు
త్రామ వధూ కళాభరణ రక్షకుఁ డాశ్రిత పోషకుండు, దూ
ర్వామల సన్నిభాంగుఁడు, మహా గుణశాలి, దయా పరుండు, శ్రీ
రాముఁడు ప్రోచు భక్తతతి రంజిల్లు నట్లుగ నెల్ల కాలమున్.

ఉ. శ్రీనగ మందిరుం, డమర సేవితుఁ, డర్ధ శశాంక మౌళి, స
న్మౌని మనపయోజ దిననాయకుఁ, డబ్జభవామరేశ్వర
ధ్యాన లసత్ప్రసన్నుఁ డతి ధన్యుఁడు, శేష విభూషణుండు, వి
ద్యానిధి, మల్లికార్జునుఁడు, తా నిడు మాకు శుభంబు లొప్పగన్

ఉ. తెల్లని పుండరీకముల తేజము మెచ్చని కన్నుదోయితో
నల్లని శక్రనీల రుచి నవ్వెడు కోమల దేహ కాంతితో
నల్లనఁ బిల్లఁ గ్రోవి కర మంచిత సంజ్ఞల నింపు నింపగా
గొల్లతలన్ విరాళి కరఁ గొల్పెడు కృష్ణుఁడు ప్రోచుఁగావుతన్

ఉ. మించి, సమస్త లోకములు మిన్నక తాఁ దన నేర్పు మీఱ ని
ర్మించి, ప్రగల్భతన్ మెఱసి, మేలును గీడును బ్రాణికోట్లు సే
వించ ఘటించి శాస్త్రములు, వేదములుం గొనియాడుచుండు నా
కాంచన గర్భుఁ డిచ్చు నధికంబుగ నాయువు నీప్సితార్థముల్.

తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

మార్చి, 2024

సంపుటి 04 సంచిక 06



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# మన ప్రతిపాదనలు క్షేత్ర స్థాయికి వెళ్ళాలి

1980 నుండి 1990 వరకు, (సుమారుగా 2000 వరకు కూడా) తెలుగు సాహిత్యాన్ని ఓ ఊపు ఊపిన స్త్రీవాదం ఇవ్వాళ్ళ ఎందుకో ఉధృతి తగ్గించుకుంది. నిజానికి స్త్రీవాదం సాహిత్యం ద్వారా చేసిన అనేక ప్రతిపాదనలు కొంతవరకైనా ఫలించాయని గట్టిగా చెప్పలేం. వివాహ వ్యవస్థను కుటుంబ వ్యవస్థను కూడా స్త్రీవాదం ఒక దశలో సవాలు చేసింది. కానీ స్థానిక పరిస్థితులలో జరిగిన ఒక సమన్వయం వల్ల స్త్రీ వాదంలో ఒక ఆచరణాత్మక దశ ప్రవేశించింది. మనిషి మనుగడకు వివాహం, కుటుంబం అనివార్యం అనే సోయి సాహిత్యంలో ప్రవేశించింది. ఫలితంగా ఈ స్త్రీ వాదాన్ని సమాజానికి కావలసిన మేర మనం తప్పక అంగీకరించాల్సి వస్తుంది. కానీ ఆనాటి సీనియర్ సృజనకారులే తప్ప కొత్తగా వస్తున్న వాళ్ళు దీన్ని అంతగా పట్టించుకోవడం లేదు. కొందరు కవయిత్రులు తాము స్త్రీవాదులం అని చెప్పుకోవడానికి కూడా ఇష్టపడకపోవడం ఒక విషాదం.

స్త్రీవాదాలు, స్త్రీల హక్కుల మాట ఎట్లా ఉన్నా, సాధారణ స్త్రీల పైనా జరిగే అత్యాచారాలు మాత్రం ఆగడం లేదు. భారతదేశంలో 2023లో రిజిస్టరయిన కంప్లైయింట్స్ 28,811. ఉత్తరప్రదేశ్‌లో అధికంగా ఈ కేసులు రిజిస్టర్ కావడం చూస్తున్నాం.

విద్యావంతులు, సాహితీవేత్తలు చేసే ప్రతిపాదనలు వాళ్ళ మధ్యే తిరుగుతున్నాయి. వాళ్ళు చెబుతున్న చైతన్యం సామాన్య ప్రజలకు ఎంతమాత్రం చేరడంలేదు. ఇందుకు అవిద్య ఒక కారణమయితే ప్రతిపాదిత సిద్ధాంతం ప్రజలందరి కొరకు అనే భావన లేకపోవడం ఒక కారణం. సాహిత్యం అనేది ప్రజలందరికీ చెందినది అని కాక ఏదో కొంత మందికే పరిమితమైందనే దురవగాహన కూడా దీనికి కారణమే. ఇది విద్యావంతులలో కూడా ఉండడం శోచనీయం. తన రచన పాఠకులకు చేర్చే విధంగా చదివించే గుణం రచయిత శైలిలో ఉండాలి. అంటే రచన పాఠ కాశ్రితం అయి ఉండాలి. అదే సమయంలో పాఠకుడు కూడా రచనను ఆకలింపు చేసుకునే స్థాయికి ఎదగాలి. ఇది పరస్పర సహోద్యోగం. ఈ రెండు సమన్వయం జరిగినప్పుడే రచనా లక్ష్యం పాఠకున్ని చేరుతుంది.

అంటే సాహిత్యంలో ప్రతిపాదించే అంశాలు ప్రజలకు చేరడానికి అనే సోయి ఉంటే ఆదర్శాలు తొందరగా ఫలవంతమౌతాయి.

ఈ స్పృహతోనే మహిళా దినోత్సవ ప్రత్యేక సంచికను తీసుకొస్తున్నాం. ఈసారి సంచికలో కేవలం స్త్రీల రచనలే కాకుండా మహిళా దినోత్సవానికి సంబంధించిన ఒకటి రెండు పురుష రచయితల రచనలకు కూడా చోటు ఇచ్చాం. అదేవిధంగా సీరియల్స్‌ని పురుషులవే అయినా కొనసాగించాం. గత సంచిక తరువాయి వేయవలసిన సుంకేపల్లి నాగేంద్ర శర్మ వ్యాసం ఒకటి వచ్చే సంచికకు వాయిదా వేయవలసి వచ్చింది చాలా కారణాలవల్ల.

మా ఈ కృషి వల్ల ఏ మహిళ ఎంత మాత్రం చైతన్యం పొందినా, ఇది ఫలవంతమైందని భావిస్తాం. ఇప్పటికే మహిళా దినోత్సవ సంచికలు మూడు తెచ్చాం. మీ ఆమోదాన్ని అభిమానాన్ని ఆశిస్తున్నాం.

సమస్త మహిళాలోకానికి శుభాకాంక్షలు.

కవిత కల్వకుంట్ల

**జై జాగృతి! జై తెలంగాణ!!**

ఈ మాసం కవయిత్రి జ్వలిత అసలు పేరు విజయ కుమారి దంచనాల 11/3/1959లో ఈమె జన్మించారు. ఎమ్మే తెలుగు ఎం.ఎస్.సి. సైకాలజీ కూడా చదివిన ఈ కవయిత్రి కాలాన్ని జయిస్తూ మర్డర్ ప్రొలాంగేర్, సుదీర్ఘ హత్య, ఆత్మాన్వేషణ, అగ్నిలిపి వంటి కావ్యాలను విరచించారు. ఈమె విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయిని. బహుళ అంతర్జాతీయ అంతర్జాల త్రైమాసిక పత్రిక, జీడి పబ్లికేషన్స్, కథా సాగరం, యూట్యూబ్ వంటి ఛానళ్లు ఈమె ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. మహిళా దినోత్సవ ప్రత్యేక సంచిక కోసం ఈమె స్వాభిమానాన్ని చాటుతూ రాసిన ఈ కవిత, తంగేడు పాఠకుల కోసం....

# కొత్త చరిత్ర రాస్తాం



జ్వలిత, 99891 98943

సంఘం కోసం సభ్యులా..?
సభ్యుల కోసం సంఘమా..?
ఈ నిరంకుశ పాలన మీమాంసల్లో
మీనమేషాలు లెక్క తేల్చక ముందే
మేమంతా భారతీయులమే
ఉపేక్షల వరదల్లో తడిచిన ఉప్పు బస్తాలం

లేని వాళ్ళమనీ..
ఏదీ లేని వాళ్ళమనీ..
దేశమే లేని వాళ్ళమనీ..
చెప్పుకునే అవకాశం కూడా లేని వాళ్ళం
మా జనం ఎంతో లెక్క తెలవదు
మేము ఎవరమో గణన ఉండదు
మేము ఏమేమి చేస్తామో లెక్కుండదు
మాకు ఏమీ అవసరమో
అధ్యయనం ఉండదు
మాపై ఏమి జరుగుతుందో
ఎవరికీ ఎరుక ఉండదు
మా పట్ల అన్నీ ఉల్లంఘనలే
మిగిలేదంతా ఉపేక్షల ఊకపొల్లే

ప్రతి చోటా ఉంటాం..
అందరి మాట వింటాం..
ఏ ఎజెండా లేకుండా అన్ని జెండాలు మోస్తాం
కలాలు గళాలతోపాటు భుజాలు అందిస్తాం
అన్ని ఉద్యమాల్లో బలిదానాలవుతాం
మతం ముసుగేసుకున్న అరాచకాన్ని గుర్తిస్తాం
కులం రాజకీయ జూదాలను పసిగడతాం

అయినా..
మాకు అసలు మెదళ్లే లేవని
ప్రచారం చేస్తారు కొందరు
మా అక్షరాలకు
వక్ర భాష్యం చెప్తారు ఇంకొందరు
మన మూలాలన్నీ ఒకటే
మనమంతా సహ ఉదరులం
అంటూనే
మా పైటలు గుంజుతారు మరికొందరు
మా తొడలు గిల్లి
జోల పాడుతుందో తల్లి

అయినా మేమంతా
మీ నాయకత్వాలను నమ్మి గొర్రెల
మందలమవుతామ్

మా మీద మేమే మన్ను పోసుకుంటాం
మీ ఉసిగొల్పులకు ఊర కుక్కలమై
మాలో మేమే పోట్లాడుకుంటాం..
కండలూడి వచ్చేట్టు కాట్లాడుకుంటాం..
నెత్తుటేరులు పారేట్టు
కత్తులతో నరుక్కుంటాం..
మీరంతా చిద్విలాసంగా చూస్తూ
మీ ఎత్తుగడ పారినందుకూ
మీ రంకు రాజకీయ చదరంగంలో
ఎప్పటిలా
మేము అమాయకపు పావులైనందుకు
తృప్తిగా నవ్వుతుంటారు

మనమంతా భారతీయులం
రాజ్యాంగ ఛత్రి నీడన పుట్టగొడుగులం
పాతదే మతం
కొత్తగా ఉన్మత్త పాచికలాడే వేళ
మీ పాలిట ఉరితాళ్ళమవుతాం

అధికార మదాహంకారంతో
రైతులపై పెల్లెట్ల పేలుతుంటే
రాబోయే ఎన్నికల్లో ఓట్లజల్లెట్ల
మీ అధికార కుత్తుకలు కత్తిరిస్తాం

బళ్ళల్లో సిలబసు మార్చి
పసి మెదళ్ళలో విషాన్ని నింపి
గుళ్ళల్లో మతం కులం కలిపి
గరళం కక్కుతున్నప్పుడు
మేము ఆటం బాంబులమై
మీ పునాదులు కూలుస్తాం
దేశచరిత్రను తిరగరాస్తాం

నాటి కథ

# ఎదల్లోని పొరలు

బాధను దాచుకున్న ఒక జంట కథ...



పి. యశోదారెడ్డి

కొత్తగా మొలిచిన భుజకీర్తుల్లా, శ్రీహరిని ఎడబాయని శంఖచక్రాల్లా నా పదోన్నతితో నాకు వో అడెండరూ, వో పి.యే అంటూ యిద్దరు వ్యక్తులు సదా నా వెంట వుండటం మొదలైంది.

ప్రకృతి సిద్ధంగానే నాకు కొన్ని పనులు చేతకావు. మరికొన్ని చిన్నచిన్న పనులు అసలే తెలియవు. అలాంటి నేను ఈ ఇద్దరి రాకవల్ల మరీ సుఖభోక్తలా మారిపోయాను. ప్రతి విషయానికి ప్రోటోకోలంటూ ఒకటి అడ్డురావడంతో నేను మరీ కాబోయే యువరాజు, రాచమర్యాదలను జీర్ణించుకునే తర్ఫీదు పొందుతున్న స్థితిలో పడిపోయాను.

సరే! వో వైపు ఆనందం, మరోవైపు ఇబ్బంది, రెండూ వున్నాయి లెండి. నాణెం అన్నాక బొమ్మా బొరుసు వుండి తీరాల్సిందే కదా!

ఆ రోజు అర్జంటుగా టూరు వెళ్లాలి. ఇంకా అలవాటు కాని మూలాన ప్లేను వద్దు, రైల్లోనే ప్రయాణం చేస్తానన్నాను. ఏర్పాటైంది. ఈ పదవితో మా యింట్లో ఇన్నాళ్లలాగా మా వాళ్లకు, నాకు తోడుగా స్టేషను వరకు వచ్చి బోగి అదీ చూచి నన్నా సీట్లో కూర్చోబెట్టే బాధ్యత నుండి విముక్తి లభించినందుకు సంతోషంగా వున్నారు. ఇప్పుడా బాధ్యతంతా పాపం మా పి.యే, అటెండర్ల వశమైంది. నేను వారి మాట వింటూ వారినీ వో మనుష్యుల్లా గౌరవిస్తున్నాను. చాలా మంచిదాన్ని అంటూ వారు సంతోషంగానే వున్నారు.

స్టేషను బాగా రద్దీగా వుంది. వచ్చిపోయే జనసందోహంతో మార్గమంతా కిక్కిరిసిగా వుంది, కొంచెం ముందు వెనకగా (మరీ సమానంగా నడవకూడదు కాబట్టి) మా పి.ఏ.గారు చకచక నడకలతో నడుస్తూ నా వునికికే వో ప్రత్యేకతను కల్పిస్తున్నారు. అంతేకాదు తప్పుకోండి, తప్పుకోండి అంటూ జనాన్ని హెచ్చరిస్తూ వెంటనే దారివ్వని ముసలీ, ముదుకను అవతలికి తోస్తున్నాడు. ఇదంతా నా కోసమే? గర్వంగా ఫీలయ్యాను.

ఇంతలో మాంచి వొడ్డూ పొడుగులతో కండరాలు బలిసిన నలుగురు మొనగాండ్లు నా దారికి అడ్డంగా నడుస్తూ కనిపించారు. చూచీ చూడనట్లు బరాబరులు మాని, కిక్కురు మనకుండా నేల చూపులు చూస్తూ 'అమ్మగారు! కాస్త జాగ్రత్త, నెమ్మదిగా నడువండి' అంటూ హెచ్చరిస్తూ నన్ను వో అపురూపమైన గాజు వస్తువులా కాపాడుకుంటూ నడిపిస్తున్నారు, పి.ఏ.గారు.

ఆశ్చర్యం వేసింది. లోకజ్ఞానంలో నేను సున్నాగా మిగిలాను. తెలిసికోవలసిందీ, చేయవలసింది, సాధించవలసిందీ ఎంతో ఉందనుకున్నాను.

వెంటనే ఆలోచనల్ని కట్టిపెట్టి ముందుచూపుతో నడుస్తూ ప్లాట్‌ఫారం మెట్లెక్కీ దిగి నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ ఫస్ట్ క్లాస్ పెట్టెలో ఎక్కి కూర్చున్నాను. పాపం తన సీటు వెతుక్కునేందుకు మా పి.ఏ. గారు వెళ్లిపోయారు. విధి నిర్వహణలో ఉన్న మజా అది. ఏదో ఘనవిజయం సాధించినట్లు సర్దుక్కూర్చున్నాను.

కొత్తగాలి పీల్చినట్లు హాయిగా ప్రశాంతంగా వుంది. ఇంతలోకే మా అటెండరు మహబూబు వచ్చి 'అమ్మా! డబ్బా అంత ఖాళీగానే వుంది' అన్నాడు. నిజమే! ఏదో వెలితిగా తోచింది. ఓ అయిదు నిముషాల తర్వాత క్యాబిన్ అవతలికి వచ్చి చూచాను. నాది ఆరో నెంబరు. నా తరువాత 7. 8 (జి. హెచ్) అంటూ రెండుంటాయి. అంటే ఈ 'ఎఫ్' బోగీలో దాదాపు 50 ప్రయాణికులైనా వుండి వుండాలి. అయినా ఏ ఒక్కరూ మెసిలిన జాడకానీ చీమ చిటుక్కుమన్న సవ్వడి కానీ వినిపించలేదు.

ముఖం వాచినట్లు, రవ్వంత మనుషుల అలికిడి కోసం చెవులు నిక్కబొడుచు కున్నట్లు అనిపించింది. పోనీలే బెడ్‌రోల్స్ ఇచ్చే వాడైనా వస్తాడుగా అనుకున్నాను. వాడు రాలేదు. నేను పెట్టె తెరచి దుప్పటి తీసి పరచుకుని శాలువా కప్పుకుని పడుకున్నాను చేసేది లేక. అయినా రావలసిన బంధువుల కోసం ఎదురు చూస్తున్నట్లు, కిటికీ లోంచి ఆత్రంగా చూస్తూనే వున్నాను.

సికింద్రాబాదు రానే వచ్చింది. జనం కిటికిటలాడుతున్నారు. అందరూ సామాన్యంగా పెట్టెలు సంచులు మోస్తూ ఎక్కేందుకు హడావుడి పడ్తూనే వున్నారు.

నిరుత్సాహపడింది మనస్సు. వీళ్లంతా ఫస్ట్ క్లాస్ ఎక్కే యోగానికి నోచుకున్నవారు కాదు. అప్పుడు నాకు క్యాపిటలిస్టిక్ వ్యవస్థపైన ఏవగింపు కలిగింది.

కలిమి లేములే కదా! ఈ తారతమ్యాలకు కారణం. మనిషిని మనిషిని వేరుచేస్తూ సాంఘికంగా, సాంస్కృతికంగా అఘాతాన్ని సృష్టిస్తున్నది డబ్బే! అదే చెడ్డది. ఛ ఎంతమాట డబ్బులేంది నీవెక్కడ వుంటావు? డబ్బు అవసరమే అయినా దాని నియంత్రణలో పంపిణీలో, ఫలానుభవంలో వివేచనా, విచక్షణలు పాటించాలి. సరైన ప్రణాళికా స్వరూపం ఏర్పడాలి అంటూ రూపొందించవలసిన మన ఆర్థికవ్యవస్థనూ సోషలిస్టిక్ సిద్ధాంతాలను గూర్చి ఆలోచించడం మొదలుపెట్టింది మనసు.

ఇంతలోనే చిన్నపాటి మడత మంచమంత సైజులో వున్న వో పెట్టెను మోస్తూ కూలీవాడు ముందు నడుస్తూ వుంటే వో భార్య భర్తల జంట కూతురితో కూడా వచ్చి ఎక్కి కూర్చున్నారు నా ముందు సీట్లో.

నాలో యింతవరకు విరాజమాన మౌతూన్న తాత్వికుడూ అర్థశాస్త్రవేత్త నిష్క్రమించారు. మళ్ళా నేను, నేనై మిగిలాను. ఆసక్తిగా చూస్తున్నాను. వచ్చిన జంట చిన్న సామాన్లన్ని సర్దుకున్నారు. తెచ్చిన పెట్టెను యిద్దరూ కలిసి కష్టంగా పైకి ఎక్కించి సర్దుక్కూచున్నారు. రాత్రి పూట కాబట్టి వాళ్లు పక్కలు వేసుకున్నారు పడుకునేందుకు.

అమ్మో! మనుష్యులు, నేను ఎదురుచూచిన మా వాళ్లు. కడుపు నిండింది. ఇకేం పర్వాలేదు. తోడున్నారు. ఏ కలత లేకుండా హాయిగా నిద్రపోతాననుకున్నాను. కానీ అలా నిశ్చింతగా పడుకునే అవకాశాన్ని నాకు దూరం చేసింది, యిప్పుడిప్పుడే వచ్చి చేరిన నా బంధువర్గం, అదే నా ముందున్న జంట 'హంసఫర్' ఆదిలోనే హంసపాదం పడింది.

ఆ జంటలో కత్తి ధారలాంటి నోరున్న భార్యామణి భర్తను వుద్దేశిస్తూ... 'డియర్ బి కేర్ఫుల్ విత్ ద లగేజ్, టు బి ఆన్ ద సేఫ్ సైడ్. ప్లీజ్ టేక్ ద చైన్ అండ్ టై అఫ్ ది ట్రంక్స్ టుగెదర్', అంటూ యింగ్లీషులో వుత్తర్వులు జారీ చేసింది.

భర్త వోపిగ్గా "డోంట్ వర్రీ డార్లింగ్. నేను చూసుకుంటానుగా. నీవు పడుకో" అన్నాడు. అనునయంగా.

వెంటనే భర్త అనబడే భృత్యుడు క్యాబిన్ అంతా ఆక్రమించిన చిన్నా పెద్ద మాంచి లెదర్ బ్యాగులను ఓ పెద్ద గొలుసు తీసి ఇందాకటి దయ్యెప్పెట్టెతో కలిపి ఖైదీలను బేడీలు వేసి కలిసికట్టుగా లాక్కెళ్లుతున్నట్లు కట్టివేసాడు. మధ్యమధ్యలో భార్య విలాసంగా రిలాక్సౌతున్న పొజిషన్ నుండి కాస్త లేచి తలెత్తుతూ సవరణలు సూచిస్తూనే వుంది. ఆ సూచన వెంటనే కార్యరూపాన్ని ధరిస్తూవుంది. భర్త వస్తువులన్నీ జాగ్రత్తగా సర్దేశాడు. కూతురు ఏమీ మాట్లాడకుండా తల్లిని అనుకుని చూస్తూ కూర్చుంది.

నేనేదో పసిపాపలా యింతకింతకు ముడ్చుకుపోతూ పడుకున్నాను. సర్దుబాటైన తరువాత భర్తగారు చేతులు దులుపుకుంటూ 'ఎస్ డార్లింగ్, నౌ ఎవ్రి థింగ్ ఒ.కె.' అంటూ కూతురికేసి చూస్తూ-

'నౌ కమాన్ స్వీటీ! యు గో అప్' అంటూ కూతుర్ని అటుకు ఎక్కిస్తున్న సామానులా పై బెర్తు ఎక్కించాడు.

ఈ జంట అమెరికాలో నివసిస్తున్న యన్.ఆర్.ఐ కి చెందిన తెలుగు కుటుంబంలా కన్పిస్తున్నారు. స్వదేశాభిమానంతో తమ వూరొచ్చి వెళ్లిపోతున్నట్లు కన్పించింది. భర్త బాగా చదువుకుని స్టేట్సులో పెద్ద వుద్యోగం చేస్తున్న వాడిలా వున్నాడు. భార్యకు అమెరికన్ పోకడలు బాగా వొంటబట్టినట్లున్నాయి. ఆమె యింగ్లీషులో మాట్లాడ్తేనే గౌరవంగా భావిస్తూ, అది కాస్త అలవాటుగా చేసుకున్న బాబతులా వుంది.

వీళ్లిద్దరూ నైటీలు ధరించి బిడ్డకు గుడ్నైట్ కిస్‌లు యిచ్చేవరకే టైం పదకొండున్నర దాటింది.

దుప్పటి ముసుగు తన్ని శరీరం నిద్రను అభినయించినా, మేల్కొన్న మెదడు మాత్రం ఎదుటివారి సంభాషణను చెవుల్లోకి పంపుతూ తిరిగి తాను స్వీకరిస్తూ యనలైజ్ చేస్తూనే వుంది.

తొలుదొల్త, ఎదుటవున్న నాకు తెలియకూడదనే ఐడియాతో కాబోలు యింగ్లీషులో ప్రారంభమైన సంభాషణ కాస్త రానురాను తెలుగులోకి మారింది.

తరతరాలుగా ఇలా ప్రారంభమైన సంభాషణ వేడెక్కుతూ వచ్చింది. ఈ సందర్భంలో భార్య, భర్తపై వురుముతూ 'ఏంటీ?' మీ వారికి పూర్తిగా కర్టిసీస్ కూడా తెలియవా? ప్రేమాభిమానాలు ఎలాగూ లేవు' అంటూ కట్టె విరిచినట్లుగా భర్తవైపు వారిని గూర్చి నిందలు వేస్తూ మాట్లాడుతుంది.

అందుకు భర్త, అభిమానాన్ని చంపుకోలేక భార్యను నొప్పించలేక-

అయితే? జయా! వాళ్లు మనకు చేసిన లోటేమిటి? లోపం ఎక్కడ జరిగింది? అన్నాడు. మీరెప్పుడూ ఇంతే, పెళ్లై పదిహేను సంవత్సరాల బట్టి చూస్తున్నానుగా? ఏనాడైనా మీవాళ్ల తప్పు వో చిన్న పప్పురవ్వంత కూడా



కనిపించిందా? లేదు. ఇక్కడున్నన్నినాళ్లు సరే! ఇప్పుడు అయిదేళ్ల బట్టి అమెరికాలో వుంటూ, చుట్టాలున్నారనే మమకారం వల్లేగా యింత డబ్బు తగలేసుకుని వచ్చిందీ? మీ కుటుంబం ఎప్పుడూ ఏదో భారతీయ సంస్కృతినంతా నెత్తినేసుకు మోస్తున్నట్లు ఆచారం, సంప్రదాయం, రీతి, రివాజులంటూ మా ఘనంగా మాట్లాడుతూ గొప్పలు పోతారు. మరి నా విషయంలో ఏమైంది' అంటూ సాధిస్తున్న భార్యకు అడ్డు తగుల్తూ.

'పోనీ జయా! ఇప్పుడవన్నీ ఎందుకు? ఎవరి చాదస్తం వాళ్లది. దాంతో యిప్పుడు మనకేం పని. హాపీగా వెళ్లిపోదాం. తియ్యటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ, మళ్లా ఎప్పటికి వస్తామో? మాతృభూమికి.'

'వచ్చింది చాలు. అది కాదండీ! నాకు తెలియక అడుగుతాను. లేకలేక వచ్చాం కదా! వచ్చారన్న ఆదరం, ప్రేమలు ఎక్కడా కనిపించలేదు. పోనీ లాంఛనంగానైనా ఓ నూలు చీర, వో రెండు రవికెలు, పోనీ నా బిడ్డకు వో పట్టుపరికిణీ ముక్కైనా కొనిపెట్టారా? పైగా మనమే వాళ్లకీ, వీళ్లకీ అంటూ బోలెడు డాలర్లు పోసి గిఫ్టులనీ సింగినాదం అనీ పట్టుకొచ్చాం. ఆ మాత్రం రిటర్న్ గిఫ్టుగా ఏదైనా వో మంచి క్రాఫ్ట్ కొని యివ్వొచ్చుగా? ఆ మాత్రం యింగితజ్ఞానం మీవాళ్లకు వుంటేగా? అంటూ పొడిచింది.

"ప్లీజ్! ఫర్ హెవెన్స్ సేక్ స్టాప్' అంటూ అసహనాన్ని ప్రకటిస్తూ. 'జయా! ఏంటి? నీ పిచ్చి? మనం ఇక్కడికి వచ్చింది నాలుగు రోజుల పాటు అందరితో కలిసి సుఖంగా గడపడానికి గాని, వాళ్లిస్తే గాని గడవక కాదు. చూడూ! నీకు చీరలకేం తక్కువ? కావాలీ అంటే ఎంతైనా సరే నీకు నచ్చిన పట్టు చీర కొనుక్కో.' అన్నాడు. ఆ మాట విన్న వెంటనే-

అబ్బబ్బో! ఎంత ప్రేమ? కొనిస్తాడట, కొనిస్తాడు. ఈ డబ్బు మాత్రం ఎవరిదని? వీళ్లకోసం ఈ ప్రాంతాలకు వచ్చి రోడ్లు సరిగ్గాలేక మంచినీళ్ల సౌకర్యం లేక దుమ్ము ధూళి కొట్లాడుతున్న వూళ్లెంటపడి చుట్టపు చూపులకంటూ వెళితే అలవాటు తప్పిన ప్రకృతులు ఈ కలుషిత వాతావరణంలో యిముడలేక ఇన్ఫెక్షన్ సోకి బాధపడ్తూ నానా మందులు మింగి వెళ్లాలి. మీరేమైనా అనండి, నాకు మీ చెల్లెలు అంటేనే అసహ్యం' అంటూ కటువుగా మాట్లాడింది.

దీంతో బాగా కోపం వచ్చింది ప్రభాకరానికి. (మాటల సందర్భంలో తెలిసింది. భర్త పేరు ప్రభాకర్. వుద్యోగం ఇంజనీరింగ్ కంపెనీలో. భార్య జయ అంటూ) ఈమారు ప్రభాకర్ కంఠాన్ని బాగా పెద్దదిగా చేస్తూ -

Please tell me frankly, what is your idea? do you want me to cut all my connections with my family? that is impossible, take care" అంటూ వో వార్నింగ్ లాంటిది యిస్తూ చీదరించుకున్నాడు.

అప్పుడు జయగారు, ఎప్పుడూ సమయానికి ఆదుకునే ఆత్మబంధువుల్లా పిలిస్తే పలికే చెలికత్తెల్లా వుండే కన్నీళ్లను ఆసరాగా తీసుకుని డగ్గుత్తికతో -

'ఇలా మీరు అర్ధరాత్రీ, అపరాత్రీ నాతో మీ బంధువులను వెనకేసుకొచ్చి గొడవపడడం నాకిష్టంలేదు' అంటూ లైటు ఆర్పే ప్రయత్నంలో విసురుగా లేచింది. అలా లేచి లైటు స్విచ్ నొక్కుతూ వున్న భార్యను ప్రియురాలిని లాలిస్తున్న ప్రియుడిలా ఇంజనీయరుగారు అమాంతం రెండుచేతులా అందుకుని పసిపిల్లలా వళ్లో పడుకోబెట్టుకుని ఎంతో అనురాగంతో 'ప్లీజ్! జయా! మై డార్లింగ్!' అంటూ తల నిమురుతూ చెంపలు చుంబించాడు.

అటువైపు తిరిగిన నేను ఎక్కడ కదుల్తానో? రసభంగం చేస్తానో? అంటూ వూపిరి బిగబట్టుకున్నాను. ఫ్రీగా నా ఎదలో దాగిన తియ్యటి కోరికలు చిగిరించగా, మాదే విజయం అంటూ వో గర్వరేఖ ధాటిగా విజయపతాక ఎగురవేసింది.

భర్త బుజ్జగింపులతో కోపం చల్లారిన జయకు కూతురికి మందు యిచ్చే విషయం జ్ఞాపకం వచ్చింది. 'ప్లీజ్ పాపను లేపుతాను మందు యివ్వండి' అంటూ భర్తను స్వీట్‌గా రిక్వెస్ట్ చేసింది.

"అయ్యో!' మర్చిపోయానంటూ కంగారుగా లేచి ఎన్నో బుజ్జగింపులతో మందు తాగించే ప్రయత్నం చేస్తున్నాడు. అయినా ఆ పిల్ల ఆయన మాటలేవీ పట్టించుకున్నట్లు లేదు. తల్లి లేచి బలవంతంగా వో పొట్లం విప్పి నోట్లో వేసి 'అది చప్పరించి నీళ్లు తాగు' అంది. ఇంత అన్నా ఆ పాపగారి చూపుల్లో ఏ అర్థమూ స్ఫురించలేదు. ఏదో నిర్లక్ష్యంగా నవ్వుతున్నట్లు కనిపించింది.

పిల్ల ప్రసక్తి రాగానే నాకు అప్పుడే మెలకువ వచ్చినట్లు నేను పక్కమార్చి ఇటు తిరిగాను. ఆ పిల్లవైనం చూచి -

'ఓహో! అమెరికా పిల్లల ట్రేనింగ్ చాలా బాగా బుద్ధులు నేర్పుతున్నట్లుంది. ఎంతో బాగుంది. తలిదండ్రులూ సహిస్తూ చూస్తున్నారు. కన్నవారి మాటకు విలువ చిన్న మెత్తులేకపోయినా కనీసం వెటకారం లేకున్నా బాగుండేది. పైగా ఆడపిల్ల. అయ్యో! జాతి భవిష్యత్తు ఏం కాను! అంటూ అక్కడుంటున్న తన వారిని గూర్చి నా మనస్సు ఆందోళన పడింది.

పాపం! గిరీశం తర్ఫీదు పొందుతున్న వెంకటేశాన్ని చూచి కరటకశాస్త్రి యిందుకేనేమో బాధపడివుంటాడు. జన్మతః వచ్చిన బుద్ధులకుతోడు పరిసర ప్రభావం, శిక్షణా విధానం, సాహచర్యం ఎంతో ప్రభావాన్ని లేత మనస్సులపై చూపుతాయి. అందుకే 'కొమ్మై వంగంది మానై వంగుతుందా' అనే సామెత పుట్టి వుంటుంది. వో పర్సనాలిటీ అంటూ ఫార్మ్ కాకముందే తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది అంటూ నిర్ణయించింది నా మనస్సు. ఆలోచనలతో అలసిపోయిన నా మనస్సుకు యింకా ఆలోచించేందుకు వోపిక లేనట్టయింది. ఏమైతేనేం, నేను చేసేదేముంది? అంటూ ఆ వైపు చూడకుండా నిద్రలోకి వెళ్లిపోయాను.

ఏదో స్టేషన్‌లో రైలు ఆగినట్లుంది. తెల్లవారిందేమో? చాయ్, కాఫీ అంటూ

అమ్ముతున్నారు. అయినా చలికి ముసుగు తన్ని పడుకున్న వాళ్లెవ్వరూ లేవలేదు. మెలకువ వచ్చిన నేను, అటూ యిటూ కదిలి లేవబోయాను.

ఇంతలో నా తలపై ఏదో బరువైన మూటలాంటి వస్తువు ఠపీమని పడింది. ఏదైనా ఘోరప్రమాదం జరగబోతుందా? ఆ కుదుపుకు అతలాకుతలమై వస్తువులన్నీ దొర్లి పడబోతున్నాయా? అంటూ కలియజూచాను. పడ్డ వస్తువును లేచి కూర్చుని చేత్తో తాకి చూచాను. అది ఓ పర్సులా వుంది. అందులో పెట్టిన సౌందర్య ప్రసాధనాలతో బరువుగా వుంది.

వారి ప్రమేయంలేకుండానే వాళ్ల వస్తువు నాపై పడి బాధ కలిగించినందుకు ఆ పిల్లనో, కాక వాళ్ల తల్లిదండ్రో! సారీ చెబుతారనుకున్నాను. ఎవ్వరూ నోరు కదపలేదు. పడిన ఆ వస్తువు కనీసం తమదంటూ కూడా తీసుకోలేదు. చేసేది లేక నేనే ఆ పిల్లతల్లిని లేపి ఆ పర్సు చేతికందించాను 'పై నుండి మీ అమ్మాయి పర్సు పారవేసుకున్నట్లుంది' అని అంటూ, ఆపిల్ల మెలకువగానే వుంది. మళ్లా గుడ్లప్పగించి చూస్తూ నవ్వుతుంది.

'ఛీ! ఛీ! ఎంత అహంకారం. ఎంత డబ్బున్నా యింత కావరమా? ఏ కోశానా సంస్కారం, సభ్యతలు అంటూ లేకుండా పశువుల్లా ప్రవర్తిస్తున్నారంటూ ఏవగింపు పుట్టుకొచ్చింది.

తల్లి ఆ పర్సు తమదేనన్నట్లు తలూపి దాన్ని చేతిలోకి తీసుకుని 'అమ్మా! స్వీటి బేబీ! యిలా చూడు! నీ పర్సు పారేసుకున్నావ్, తీసుకో తల్లి' అంటూ అందివ్వబోయింది. అయినా ఆ స్వీటిలో ఏ సంచలనమూ లేదు. అందమైన కళ్లతో ఎక్కడో చూస్తుంది. తనలో తానే నవ్వుకుంటుంది. ఆ చూపులు కళావిహీనమై గాజువారిన చూపుల్లా వెర్రిగా వున్నాయి. అప్పుడు గాని నాకు అర్థం కాలేదు ఆ అమ్మాయి మానసిక రోగి అన్న విషయం. ఆ క్షణంలో అంత ఎత్తున బిరుసుగా కనిపించే ఆ కుటుంబం వారు కుదింపబడి, కుప్పగూలి దైన్యపు ముద్దల్లా కనిపించసాగారు. సొగసుతో ఐశ్వర్యంతో భర్త ఆదరంతో తనకెవ్వరూ సాటిలేని సత్యభామలా వున్న జయగారి గర్వమంతా నేలపాలు కాగా ఆమె తాను చెయ్యని తప్పుకు అవమాన భారంతో కృంగిపోతున్నట్లు, అపరిచితనైన నాముందు భంగపడినట్లు ఆమె కళ్ల నీళ్లొత్తుకుంది.

అప్పుడు నాకు తెలిసొచ్చింది. ఆరోగ్యాన్ని మించిన భాగ్యం మరోటిలేదని. శారీరక రోగం కన్నా యీ 'మెంటల్ యిల్‌నెస్' తీవ్రతరమైన పీడ. ఇది వ్యక్తిని అన్నివిధాల కొరగాని స్థితికి దిగజారుస్తుంది. యిది శాపగ్రస్తులు అనుభవించే పాపఫలం లాంటిది. యిది సోకిన వారినే కాదు, భరించే వారిని చూచేవారినీ సుఖంగా ఉండనివ్వదు. మరీ చిన్న పిల్లలైతే తల్లిదండ్రి అనుభవించే నరకం అంతా యింతా అంటూ అంచనా వేయలేం. అందుకే, కన్నవారు యిదేదో నలుగురికి తెలియకూడని అపవాదుగా భావిస్తూ, రోగాన్ని చాలాకాలం వరకు దాచిపెడ్తూ వుంటారు. అది కాస్త ఏకుమేకై చేయిదాటుతుంది. యీ దంపతులు అన్నీ తెలిసినవారు కాబట్టి వోపిగ్గా చికిత్స చేయిస్తున్నరు. పిల్ల బొమ్మలా వుంది అని ఆలోచిస్తున్న నా మనసు ఆ పిల్ల తల్లి జయవైపు మళ్లింది.

పాపం! జయ యింతటి చిచ్చును గుండెల్లో దాచుకుని పైకి ఎంతో కేరీగా అహంకారిగా, గయ్యాళిగా కన్పిస్తుంది. తన బాధను కప్పుకునేందుకు తొడిగిన బురఖా ఈ ప్రవర్తన అంటూ నేను గ్రహించగానే ఎక్కడలేని సానుభూతిని జయపై వొలికించింది నా మనసు.

నిజమే! ప్రపంచంలో ఏ జీవి పరిపూర్ణమైన సుఖసంతోషాలను అనుభవించడం లేదు. ధనం, హోదా చక్కదనం చదువు తెలివి అన్నీ వున్నా ఏదో వెలితి, ఏదో బాధ, ఏదో లోపం ఆ మెరుపుల్లో దాగి కుమ్మరిపురుగులా తొలుస్తూనే వుంటుంది. అందుకేనేమో బుద్ధ భగవానుడు సకల సుఖవాసమైన సంసారిక జీవితాన్ని త్యజించి పరమసుఖ సంపాదన కోసం పడరాని పాట్లు పడ్డాడు. కాకపోతే అమృతకుల్య వంటి భార్యను రసగుళికవంటి నవజాత శిశువునూ వదిలి వెళ్లతాడా?

ఇదేం వెర్రి నాకు. వేదాంతం ముదిరినట్టుంది. తాత్త్విక చింతనం వైపు గమిస్తున్నాను. ఇంకా చేయవలసింది ఎంతో వుంది. ఇప్పుడే వైరాగ్యం వద్దు అంటూ అటు వైపు తిరిగి నేనే ఏదో సందర్భాన్ని కలిగించుకుని ఆ దంపతులను సంభాషణలోకి దించాను. అప్పుడు నాకు తెలిసొచ్చింది జయ మనస్సు అద్దం లాంటిదని. ఇంతవరకు ఆమె భర్తతో వ్యవహరించిన విధానానికీ ఇప్పటికి ఎంతో తేడా కన్పించింది.

తన కూతురిని ఆప్యాయంగా పలుకరిస్తూ దగ్గరికి తీసుకోగానే ఆమెలో వున్న ఇందాకటి అహంకారం, దురుసుతనం అన్నీ మాయమయ్యాయి. అత్తవారింట్లో తెలిసీ తెలియని బంధువర్గం తనకు ప్రాణప్రదమైన కూతుర్ని చులకనగా చూశారన్న బాధతో దెబ్బతిన్న తన అహాన్ని తృప్తి పరచేందుకు మరో ప్రతీకార మార్గం లేక భర్తవైపు చుట్టాలను చులకన చేస్తూ కఠినంగా మాట్లాడిందే తప్ప నిజానికి జయ అలాంటిది కాదు. సంస్కారం, సభ్యతలున్న వ్యక్తే అంటూ వాదించింది నా మనస్సు. ఇలా నా ప్రయాణం చివరి నిమిషం దాకా పిచ్చాపాటి మాట్లాడుకుంటూనే వున్నాం. మా యిద్దరి మధ్య స్నేహవాత్సల్యాలు దట్టంగా చిగురించాయి. స్టేషను వచ్చిందేమో రైలు ఆగింది. అమ్మా! విజయవాడ వచ్చింది. సిద్ధంగా వుండండి అంటూ మా పి.ఎ.గారు. ప్రవేశించారు.

వెళ్లడానికి సిద్ధపడుతున్న నాకు ఆ జంట నమస్కరించడమే కాకండా స్వీటీ! అమ్మమ్మగారికి నమస్కారం చెయ్యి' అంటూ ఆ పిల్లచేత నా కాళ్లు ముట్టించారు. నా కళ్లు చెమర్చాయి. ఎంతైనా మన జాతి నరనరాల్లో జీర్ణించుకున్న సంస్కారం ఎక్కడికి పోతుంది? అంటూ నా మనస్సు ప్రసన్నంగా నవ్వింది. ఆ అమ్మాయికి దీవెనలు వర్షిస్తూ.

వ్యాసం

# గాజు తెర

**విజయాలకు నేపథ్యాలు అగాధాలే...**




స్వాతీ శ్రీపాద
82972 48988


నాకూ నాకూ మధ్య ఉన్న ఈ గాజు తెరను దాటి ఒకసారి నాలోకి నేను ప్రవహిస్తే ... ఊరూ వాడా ఎక్కడ చూసినా మహిళా దినోత్సవ వేడుకలే.

ఆకాశాన సగం అంటూ ఉపన్యాసాలు, అన్నింటా సమానత్వం కోరడం అదేదో అడుక్కు తింటున్నట్టు... అది జన్మ హక్కైనప్పుడు ఇలా దేబిరించడమో దబాయించడమో ఎందుకు? సగర్వంగా ఆస్వాదించక? సమానత్వం లేనప్పుడు అరచేతుల్లో అధికారాన్ని ఉంచుకుని ఎందుకు వెనకడుగు వెయ్యడం? ఓటు పత్రం మీద సగం స్త్రీలు కనబడనప్పుడు ఓటు వెయ్యకపోడమే గుణపాఠం కదా.

ఊహతెలియనితనం నుండీ వివక్షకు గురయ్యే జాతికి కొత్తగా ఎవరు నేర్పాలి ఎలా పోరాడి సాధించాలో?

హిమాలయాలు ఎక్కవలసిన అవసరం లేదు, అలాగని అణిగి మణిగి గడప చాటున ఆగిపోవలసిన అగత్యమూ లేదు. వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుని స్వేచ్ఛా స్వతంత్ర్యాలు అనుభవించడం ఎవరివ్వాలి గనక?

తొమ్మిదో ఏడో పదో... అంతగా గుర్తులేదు. అసలే ఫెళ్ళున కాస్తున్న ఎండలు... రోజంతా పెనం మీద కాలుతున్న వేడే. దానికి తోడు రేకుల ఇల్లు. అంతకన్నా గొప్పగా బతికే తాహతు లేదు. ఇందూరు ప్రాంతాల్లో ఎండల తాకిడి ఎక్కువే. నలభై ఏడు దరిదాపులకు చేరగానే రకరకాల ఇబ్బందులు రాడం పరిపాటే.

వాటిల్లో పిల్లలను తాకేవి పొంగు, ఆటలమ్మ. ఆ ఏడాది నాకూ ఆ బాధ తప్పలేదు. మొదలు ఒకటి రెండు రోజులు కొంచం ఒళ్ళు వెచ్చబడినా, గొంతు ఇబ్బంది పెట్టినా పెద్దగా పట్టించుకోలేదు. అప్పట్లో ఇలా దగ్గినా తుమ్మినా డాక్టర్ల దగ్గరకు పరుగెత్తే ఆనవాయితీ లేదు మరి. మూడో రోజున ఒళ్ళంతా ముత్యాలు మొలిచినట్టు ఆటలమ్మ పొక్కులు. వెంటనే నన్ను విడిగా ఓ మూలన చిన్న నులకమంచం వేసి పడుకోబెట్టారు.

మంచానికి నాలుగు వైపులా పెరట్లో వేప చెట్టు కొమ్మలు విరిచి తెచ్చి పెట్టారు.

జ్వరానికి మగతగా అనిపించేది.

ఎప్పుడు అమ్మ నాపక్కనే ఉంటే బాగుండు ననిపించేది. కాని నేను అమ్మకు ఒక్కదాన్ని కాదు. మిగతా వారికోసం వండి వార్చాలి, నా కన్నా చిన్న వాళ్ళ అవసరాలు చూడాలి.

పొక్కులు దురదగా అనిపించేవి కాని గోకితే పక్కన వస్తాయని వేపాకుతో సుతారంగా రాసుకోమని చెప్పింది అమ్మ.

మగతగా పడుకుంటే ఏ బాధా తెలిసేది కాదు కాని నిద్రపోడానికే భయంగా ఉండేది, ఏమో నిద్రలోనే చచ్చిపోతానేమో అనిపించేది. తెలీకుండానే నిద్రలోకి జారుకునే దాన్ని. పది రోజులకు పొక్కులు మాడి వేపాకుతో పసుపు నీళ్ళతో స్నానం చేయిస్తుంటే ఒక జ్ఞానోదయం చటుక్కున మెరుపులా తళుక్కుమంది.

ఇంతగా శారీరకంగా మానసికంగా పక్కవాళ్ళకు అల్లుకుపోయే మనిషి ఎప్పుడూ ఏకాకే. ఏ బాధ అయినా ఒంటిగానే అనుభవించాలి. అలాటప్పుడు కావాలనుకున్న దేదైనా ఒంటరిగానే సాధించాలి.

అంతే మళ్ళీ వెనక్కు తిరిగి చూసుకున్నదే లేదు.

అప్పట్లో చెప్పులు కొనుక్కోడమూ ఒక విలాసమే. చాలా రోజులు చెప్పులంటే ఏమిటో తెలియకుండానే పెరిగాము.

ఒకసారి చూసీ చూడక నడిచానేమో పాదంలో గాజుముక్క కసుక్కున దిగబడింది. దాన్ని పళ్ళ బిగువన లాగేసి కారిపోతున్న రక్తం ఆపడానికి పాత గుడ్డ ముక్క ఒకటి చింపి చుట్టుకున్నాను. అది తడిసి ఎరుపెక్కి అమ్మ అడిగే వరకూ చెప్పలేదు.

నొప్పినీ బాధనూ అలవాటు చేసుకున్నాను. ఎవరికైనా పంచితే వాళ్ళేమీ వచ్చి చేత్తో తీసెయ్యలేరుగా. అరిచి ఏడ్చి మొత్తుకున్నా బాధేమీ తగ్గిపోదు. అందుకే మౌనంగానే అనుభవించాలి.

అలాగని అనుకున్నప్పుడు బహుశా పన్నెండేళ్ళో పదమూడో మరి.

ఒంటరి పోరాటం చిన్నప్పుడే ఎంచుకున్నాను.

మామూలుగా ఆ రోజుల్లో కష్టపడి చదువుకునే అబ్బాయిల్లా ఎన్ని బాధలు పడి కాలేజీకి వెళ్ళగలిగానో,...

ఫోన్ రింగవడంతో తుళ్ళిపడి నా గాజుతెరదాటి బయటకు వచ్చాను.

"మహిళా విద్యా వేత్తగా మీ ప్రశంసనీయ కృషికి చిన్న సత్కారం. రేపు మహిళా దినోత్సవ దినాన మిమ్మల్ని సత్కరించుకుంటాము. మీ అనుమతి కోసం..."

నవ్వొచ్చింది.

ఈ రోజున నిజమే ఎన్ని మెట్లో ఎక్కి వచ్చి ఈ శిఖరాగ్రాన నిల్చున్నాను గనక ఈ గుర్తింపు...

ఆరోజున ...

పీయూసీ చదువుతూ పదో తరగతి వాళ్లకు ట్యూషన్ చెప్పుకున్నప్పుడు, పరీక్ష ఫీజు కోసం నానా అగచాట్లు పడి పుస్తకాలు కొనుక్కోలేక లైబ్రరీలో కూచుని చదువుకున్నప్పుడు , చివరికి డిగ్రీ పరీక్షల కోసం క్లాస్ మేట్లకు నోట్స్ లు రాసిపెట్టి, కార్డ్ లు గీసిపెట్టి ...

"మేడమ్ ..."

చేతిలో ఫోన్ గుర్తుకు వచ్చింది.

" అలాగే"

"థాంక్యూ మేడమ్ మా మహిళా కళాశాల పిల్లలకు మీ సందేశాన్ని ఇవ్వాలి. ఆహ్వాన పత్రిక పంపిస్తాము"

కాలేజీ ప్రిన్సిపల్ గారి విజ్ఞప్తి.

అదే కాలేజీలో నేను చదువుకున్నానని ఆవిడకు తెలియదు.

అక్కడ నాకు మిగిలిన ఒక చేదు జ్ఞాపకం మనసును మెలిపెట్టింది. అయినా అది క్షణికమే.

అప్పట్లో రాజకీయ గొడవలు తొలి తెలంగాణా ఉద్యమ సమయం. ఆ ఉద్యమ తీవ్రత వల్ల చివరికి మార్చ్ లో జరగవలసిన యూనివర్సిటీ పరీక్షలను కూడా వాయిదా వెయ్యవలసి వచ్చింది. డిగ్రీ ఫైనలియర్. నెమ్మదిగా జరిగి జరిగి పరీక్షలు అక్టోబర్ వరకు పాకాయి.

అప్పుడు యూనివర్సిటీ రెండు అవకాశాలను ఇచ్చింది. ఒకటి అయితే అక్టోబర్ లేదా మామూలు మార్చ్‌లో రాయవచ్చని.

కాలేజీ ప్రిన్సిపల్ గారికి పరీక్షలు అక్టోబర్‌లో ముగించి చేతులు దులిపేసుకోవాలని ఉంది. డిగ్రీ లో ఉన్నది పదహారు మంది అమ్మాయిల్లో పదముగ్గురు పరీక్షలకు సిద్ధంగా లేరు. మార్చ్ లోనే రాద్దామని అందరినీ ఒప్పించారు. మూకుమ్మడిగా ఆవిడ గదికి వెళ్ళాము. ఎప్పుడంటే అప్పుడు రాసేందుకు సిద్ధంగా ఉన్నా అందరితోనూ కలిసి వెళ్ళక తప్పలేదు. ఆవిడ తలెత్తి వచ్చిన అందరినీ ఒక్కొక్కరిగా చూడటం తెలుస్తూనే ఉంది.

అంత వరకూ బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్ అవార్డ్ నాకే ఇచ్చేందుకు షీల్డ్ కూడా తయారు చేసి పెట్టిన ఆవిడ తన మాట చెల్లలేదన్న ఉక్రోషంతో అసలు అవార్డే ఇవ్వనంటూ కాన్సిల్ చేసి పారెయ్యటం. ఏం చెయ్యలేని నిస్సహాయత. చెయ్యని తప్పుకు పడిన శిక్షకు ప్రాణం ఎంత విలవిలలాడిందో. అక్కడితో ఆగిందా లేదు. డిగ్రీ చేతికి వచ్చాక అదే కాలేజీలో లాబ్ అసిస్టెంట్‌గా ఆర్నెల్లు తిప్పుకుని ఆ పోస్ట్ మరెవరికో ఇవ్వడం ఎప్పటికి మరచిపోగలను.



మరో గత్యంతరం లేని స్థితిలో ఉద్యోగానికి కావలసిన ఉత్తర దక్షిణలు లేకపోడంతో నలుగురు పిల్లలతో ట్యుటోరియల్ మొదలు పెట్టడం ఒక పెద్ద మలుపు. ముందుగా ఇంటర్ పిల్లలతో మొదలైనా త్వరలోనే ఒక పెద్ద కోచింగ్ సెంటర్ స్థాయికి చేరుకుని, శాఖోపశాఖలుగా దేశమంతా విస్తరించడంలో ఎంత కృషి, ఎంత శ్రమ, ఎంత అంకితభావం. ఎన్నిసార్లు పడిలేచి నిలదొక్కుకోడం ఇవన్నీ అనుభవించిన వారికి తప్ప ఎవరికి తెలుస్తాయి? ఈ రోజున దాదాపు రెండు వేల మంది ఉద్యోగులు, పదహారు శాఖలు...

ఓ పక్కన వృత్తి, మరోపక్క కుటుంబం, ఇల్లూ, వాకిలీ, పిల్లలూ దాంతో పాటు ఈర్ష్యతోనో అసూయతోనో అడుగడునా కించపరచే అత్తింటి సమూహం నొప్పింపక తానొవ్వక ఉండాలని ఎంత చూసినా నిమిష నిమిషం మాటల శస్త్రాలు విసిరి గుచ్చి గుచ్చి బాధపెట్టే చదువుకున్నా సంస్కారపు చాయ సోకని మనుషులు ...

ఈ రోజున దేశంలో నే అత్యున్నత పదవులకు శిక్షణ నిచ్చే సంస్థ అధినేతగా నిలవడం, మొన్నమొన్నే జరిగిన పుట్టిన రోజు సందర్భాన ఆ సంస్థలను కొడుకులకు అప్పగించడం ఇంకా కలలానే ఉంది.

ఈ ఎనభై రెండేళ్ళ విజయ విహారాన్ని రెండు మాటల్లో ఎలా చెప్పాలి?

సత్కారంగా మంచి కాశ్మీరీ శాలువా పెద్ద గజమాల చక్కని మెమెంటో ...

గొంతు సవరించుకున్నాను...

"పోగొట్టుకున్న చోటే తిరిగి పొందాను.

అంటూ మొదలు పెట్టి " మీలోని మీతో ప్రయాణించండి. మీలో ఒక గాజు తెర వెనక గతాన్ని ఎప్పటికప్పుడు పరామర్శించండి" అంటు ముగించేసరికి కళ్ళలో రెండు విజయోత్సాహపు నీటి బొట్లు గాజు తెరగా మిగిలాయి.

వ్యాసం

# సాహితీమూర్తులకు మహిళాదినోత్సవ అక్షర నీరాజనాలు

సాహిత్య పరిణామంలో స్త్రీలు...




పింగళి భాగ్యలక్ష్మి
97047 25609


"యత్ర నార్యస్తు పూజ్యంతే తత్ర రమంతే దేవత" అన్నారు. ఎక్కడైతే స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు నివసిస్తారు అని అర్థం. అలాగే "యత్ర కార్యేషు దాసి, భోజ్యేషు మాత, శయనేషు రంభ" అంటూ స్త్రీని అన్ని రకాలుగా పెద్దలు గౌరవించారు. ఇలా పురాణ కాలం నుంచి కూడా స్త్రీకి అత్యధిక ప్రాముఖ్యత నిచ్చారు. ప్రస్తుత కాలంలో స్త్రీలు గృహిణిగా ఎన్నో బాధ్యతలను చక్కదిద్దుకుంటూ, ఇంట్లో భర్తని, పిల్లల్ని, అత్తమామల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ అన్ని రంగాల్లో బుల్లెట్ లా దూసుకు వెడుతున్నారు. అంతరిక్ష రంగంలో, ఇంకా రాష్ట్రపతిగా, ప్రధానిగా, శాస్త్రవేత్తలుగా, విద్యావేత్తలుగా, సాహితీవేత్తలుగా... ఇలా అన్ని రంగాలలో ప్రథమ స్థానంలో ఉంటూ మగవారికి ధీటుగా నిలుస్తున్నారు. పూర్వకాలం నుంచి కూడా మహిళా మణులు సాహిత్యంలో గొప్పగా రచనలు చేస్తూ సాహితీరంగంలో కూడా తమ సత్తాని చాటుతున్నారు.

ఆడవారి కష్టానికి గుర్తుగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. సామాజికంగా మహిళలు ఎంత మేరకు ఎదిగారో తెలుసుకొని వేడుక చేసుకొనే రోజుగా "అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని" జరుపుకుంటున్నారు. స్త్రీలు సాహితీ రంగంలో కూడా ఉన్నత శిఖరాలను చేరుకుని పురుష శక్తికి తామేమి తీసిపోమని చెబుతున్నారు. సాహిత్యంలో కూడా మహిళలు ఆకాశమంత ఎత్తు ఎదుగుతూ తమకంటూ ఓ చక్కని గుర్తింపు తెచ్చుకుంటున్నారు. వీరంతా సాహితీపూతోటకి మరింత వన్నెతెచ్చి ఈ తరం మహిళలకు సాహితీమూర్తులకి ఆదర్శంగా నిలిచారు. ఈ మహిళా దినోత్సవం రోజున "తంగేడు మాసపత్రిక" మహిళామ తల్లులకు అక్షరాంజలి ఘటిస్తూ వారి ప్రతిభకు పట్టం కట్టింది. ఈ ప్రతిభా మూర్తుల గురించి తెలుసుకుందాం.

తెలుగులో తొలి కవయిత్రి **కుప్పాంబిక.** ఈమె రంగనాథ రామాయణం రాసిన గోన బుద్ధారెడ్డి కూతురు. కుప్పాంబిక కాకతీయుల కాలంలో మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ లో జన్మించింది. తండ్రి వారసత్వంగా ఈమెకు కవితా వారసత్వం అబ్బింది. భర్త మాల్యాల గుండ నాథుని ఆస్థానంలో కవులను చూసి తన కవిత్వానికి మరింత మెరుగులు దిద్దుకుంది. అయ్యలరాజు రామభద్రుడు రాసిన ఓ గ్రంథంలో కుప్పాంబిక రాసిన పద్యాన్ని ఉంచారు. ప్రస్తుతం ఆమె రచనలు పెద్దగా అందుబాటులో లేవు. భర్త మరణానంతరం కుప్పాంబిక భూత్పూర్‌లో వేయించిన శాసనం ద్వారా ఆమె గొప్ప కవయిత్రి అని తెలుస్తుంది. 16వ శతాబ్దం మొదట్లో అష్టదిగ్గజాల్లో ఒకరైన 'అయ్యల రాజు రామభద్రుడు' కుప్పాంబిక రచింపబడినట్లు చెప్పబడిన పద్యాలను పాడి శ్రీకృష్ణదేవరాయల వద్ద ఆమెను పొగిడినట్లు శాసనాలు చెబుతున్నాయి.

16వ శతాబ్దంలో స్త్రీల పట్ల, నిమ్న జాతుల పట్ల సమాజంలో ఉన్న వివక్షను ఛేధించుకుని వెలుగు చూసిన మరో **కవయిత్రి ఆతుకూరి మొల్ల.** తన కవితా కళతో పురుషులతో సమానంగా కవిత్వం చెప్పడానికి సాహసించింది. 1500ల సంవత్సరం మార్చి 17వ తేదీన నెల్లూరు జిల్లాలోని గోపవరం అనే గ్రామంలో ఆతుకూరి కేసనశెట్టి కూతురిగా జన్మించింది. మొల్ల జీవించిన కాలంలోనూ వర్ణ దురహంకారం వేళ్ళూనుకొని ఉంది. ఆ వ్యవస్థను ఎదుర్కొని తనని తాను నిరూపించుకొని ఈనాటి తరానికి గొప్ప ఆదర్శవంతమైన కవయిత్రిగా పేరు గడించింది. ఈమె రామాయణం రచించిన ఒక కవయిత్రిగానే ప్రపంచానికి తెలుసు. కానీ ఆమెలో విభిన్న కోణాలు ఉన్నాయి. ఆమె ఇంతటి స్థితికి రావడానికి ప్రేరేపించిన స్థితిగతులు, ప్రతికూల పరిస్థితులు ఒక ప్రత్యేక వ్యక్తిగా

ఆదర్శవంతమైన స్త్రీగా రూపుదిద్దుకునేలా చేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయింది. ఆమె ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న ధీశాలి. ఏలుబడిలో ఉన్న వారు దోచుకుతింటున్నా, తిరగబడాలన్న స్పృహ కూడా లేనంత, అజ్ఞానాంధకారంలో ఉన్నారు అప్పటి ప్రజలు. కులమతాలు, అంటరానితనం అనే సామాజిక మౌఢ్యాలు ఎంతగానో పాతుకుపోయిన ఆ కాలంలో స్త్రీలు బయటకు రావడానికి కూడా జంకేవారు. అలాంటి దుర్భర పరిస్థితుల్ని చూసి మొల్ల కవయిత్రిగా రూపాంతరం చెందింది. ఈమె రాసిన రామాయణం "మొల్ల రామాయణం"గా బహుళ ప్రాచుర్యం పొందింది. ఇందులో "871 పద్యాలు, గద్యాలు" ఉన్నాయి. ఇది తెలుగులో మొట్టమొదటి సంగ్రహ రామాయణం. గోపవరంలోని శ్రీకంఠ మల్లేశ్వర స్వామి వారి వరప్రసాదం వల్ల తనకి ఈ కవితా సంపద లభించిందని చెప్పింది. "తేనె సోక నోరు తియ్యనగు రీతి" మొల్ల తన రామాయణాన్ని చెప్పింది. మొల్ల ఇతర రామాయణాలలో లేని ఓ కొత్త పాత్ర త్రిజట స్వప్న వృత్తాంతాన్ని తన రామాయణంలో యుద్ధకాండలో అద్భుతంగా వర్ణించింది. అలాగే సీత పాత్రను తెలుగింటి ఆడపడుచుగా అద్భుతంగా చిత్రీకరించి చెప్పింది. 16వ శతాబ్దంలోనే గొప్ప కవయిత్రిగా మంచి పాండిత్యం సంపాదించి మహిళా మణులందరికి ఆదర్శంగా నిలిచి అందరి మన్ననలను పొందింది.

**ముద్దు పళని** 17వ శతాబ్దానికి చెందిన కవయిత్రి. 1732-1790 వరకు అంటే 60 సంవత్సరాల పాటు ఈమె జీవించింది. ఆ కాలంలో తంజావూర్‌ని ప్రతాప సింహుడు పరిపాలించేవాడు. వీరి సంస్థానంలో ఆస్థాన కవయిత్రిగా, నర్తకిగా ఉండేది. ఆండాల్ రాసిన తిరుప్పావైని తెలుగులో అనువాదం చేసింది. వీటిని సప్తపదులుగా రాసి ఆస్థానంలో చదివి బహుమతుల్ని గెలుచుకుంది. రాధ, కృష్ణుడు, ఇళాదేవి ప్రధాన పాత్రలుగా "రాధికా సాంత్వనము" అనే గ్రంథాన్ని రాసింది. దీనిని బాలకృష్ణునికి అంకితమిచ్చింది. ఈ కావ్యంలో యశోద మేనకోడలు రాధ సోదరి కుమార్తె అయిన ఇళాదేవిని శ్రీకృష్ణుడు పరిణయమాడటం, అది చూసి రాధ తన మనసుకు ఎలా సర్ది చెప్పుకుంది, ఆ సమయంలో శ్రీకృష్ణుడు ఆమెని ఎలా సాంత్వన పరిచాడు అన్న ఇతివృత్తంతో గ్రంథాన్ని అద్భుతంగా మలిచింది. ఒక కళాకారిణి, దేవదాసి, సాహితీవేత్త అయిన ముద్దుపళని రాసిన కావ్యంలో దేవదాసీలు, కళాకారులు వాళ్ళదైన చిన్ని ప్రపంచంలో వాళ్ళు చేసిన సృష్టి ఎటువంటిది, వాటి పట్ల మన దృష్టి ఎలా ఉండాలి అన్న విషయాలపై సందేశాత్మకంగా రాసి ఎన్నో ప్రశ్నలను రేకెత్తించిన ఈ రచన కాలానికి అతీతమైన రచనగా వినుతి కెక్కింది.

**తెన్నేటి హేమలత** స్త్రీ పురుష సంబంధాలలో సంక్లిష్టతను, వైరుధ్యాలను అద్భుతంగా రాసిన మొదటి రచయిత్రి. ఈమె 1935 నవంబర్ 15న విజయవాడలో జన్మించారు. తెలుగుతో పాటు సంస్కృతం, ఇంగ్లీష్ లో కూడా మంచి పండితురాలు. 18 సంవత్సరాల వయసులోనే "శిలా హృదయం" నాటిక రాశారు. సాంఘిక, నైతిక, అన్యాయాల్ని నిలబెట్టి ప్రశ్నించాయి ఆమె రచనలు. అమాయకుల్ని బాధపెట్టి వాడుకునే మనుష్యుల నీచత్వం, శాడిజం, సాంప్రదాయాల వెనుక దాక్కునప్పుడు బోన్లో నిలబెట్టి నిర్భీతిగా చీల్చి చెండాడాయి ఆమె అక్షరాలు. ద్రౌపది అంతరంగాన్ని స్త్రీ కోణంలో చూపుతూ "పాంచాలి" పేరుతో ఒక నవల రాశారు. ఈ నవల విస్తృత ప్రచారం పొంది అందరి మన్ననలను అందుకుంది. అలాగే 1956లో ఆంధ్రప్రభ వారపత్రికలో "ఊహాగానం" పేరుతో కాలమిస్టు రచయిత్రిగా వినుతికెక్కారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో స్క్రిప్టు రైటరుగా పనిచేశారు. 600లకు పైగా రేడియో నాటకాలు, గాలి పడగలు, నీటి బుడగలు, సప్త స్వరాలు, మిగిలిందేమిటి, పదవిహీన, మహానగరంలో స్త్రీ... ఇలా వందకు పైగా సమాజానికి ఆదర్శ వంతమైన నవలలు, నాలుగు సాంఘిక నాటకాలు, 100 కథలు, ఐదు సాహిత్య వ్యాస సంపుటాలు రాసి గొప్ప పేరు తెచ్చుకున్నారు. ఆమె రచనల్లో 'మోహన వంశీ' రచన సాహిత్య పరంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.. ప్రశ్నించే తత్వం ఉన్న గొప్ప రచయిత్రిగా తెన్నేటి హేమలత వినుతికెక్కారు.

**ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ** తెలుగు నాట సాహితీ రుద్రమగా, బహుముఖ రంగాలలో తిరుగులేని పటిమ, ఆంధ్ర సరస్వతిగా, ధర్మ ప్రచార భారతిగా కీర్తి గడించిన ధీరవనిత. ఈమె ఏలూరులో పుట్టారు, రాజమండ్రిలో విద్యాభ్యాసం చేశారు. పెళ్లి తర్వాత బాపట్లలో స్థిరపడ్డారు. ఈమె తండ్రి నాళం కృష్ణారావు. ఇంటి వాతావరణంలోని ప్రగతిశీల భావాలు, సంస్కరణాభిలాష పసితనంలోనే ఉగ్గుపాలతో అవపోసన పట్టారు. లక్ష్మీకాంతమ్మ సాహిత్యం, సంగీతం, సంఘ సేవలను జీవిత పరమార్థంగా మార్చుకున్నారు.



ఉటుకూరి లక్ష్మీకాంతమ్మ



అబ్బూరి ఛాయాదేవి



కుప్పాంబిక

వ్యాసం

కత్తి సాము, కర్ర సాము, గుర్రపు స్వారీలో శిక్షణ పొందారు. ఏడవ ఏటనే గాత్రం, వీణ నేర్చుకోవడం ప్రారంభించారు. నాట్యంలో అసమాన ప్రతిభ కనబరిచే వారు. 12 సంవత్సరాల అతి చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ఉపన్యాసాలు ఇచ్చారు. "ఆంధ్ర కవయిత్రులు" గ్రంథం ఊటుకూరు లక్ష్మీ కాంతమ్మ సాహితీసేవకు చక్కని నిదర్శనం. ఈ రచన సాహితీ రంగంలో ప్రతిభను కనబరుస్తూ చరిత్ర పుటలకు ఎక్కకుండా అజ్ఞాతంగా మిగిలిపోయిన 264 మంది రచయిత్రుల వివరాలు ఈ గ్రంథంలో పొందు పరిచారు. వీరు వెయ్యికి పైగా ప్రసంగాలు చేశారు. తెలుగులో "విద్వత్కవయిత్రి" అన్న బిరుదు సొంతం చేసుకున్నారు. కనకాభిషేకాలు, ఘన సన్మానాలు అనేకం పొందిన కవయిత్రి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ. ఆరు దశాబ్దాల పాటు అవిశ్రాంత సాహితీసేవ చేశారు. ఈమె స్వీయ చరిత్ర ఎందరికో ఆదర్శం. తెలుగు సాహిత్యంలో ఈమె చెరగని సంతకం.

మహిళల సాధక బాధలను అక్షర రూపంలో ప్రపంచానికి చాటి చెప్పిన సాహితీవేత్త **అబ్బూరి ఛాయదేవి.** మహిళా సాధికారతను కాంక్షిస్తూ ఛాయాదేవి రచనలు చేశారు. వీరు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్ర వరంలో 1933 అక్టోబర్ 13న జన్మించారు. ఉన్నత విద్యను పూర్తి చేసిన తర్వాత ఢిల్లీలో జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో డిప్యూటీ లైబ్రేరియన్‌గా పనిచేశారు. తెలుగు సాహిత్యంలో స్త్రీవాద రచయిత్రిగా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. పురుషాధిక్య సమాజాన్ని ప్రశ్నిస్తూనే మధ్యతరగతి కుటుంబంలోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్ళకు కట్టినట్లుగా చూపించారు. ఛాయాదేవి భర్త అబ్బూరి వరదరాజేశ్వరరావు కూడా ప్రముఖ రచయిత, విమర్శకుడు, అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా

> **"సకల జనుల సౌభాగ్యమే నీ లక్ష్యం..." అన్న శ్రీశ్రీ మాటలు ప్రతి మహిళకు అంటే సేవ, సాహితీ సేవ, దేశ సేవ, సంఘ సేవలు చేసే ప్రతి ఒక్క మహిళకు చక్కగా సరిపోతాయి. ఈ మాటల్ని పైన చెప్పిన సాహితీ మూర్తులంతా అక్షర సత్యాలను చేసి నవ సమాజ నిర్మాణానికి పునాదులు వేసిన వీరందరినీ ఆదర్శంగా తీసుకుని మనమంతా కూడా ఆకాశమంత ఎత్తు ఎదుగుదాం.**

కూడా పనిచేశారు. తండ్రి సారధ్యంలో తాత్విక విషయాలు నేర్చుకోగా భర్త సాన్నిహిత్యంలో సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. అబ్బూరి ఛాయాదేవి రచించిన "బోన్ సాయి బతుకులు, ఆఖరి ఐదు నక్షత్రాలు, ప్రయాణం సుఖాంతం, ఉడ్ రోజ్ కథలు" ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. పెంపకంలో వివక్ష చూపుతూ ఆడపిల్లల్ని మానసికంగా ఎదగ నీయకుండా చేస్తున్న వైనాన్ని 'బోన్సాయి బతుకు' కథలో తెలియజేశారు. మహిళలు ఎలాంటి పరిస్థితుల్లో కూడా స్వేచ్ఛను వదులుకోకూడదని ధైర్యంగా తమంతట తాము జీవించాలని "తనమార్గం కథ"లో వివరించిన తీరు అద్భుతంగా ఉంది. ఈ రచనకు ఆమెకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం కూడా లభించింది. ఇలా ఆమె తన రచనల ద్వారా మహిళలకు చాలా పెద్దపీట వేశారు.

సంచలన రచయిత్రిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు **వాసిరెడ్డి సీతాదేవి.** "సాంబయ్య పెళ్లి" కథ ఆమె మొదటి రచన. ఆమె రాసిన మొదటి నవల ఆనాటి రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. ఆడపిల్లలకు కూడా ఆస్తి హక్కు ఉండాలి అని నినదిస్తూ "వైతరణి" అనే నాటికను రాశారు. ఆమె రాసిన "మట్టి మనిషి" నవలను దేశంలో చాలా భాషల్లోకి అనువాదం చేశారు. 1970ల్లో యువతను నక్సలిజం, హిప్పి సంస్కృతి ప్రభావితం చేసిన తీరు మీద ఆమె రాసిన "మరీచిక" నవలను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. అభ్యుదయ అంశాల మీదే ఆమె ఎక్కువగా రచనలు చేశారు. మరో దయ్యం కథ, రాబందులు, రామ చిలుకలు నవలలు కూడా అదే కోవకు చెందినవే. ఐదు సార్లు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి నుంచి ఉత్తమ రచయిత్రి పురస్కారాలు అందుకున్న ఏకైక రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి గారి సాహితీ ప్రస్థానం ఈ తరం రచయితలకు ఆదర్శనీయం, ఆచరణీయం.

పూర్వకాలం నుంచి కాదు కాదు పురాణ కాలం నుంచి కూడా మన భారతదేశం మహిళలకు చాలా పెద్దపీట వేసిందనే చెప్పాలి. అందుకే "మానవజాతి మనుగడకే ప్రాణం పోసింది మగువ, రాగంలో అనురాగంలో తరగని పెన్నిధి మగువ" అని నేను అంటాను. ఇంత మంది రచయిత్రులు, కవయిత్రులు తోటి మహిళల అభ్యున్నతిని కాంక్షిస్తూ అండగా నిలుస్తూ మీ కష్టాల్లో మేమున్నామంటూ తమ రచనల ద్వారా ముందుకు వచ్చి కష్టాల్లో ఉన్న మహిళలకు అండగా నిలిచారు.

సమ సమాజ నిర్మాణమే నీ ధ్యేయం "సకల జనుల సౌభాగ్యమే నీ లక్ష్యం..." అన్న శ్రీశ్రీ మాటలు ప్రతి మహిళకు అంటే సేవ, సాహితీ సేవ, దేశ సేవ, సంఘ సేవలు చేసే ప్రతి ఒక్క మహిళకు చక్కగా సరిపోతాయి. ఈ మాటల్ని పైన చెప్పిన సాహితీ మూర్తులంతా అక్షర సత్యాలను చేసి నవ సమాజ నిర్మాణానికి పునాదులు వేసిన వీరందరినీ ఆదర్శంగా తీసుకుని మనమంతా కూడా ఆకాశమంత ఎత్తు ఎదుగుదాం. ఇంకా సాహితీ వినీలాకాశంలో తిరుగులేని సాహితీ మూర్తులుగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవాలని కోరుకుంటూ.... మహిళా లోకానికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు, జేజేలు, వందనాలు.

క
వి
త



# శోధన

**జయంతి వాసరచెట్ల, 9985525355**

ఎన్నో దినారాత్రాలు
విసుగు లేకుండా ఎదురుచూస్తూనే ఉన్నా

లిప్త కాలమైనా ఒక చల్లని మాటను ఎవరైనా చిలకరిస్తారని
ధైర్యాన్నిచ్చే ఒక వెచ్చని స్పర్శ ఎక్కడైనా దొరుకుతుందని!

రాలుతున్న ఒక్కో కన్నీటి చుక్క
గాయమైన గుండె గీతాన్ని ఆలపిస్తూనే ఉంది!

చూస్తున్న ఒక్క గుండెకూడా
చలించి జ్వలించిందా అనేదే ప్రశ్న?

అమృతం లాంటి ఒక్కపలుకైనా వినిపిస్తుందని!

అవయవాలన్నీ సరిగ్గా ఉన్నంత మాత్రాన
మనిషెలా అవుతారు!!

మృదువైన సంభాషణ జరిగినంత మాత్రాన
హృదయం సున్నితం ఎలా అవుతుంది!

బాధను భాష్యం చెప్తూ ఆవేదన లిఖిస్తూ
కాలాన్ని కరిగిస్తూ ఎదురు చూస్తున్న

ఒక్క ఆత్మీయ హృదయమైనా దొరుకుతుందని
పన్నీటిజల్లు లాంటి ఒకపలకరింతైనా
నన్ను కనిపెడుతుందని!

మౌనంగా రోదిస్తూ
నాకళ్ళు శోధిస్తూనే ఉంటాయి!



సీరియల్

ప్రతాప యుగంధర కథలు... 4

# వ్యూహం

**మోసాలను మోసాలతోనే తెలివిగా జయిస్తున్న యుగంధరుడు...**



అమ్మంగి వేణుగోపాల్
94410 54637

*(ప్రతాపయుగంధర కథలు బాలసాహిత్యమే అయినా, పెద్దలను కూడా అలరిస్తున్నాయని గమనించాం. సంతోషం. రాచరిక వ్యవస్థకు సంబంధించిన ఈ కల్పితగాథల పరంపరలో ఇప్పటిదాకా మూడు కథలు చదివారు. నాలుగో కథను చదవండి.)*

ఓరుగల్లు రాజ్యంలో రాత్రి గస్తీ కఠినంగా ఉండేది. నేరాలకు రాత్రే అనుకూలంగా ఉంటుంది కనుక అనుమానస్పదంగా ఎవరు కనిపించినా బాగా విచారణ చేసిగాని వదిలేవారు కాదు.

ఒకరోజు గస్తీ భటుడు దుకాణాల సముదాయం ఉన్న వీధిలో తిరుగు తున్నాడు. ఒక దుకాణం గత కొద్దిరోజులుగా పగలు రాత్రి తాళం వేసే ఉంటున్నది. అందుకే దానిపట్ల గస్తీభటుడికి ఆసక్తి కలిగింది. దాని సంగతి తేల్చుకుందామని కొంచెం దూరంగా చెట్టు వెనుక ఎవరికీ కనిపించకుండా కూర్చున్నాడు. గంట తర్వాత తమ గస్తీభటుడు వేసుకునే ఏకరూప దుస్తులు ధరించినవాడు జేబు రుమాలంతటి గుడ్డముక్కను ఆ దుకాణం తలుపు దగ్గరపెట్టి చీకట్లో కలిసిపోయాడు. రక్షకభటుడు అతిజాగ్రత్తగా ఆ గుడ్డ ముక్కను తీసుకొని తన దళనాయకునికి ఇచ్చాడు. అది వెంటనే గూఢచారుల నాయకుడైన త్రినేత్రుని వద్దకు వెళ్ళింది.

త్రినేత్రుడు వెంటనే అట్లాంటి ఆకారంలోనే ఉన్న మరో గుడ్డను తయారుచేయించి రెండు గులకరాళ్ళు పెట్టించి ఆ దుకాణం తలుపు దగ్గరే ఉంచి ఏం జరుగుతుందో భటుణ్ణి చూడమన్నాడు. అంతేకాదు. శత్రుభటుడు వచ్చి దాన్ని తీసుకునే పక్షంలో వాణ్ణి బంధించకుండా స్వేచ్ఛగా వెళ్ళనివ్వాలని ఎక్కడికి వెళ్తున్నాడో కనిపెట్టాలని అంచె వేగులను శాసించాడు. ఓరుగల్లు భటుడు జాగ్రత్తగా ఎవరికీ అనుమానం రాకుండా ఆ గుడ్డను అక్కడపెట్టి దాక్కున్నాడు. బయటినుండే ఎవడో వస్తాడని ఊహిస్తూ ఉండగా, దుకాణం లోపలే అలికిడి మొదలుకావడం భటుణ్ణి ఆశ్చర్యపరిచింది. మరింత అప్రమత్తుడై భటుడు చూస్తుండగా తలుపు సందులోనుండి ఒక తాళం చెవి మెల్లగా పాకుతూ పైకి రాసాగింది. అది తాళం కప్ప దగ్గరకు వచ్చి దాని రంధ్రంలోకి దూరింది. తాళం చెవి ఎడమ నుండి కుడికి తిరగగానే తాళం ఊడి వచ్చింది. ఇదంతా లోన రహస్యంగా దాక్కున్నవాడు బలమైన అయస్కాంతం సహాయంతో చేస్తున్నాడని ఊహించాడు భటుడు. ఆ తర్వాత వాడు నెమ్మదిగా తలుపు తెరుచుకొని అటూఇటూ చూసి ఎవరూ లేరని రూఢి చేసుకొని బయటకు వచ్చాడు. తిరిగి తలుపుకు తాళం వేసి ఆ గుడ్డను తీసుకొని బయలుదేరాడు. శత్రుభటుని దుస్తులు తన దుస్తులనే పోలి ఉన్నాయి. ఎవరికీ అనుమానం రాకుండా ఈ ఏర్పాటు అని అర్థం చేసకున్నాడు భటుడు.

ఇక్కడ త్రినేత్రుడు అసలు జేబురుమాలును పరిశీలనగా చూశాడు. అది ఒక మసిగుడ్డ. దాన్ని ఏనుగు ఆకారంలో కత్తిరించి, మధ్యన పెద్ద మసిబొట్టు పెట్టి, బరువుకోసం రెండు చిన్నరాళ్ళు ఉంచారు. చిన్న పామునైనా పెద్దకర్రతో కొట్టాలని నమ్మినవాడు కనుక, ఆ గుడ్డను బాగా పరీక్షించి నివేదికను సమర్పించవలసిందిగా 'శాస్త్రశాల' అధిపతిని ఆదేశించాడు. ఆ అధిపతి ఆలస్యం చేయకుండా శాస్త్రీయంగా పరీక్షించి వెంటనే నివేదిక సమర్పించాడు. అందులోని ముఖ్యాంశాలు: "ఆ గుడ్డ ఓరుగల్లు జైళ్ళలో నిర్బంధించబడ్డ ఖైదీల ఏకరూపదుస్తులకు సంబంధించింది. ఎవరిదో అంగీ పాతబడి పడవేస్తే వంటవాళ్ళు దాన్ని మసిగుడ్డగా వాడుకుంటున్నారు. పడుగుపేకను పరిశీలిస్తే మేకమాంసం అంటుకున్నట్టుగా

సీరియల్

ఉంది. ఈ మసిగుడ్డను ఏనుగు ఆకారంలో కత్తిరించటానికి వాడి అయిన రాయిని, గోళ్ళను ఉపయోగించినట్లుగా ఉంది".

ఈ నివేదికను మసిగుడ్డను తీసుకొని వెంటనే యుగంధరుణ్ణి కలిశాడు త్రినేత్రుడు. అతడు వాటిని పరిశీలించాడు.

"ఆసక్తికరంగా ఉంది ఈ వ్యవహారం" అంటూ యుగంధరుడు ఆలోచనలోపడ్డాడు. వెంటనే తేరుకొని

"మన రాజ్యంలో ఖైదీలకు సంబంధించే పన్నెండు జైళ్ళు, వాటికి అనుబంధంగా పన్నెండు వంటశాల లున్నాయి. ఖైదీలందరికీ ఒకే రకమైన దుస్తులున్నాయి. మొత్తం మీద ఏనుగు ఆకారంలో ఉన్న మసిగుడ్డ గజసైన్యానికి ప్రతీకగా భావించవచ్చు. మన ఖైదులో ఉన్న శత్రురాజ్యపు సైనికుడో, గూఢచారో గజసైన్యంతో దాడిచేయమని సూచిస్తున్నాడు" అన్నాడు యుగంధరుడు.

"మరి మసిబొట్టు సంగతి మహామంత్రీ!" అడిగాడు త్రినేత్రుడు.

"అది గుండ్రంగా చంద్రబింబంలాగా ఉంది కనుక అమావాస్య అనుకుంటున్నాను. అన్నట్టు అమావాస్య ఎప్పుడు?"

**"మన రాజ్యంలో ఖైదీలకు సంబంధించే పన్నెండు జైళ్ళు, వాటికి అనుబంధంగా పన్నెండు వంటశాలలున్నాయి. ఖైదీలందరికీ ఒకే రకమైన దుస్తులున్నాయి. మొత్తం మీద ఏనుగు ఆకారంలో ఉన్న మసిగుడ్డ గజసైన్యానికి ప్రతీకగా భావించవచ్చు. మన ఖైదులో ఉన్న శత్రురాజ్యపు సైనికుడో, గూఢచారో గజసైన్యంతో దాడిచేయమని సూచిస్తున్నాడు" అన్నాడు యుగంధరుడు.**

పంచాంగం చూస్తే పన్నెండు రోజులుంది.

వెంటనే అత్యవసర అనుజ్ఞ పొంది వాళ్ళిద్దరూ చక్రవర్తిని కలుసుకున్నారు. వివరాలు తెలియజేశారు. వెనువెంటనే చర్యలు తీసుకున్నందుకు త్రినేత్రుణ్ణి, సరైన ఊహలు చేసినందుకు యుగంధరుణ్ణి చక్రవర్తి ప్రశంసించాడు.

"పన్నెండు జైళ్ళను, ఆ జైళ్ళలో ఉంటున్న ఖైదీలను, వంటశాలలను బాగా పరీక్షించండి. శత్రురాజ్యాలలో సైనిక పటాలాల కదలికల మీద నిఘావుంచండి" అన్నాడు చక్రవర్తి. వెంటనే సైన్యాధిపతిని రప్పించి మరిన్ని సూచనలు ఇచ్చాడు.

ఎవరికీ అనుమానం రాకుండా ముందుగా వంటశాలలను పరిశీలించారు. పదకొండవ సంఖ్య గల వంటశాలలో మసిగుడ్డ పెద్దభాగం కనిపించింది. వెంటనే దానికి ఆనుకొని ఉన్న జైలులోని యాభైమంది ఖైదీలను వైద్యపరీక్షల సాకుతో పరిశీలించారు. వారిలో ఒకని కుడిచేయి పెద్దవేలు గోటిలో ఇరుక్కున్న దారపుపోగు దొరికింది. దాన్ని మామూలుగా తీసేసినట్టు తీసి అందరికీ సాధారణ మందులు ఇచ్చారు. ఆ దారం పోగును పరీక్ష నిమిత్తం శాస్త్రశాలకు పంపితే అది ఆ మసిగుడ్డకు సంబంధించిన పోగేనని నివేదిక వచ్చింది. ఇంతకూ ఆ ఖైదీ ఎవరో కాదు, నాట్యగత్తె చంద్రరేఖ తండ్రి! వీడు యావజ్జీవ కారాగారవాస శిక్షను అనుభవిస్తున్నాడు. వీడే ఆ ఏనుగు ఆకారపు గుడ్డను వాడి రాయితోను, గోళ్ళతోను కత్తిరించింది. ఆ సంకేత స్థలానికి దాన్ని పంపించింది కూడా వీడే.

తెల్లవారేసరికి తెలిసిపోయింది. ఆ గూఢచారి అంబదేవుని రాజ్యం వాడని. చంద్రరేఖ తండ్రి ఉన్న కారాగారంలో ముగ్గురు కరడుగట్టిన నేరస్థులున్నారు. వారు అంబదేవునికి నమ్మినబంట్లు. గజసైన్యం కారాగృహం ప్రధానమైన తలుపులు బద్దలుకొడితే వాళ్ళంతా తన రాజ్యానికి వచ్చేస్తారని అంబదేవుని వ్యూహం అయివుంటుంది!

అమావాస్య మూడు రోజులుందనగా రహస్యమందిరంలో యుగంధరుడు



చక్రవర్తితో సమావేశమయ్యాడు. అంబదేవుని రాజ్యంలో పెద్దగా యుద్ధ సన్నాహాలు లేవన్న గూఢచారుల వార్తలను ప్రస్తావించాడు యుగంధరుడు.

"అయితే ఒకటి అయి వుండవచ్చు యుగంధరా! ఇప్పటికి మనతో జరిగిన చాలా యుద్ధాలలో

సీరియల్



అంబదేవుడు ఓడిపోయాడు కనుక. పెద్దసైన్యంతో మనమీద దాడి చేయకపోవచ్చు. నాలుగైదు ఏనుగులతో ఆ ఖైదుమీద మాత్రమే దాడిచేసి, ప్రధాన ద్వారం ధ్వంసం చేసి ఆ ముగ్గురు నలుగురు ఖైదీలను తీసుకుపోవచ్చు. అయినా మనం పూర్తి జాగ్రత్తతో ఉందాం'' అన్నాడు చక్రవర్తి ప్రతాపరుద్రుడు.

ఇది యుగంధరునికి సరైన ఊహగా తోచింది. ఇందుకు తాను ఏ రకమైన వ్యూహం పన్నదలచుకున్నాడో చక్రవర్తికి వివరించాడు. ఆయన అనుమతి తీసుకొని తన చర్యలకు తుది రూపమిచ్చాడు. ముందుగా ఆ నలుగురు ప్రమాదకరమైన ఖైదీలను రహస్యంగా అక్కడ నుండి తప్పించి ప్రత్యేకమైన జైలులో కట్టుదిట్టమైన పహరా మధ్య బంధించి ఉంచాడు.

కాకతీయుల గజసైన్యంలోని ఏనుగులను రోజు విడిచి రోజు పెద్ద చెరువు వద్దకు తీసుకువెళ్ళి శుభ్రంగా కడిగి తిరిగి గజశాలకు తీసుకు వస్తుంటారు. ప్రతాపుని మావటివాళ్ళు ధరించే దుస్తులనే ధరించిన ఇద్దరు అంబదేవుని మావటివాళ్ళు రెండు మదపుటేనుగులను తీసుకొని చెరువులో స్నానం చేయించారు.

సరిగ్గా అమావాస్య అర్ధరాత్రి పదకొండవ సంఖ్య గల ఖైదు దగ్గరకు ఆ రెండు ఏనుగులతో అంబదేవుని మావటి వాళ్ళు చేరుకున్నారు. ఖైదు తలుపులను చూడగానే పిచ్చెత్తిపోయి, వాటిని కుమ్మి ధ్వంసం చేసే శిక్షణ గతవారం రోజులుగా ఇస్తూ వచ్చారు. మావటివాళ్ళు ఏనుగులను వేగంగా వెళ్ళి ప్రధాన ద్వారాన్ని కుమ్మటానికి తగు సూచనలు ఇవ్వసాగారు. అవి కూడా వేగంగా కదలసాగాయి. అయితే అవి హఠాత్తుగా ఆగిపోయాయి. ఆ చీకట్లో వాటికి వెలగపండ్ల సువాసన బలంగా తగిలింది. వెంటనే అవి తన కాళ్ళముందు పడివున్న, తనకు ప్రీతిపాత్రమైన వెలగపండ్లను తినసాగాయి. మావటివాళ్ళు ఎంతగా అదలించినా లాభం లేకపోయింది. చివరకు వాళ్ళు తమ మీద ఉన్న ఒత్తిడిని భరించలేక తమతమ ఏనుగుల్ని

**కాకతీయుల**

**గజసైన్యంలోని ఏనుగులను రోజు విడిచి రోజు పెద్ద చెరువు వద్దకు తీసుకువెళ్ళి శుభ్రంగా కడిగి తిరిగి గజశాలకు తీసుకు వస్తుంటారు. ప్రతాపుని మావటివాళ్ళు ధరించే దుస్తులనే ధరించిన ఇద్దరు అంబదేవుని మావటివాళ్ళు రెండు మదపుటేనుగులను తీసుకొని చెరువులో స్నానం చేయించారు. సరిగ్గా అమావాస్య అర్ధరాత్రి పదకొండవ సంఖ్య గల ఖైదు దగ్గరకు ఆ రెండు ఏనుగులతో అంబదేవుని మావటివాళ్ళు చేరుకున్నారు.**

అంకుశంతో బలంగా పొడిచారు. తమ ఆహారానికి అడ్డు వస్తున్న మావటివాళ్ళమీద ఆ ఏనుగులకు తీవ్రమైన అసహనం ఏర్పడింది. అవి పిచ్చికోపంతో మావటివాళ్ళను కిందకు పడదోసి తొండెంతో పైకిలేపి జైలు ద్వారం వైపు విసిరేశాయి.

అయితే అప్పటికే యుగంధరుడు అక్కడ పెద్ద గోయి తీయించి పైన చివికిపోయిన కట్టెలు పెట్టించి ఎప్పటిమాదిరిగా మన్నుతో సమతలం చేయించి ఉంచాడు. ఆ మాయ గొయ్యిపైన పడగానే ఆ ఇద్దరి బరువు మోయలేక పుచ్చిపోయిన కట్టెలు విరిగిపోయాయి. మావటివాళ్ళు ఆ గోతిలోపడి నడుములు విరగ్గొట్టు కున్నారు.

"తాము తీసిన గోతిలో తామే పడిపోయారు'' అంటూ గట్టిగా అరిచారు, చెట్లమీదినుంచి రహస్యంగా గమనిస్తున్న ప్రతాపుని సైనికులు. వెంటనే అమావాస్య పున్నమగా మారిందా అనిపించేటట్లుగా వందల కాగడాలు వెలిగాయి.

మరునాడు ఆ స్థానంలో కొలువుదీరిన ప్రతాపరుద్రుడు-

"యుగంధరా! ప్రతిభావంతంగా ఎత్తుకు పై యెత్తు వేసి అంబదేవుణ్ణి చావుదెబ్బ తీశావు. ఇదిగో బంగారు మాడ సంతోషంతో ఇస్తున్నాను. నా కానుకను కాదనకు'' అన్నాడు.

"సార్వభౌమా! మీరు కానుకలు ఇవ్వవలసిందే. మాలాంటి సేవకులు అందుకోవలసిందే. కాని ఈసారికి మన్నించండి. తన వందలాది వెలగపండ్లతో ఏనుగులను కదలకుండా చేసి మన పన్నాగాన్ని ఫలవంతం చేసిన తోటమాలికి దయచేసి ఈ మాడను బహూకరించండి'' అన్నాడు యుగంధరుడు.

సభాసదుల కరతాళధ్వనుల మధ్య తోటమాలి ఆ కానుకను స్వీకరించి కళ్ళకద్దుకున్నాడు.

(కల్పితం)

కవిత

# చాలిక



నస్రీన్ ఖాన్, 96524 32981

యత్ర నార్యస్తు పూజ్యంతే
రమంతే తత్రదేవతాః
ఆడదాన్ని దేవత చేసి
పూజించింది చాలిక

ఆదాము పక్కటెముక నుంచి..
ఆగు అక్కడే!
తొలి మహిళ పుట్టుక కథల్లో
చుట్టబెట్టింది చాలిక

మా పాదాలు
స్వర్గధామాలు కానే కావు
కారుణ్య మూర్తి కిరీటాల
ముళ్ళు కుచ్చింది చాలిక

కష్టాలను ఇష్టాలుగా
మా చేత మార్పించకండి
ప్రేమామృత కారుణ్య మూర్తి
కంటెల్లో ఇరికించిందిక చాలు

గౌరవాభరణాల మాటున
మహిమాన్విత అలంకారాల చాటున
మేలుకొలుపుల ధీరోదాత్త ఉదంతాల్లో దాగి
ఎత్తివేసింది చాలిక

సోదరీ
వర్ణన కుట్రల్లో
పొగడ్తల మంటల్లో
దహించుకుపోయింది చాలిక

మనమే దేవతలమయితే
ఇల్లు ఎందుకు
మన కొంగుకు ముడిపడింది

వారి పక్కటెముక నుంచి
మనమే తయారు అయితే
వారి పిల్లలకు ఆయాలు అవుతామా

మన పాదాలవద్దే స్వర్గం ఉంటే
గృహ హింసలు
ఎందుకు పుట్టుకొచ్చాయి

అత్యాచారాలు, అణచివేతలు,
హత్యలు, అక్రమ మానవ రవాణాలు,
అంగడి సరుకును చేసి
గౌరవించింది చాలిక

ఆకాశంలో సగం కాదు
మనము అన్నింటా సగం
ఆకాశం మనది భూమి మనది
ప్రకృతి మనది ఇల్లూ మనదే

సున్నితత్వం వెనుక
కుటిల నీతి ఏదో తెలుసుకో
బంధనాల వెనుక
అపార స్వేచ్ఛా చెలిమను కనుగొను

కలలు కనడం కాదు
కన్న కలలు నిజం చేసే
మార్గాలు అన్వేషించు
కీర్తికిరీటాలు అక్కర్లేదు
రిజర్వేషన్లకై ప్రశ్నించు

దేహ కొలతలు కాదు
హక్కుల గురించి నినదించు
మాటల వెనుక మర్మం గ్రహించు
గడప దాటిన గొంతువి
గర్జనవై విజృంభించు

వ్యాసం

సబాల్టర్న్ కాలం

# విస్మృత బహుజన విమర్శకుడు పెదగాడ గంగయ్య

నిదురలేస్తున్న బహుజన చైతన్యం...




డా॥ సంగిశెట్టి శ్రీనివాస్
98492 20321


సాహిత్యములో ముఖ్యంగా విమర్శ, పరిశోధన రంగంలో బ్రాహ్మణాధిపత్యము మొదటి నుంచీ ఉన్నది. దీనికి పత్రికలు, దాని సంపాదకులు, విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలూ అండగా నిలిచినాయి. బ్రాహ్మణేతరులు ఏదైనా కొత్త విషయాన్ని వెలుగులోకి తెచ్చినట్లయితే దాన్ని బ్రాహ్మణ పండితులు మూకుమ్మడిగా ఖండిస్తూ, తూర్పారా బడుతూ వ్యాసాలను పరంపరగా రాసేవారు. తాము నిర్ధారించిన దానినే అందరూ సమర్థించాలె అనే శాసనాన్ని వాళ్ళు అమలు పరుస్తారు. బండారు తమ్మయ్య, చిదిరెమఠం వీరభద్రశాస్త్రి గారలు పాల్కురికి సోమనాథుడి కులంతో పాటు వివిధ విషయాలపై చేసిన నిర్ధారణలు, ఫైండింగ్స్‌ని బ్రాహ్మణ పండితులు ఖండించిండ్రు. వీళ్లిద్దరూ బ్రాహ్మణేతరులు. బహుజనులు. ఒకే విషయాన్ని వేర్వేరుగా అన్వయించి తాము చెప్పదలచుకున్న అంశాన్ని వాస్తవాలతో సంబంధం లేకుండా బ్రాహ్మణ పండితులు అందరితోటి ఒప్పించే వారు. ఇందుకు యథావిధిగా పత్రికలు, వాటి సంపాదకులు, విశ్వవిద్యాలయాల్లోని వారి సామాజిక వర్గం వారు మద్దతు తెలిపే వారు. అట్లాంటి సందర్భమే పెదగాడ గంగయ్య రాసిన 'అయిదుగురు కవుల సంగ్రహ చరిత్ర'


The Ground work of Telugu Gram
for the use of
PRIMARY SCHOOLS
AND
Telugu Prosody
are in preparation and they will be ready for
by the end of July 1930.
P. GANGIAH,

గురించి జరిగిన చర్చ.

సికింద్రాబాద్ వెస్లి పాఠశాలలో తెలుగు పండితుడిగా పనిచేసిన పెదగాడ గంగయ్య విశ్వబ్రాహ్మణుడు. ఈయన 1930లో పైన పేర్కొన్న విమర్శా గ్రంథాన్ని రాసి వెలువరించాడు. ఇందులో 'కవికర్ణ రసాయన' కర్త ఇంటిపేరు సంకుసాల కాదు టంకసాల అని, అతను విశ్వబ్రాహ్మణుడు అని నిర్ధారించిండు. అట్లాగే పాల్కురికి సోమనాథుడు జంగమ కులం వాడని, చేమకూర వేంకటకవి భోగము వాడని, కందుకూరి రుద్రకవి, తెనాలి రామలింగ కవులు విశ్వబ్రాహ్మణులని సోపపత్తికంగా ఈ గ్రంథంలో తేల్చి చెప్పిండు.

'పాలకురికి సోమనాథకవి; కులగోత్ర ప్రశంస' పేరిట బండారు తమ్మయ్య 'ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక'లో ఒక వ్యాసం రాసిండు. ఇది ఆ పత్రిక 19వ సంపుటము, సంచిక -3 (ప్రమోదూత, శ్రావణ, భాద్రపద)లో అచ్చయింది. ఈ వ్యాసములో 'పాలకురికి సోమనాథుడు' జంగమ కులస్తుడు అని నిర్ధారిస్తూ తనకు అందుబాటులో ఉన్న ఆధారాలను పేర్కొంటూ తమ్మయ రాసిండు. ఇందులో "శ్రీ వీరేశలింగము పంతులుగా రీతనిని గవుల చరిత్రమున కెక్కించినను, నీతని కవితాగౌరవము నొకించుకయు నుగ్గడింపరయిరి" అని సోమనాథుడి గురించి సాహిత్య చరిత్రలో తగిన స్థానం నిరాకరించడాన్ని నిరసించిండు. అట్లాగే 'శ్రీ సీతారామాచార్యులుగా రీతనిని సామాన్యకవుల బోలె దమ నిఘంటువులో నయిదవ తరగతిలో జేర్చిరి" అని బహుజనపల్లిని విమర్శించిండు. "పేరి(రు)కి మాత్రము పేర్కొన్నను వీరును వీరినింబోలు నితరులును నీతని గ్రంథములను సమగ్రముగ సవిమర్శముగ బరికించినట్లు కానరాదు. ఇందులకు గారణము లేకపోలేదు. ఈతడు వీరశైవుడు. ఈతని ప్రధాన గ్రంథములగు బసవ పురాణ, పండితారాధ్య చరిత్రములన్నచో నేడాంధ్రదేశమునం దత్యంత దీన దశయందున్న వీరశైవమతమునకు సంబంధించినవి.

అందునను నాంధ్రవాఙ్మయమున రానురాను నిరసనమునకు గుఱియైన ద్విపదయందు గూర్పబడినవి". అని ఆ వ్యాసంలో పేర్కొన్నాడు.

ఆంధ్రపత్రికలో తమ్మయ్య రాసిన వ్యాసం పెద్ద చర్చను లేవదీసింది. "దుందుభి సంచిక యందలి నా పూర్వోక్త వ్యాసములో నేను వ్రాసిన విషయములు చాల వఱకు జనామోదమును గాంచినను సోమనాథుని కుల గోత్రముల గూర్చిన సంగతులు మాత్రమించుక సంచలనము గలిగించుట శోచనీయము. సోమనాథుడు బ్రాహ్మణుడని కొందఱు, ఆరాధ్య బ్రాహ్మణుడని కొందఱు, జంగముడని మఱికొందరు లోకమునం దలంచు చుండిరి. అతడు బ్రాహ్మణుడు గాని యారాధ్య బ్రాహ్మణుడు గాని కాక, సహజ వీరశైవుడగు జంగముడయి యుండునని నాకు దోచిన ప్రమాణములతో నేను నిరూపించి యుంటిని. అందు గూర్చి విమర్శించుచు శ్రీ నాగేశ్వరరావు పంతులు (కాశీనాథుని) గారు తాము ప్రకటించిన వృషాధిప శతక పీఠికలో సోమనాథుడు మొదట నారాధ్య బ్రాహ్మణుడుగ బుట్టి తరువాత జ్ఞానము హెచ్చిన కొలది బసవేశ్వరుని వలె జంగములలో గలిసి పోయియుండునను నభిప్రాయమును దెల్పిరి. బసవపురాణ పీఠికలో శ్రీ ప్రభాకరశాస్త్రి గారు నా నిర్ణయమును బూర్తిగ నిరసించుచు సోమనాథు డాజన్మము బ్రాహ్మణుడుగనే యుండెనని నిశ్చయించిరి. అయినను నా యభిప్రాయము నామోదించిన పండితులు గూడ లేకపోలేదు. సికింద్రా బాదు హైస్కూలు పండితులు బ్రహ్మశ్రీ పెదగాడ గంగాచార్యులుగారు సోమనాథుని బ్రాహ్మణ కవిగ దలంచు వారు, నే జూపిన ప్రమాణముల గ్రహించి యికనయిన నట్టి యభిప్రాయమును వదలు కొందురు గాక యని సమదర్శిని పత్రికలో నొక వ్యాసమున లోకమును హెచ్చరించి యున్నారు." అని తెల్పిండు.

అయితే ఈ పెదగాడ గంగయ్య సాహిత్య విషయాలను బహుజన దృక్కోణంతో నిర్ధారించి తెల్పి చెప్పినందుకు ,బండారు తమ్మయ్యను అంగీకరించనట్లే సనాతన బ్రాహ్మణ పండితులు ఇతనినీ అంగీకరించలేదు. 'కులము' (1920/21) అనే పేరుతో ఇతడు రాసిన మరొక పుస్తకాన్ని విమర్శిస్తూ అసలు అతడికి జ్ఞానమే లేదు అని తేల్చే ప్రయత్నం చేసినారు. 'వర్ణాశ్రమ ధర్మ పక్షమున వాదించు పక్షపత్రిక 'శ్రుతి ధర్మసంజీవని' పత్రిక సంపాదకుడు శివపురపు వీరభద్ర పాకయాజి- ఫిబ్రవరి 1921 నాటి సంచికలో ఈ పుస్తకాన్ని గురించి కటువైన భాషలో విమర్శించిండు. అదిలా ఉన్నది.

"శా. ఈ వబ్జుండవు నీటబుట్టితిసుమీ యేనంచు మోమోటపుం

ద్రోవల్పెప్పగసిగ్గుగాదె మరి నీతో బుట్టు శ్రీదేవి లీ

లా వాసంబు సిరుల్వారింతువనుచో నయ్యో; కళాదుండుచే

తో వీధిన్ సహజాధ నాపహరణోద్యోగంబు నెగ్గించునే

అని రామరాజభూషణ మహాకవి వసుచరిత్రమున వచించిన తెరంగున సహజాధనాప హరణోద్యోగంబునకు వెనుదీయని కళాద (కంసాలి) కుల శేఖరుండగు పెదగాడ గంగయ్యయను సికింద్రాబాదు వెస్లియన్ హైస్కూలు తెలుగు టీచరు పైపేర నొక బ్రాహ్మణ్యద్వేష పూరితమగు బూతు పుస్తకమును వెల్లడించియున్నవాడు. నిష్కారణమ మహర్షులను గూర్చియును గూడ దుష్ట ప్రసంగములను బెక్కు గావించి యున్నవాడు. పిచ్చుకపై బ్రహ్మాస్త్ర ప్రయోగమనుచితముకాని భంగి నీతని దూషణపు పుస్తకముపై శాస్త్ర చర్చ యనవసరమని మానినాడను. మహర్షి చరిత్ర కొలది దినములలో వెల్లడింపనున్న వాడను గాన దాని నిందు వ్రాయనైతిని.

ఈ గంగయ్య యుపండితుడు. ఇట్లని యతని పుస్తకము లోని పీఠికా ముఖ పత్రమున జెక్కబడిన 'విశ్వబ్రాహ్మణేనమః" అను పెద్ద యక్షరములే చాటు చున్నవి. అకారాంత బ్రాహ్మణ శబ్దమునకు "బ్రాహ్మణే"యను చతుర్థ్యంతమును బండితుడు పయోగించునా? ఇది యిట్లుండనిండు. ఈతడు గుణకర్మలనుబట్టి వర్ణ విభాగము గావించవలసినదను దుర్వాదమును నే పుస్తకముఖమున జేయుచున్నవాడో యా పుస్తకము యొక్క ముఖపత్రమందె "విశ్వబ్రాహ్మణ కులోద్భవుడ" నని వ్రాసికొని యున్నవాడు. తాను విశ్వబ్రాహ్మణ కులములో బుట్టి యుద్యోగము జేయుచున్న ప్రాయములో గూడ విశ్వబ్రాహ్మణుడుగానే యున్నపుడు, పుట్టుకను బట్టి వర్ణ విభాగంగీకరించిన వాడుగాక గుణకర్మలను బట్టి వర్ణ విభాగ మంగీకరించిన వాడెట్లగును? తన జాతికున్నవి కాశ, కమ్మర, వడ్రంగ, కంచర, యగసాల వృత్తులుగాని యుపాధ్యాయ వృత్తి కాదే. అది బ్రాహ్మణ ధర్మమని శాస్త్రములు చెప్పుచున్నవి. తన జాతి వృత్తులు విడిచి యన్య జాతివృత్తి నవలంబించియు విశ్వ బ్రాహ్మణుడని యితడు వ్రాసికొనుట యవివేకము కాదా?

ఇతడీ జన్మమున గాదు. వేయి జన్మము లెత్తియైనను విశ్వబ్రాహ్మణ జాతి యొకటి కలదని శాస్త్రములచే సిద్ధాంతము చెయ్యగలడా? వేదశాస్త్రములందెచ్చటను విశ్వయను బ్రాహ్మయొకడు కలడని చెప్పబడి యుండలేదు. లేనివానికి సంతెడి కొడుకు లెక్కడనుంచి వచ్చెదరు? వారు వచ్చినను విశ్వ బ్రాహ్మ శబ్దమున

**ఈ గంగయ్య యుపండితుడు. ఇట్లని యతని పుస్తకము లోని పీఠికా ముఖ పత్రమున జెక్కబడిన 'విశ్వబ్రాహ్మణేనమః" అను పెద్ద యక్షరములే చాటు చున్నవి. అకారాంత బ్రాహ్మణ శబ్దమునకు "బ్రాహ్మణే"యను చతుర్థ్యంత మును బండితుడు పయోగించునా? ఇది యిట్లుండనిండు.**

వ్యాసం

కపత్యార్థకతద్దివృత్తివచ్చినపుడు "వైశ్య బ్రాహ్మణు"డను రూపకము వచ్చును గాని, విశ్వబ్రాహ్మణ రూపము బ్రతికి యుంగా సిద్ధింపదె? ఇక నీ గంగయాఖ్యుడు విశ్వబ్రాహ్మణ కులోద్భవుండెట్లగునో? ఇతని యీ దూషణపుస్తకమును జూచి ప్రాజ్ఞులు ఛీయనక యెట్టూరకుందురో? వృత్తిని బట్టి కులము వచ్చునేని వీరి వృత్తులు చేయువారు తురకలు, దూదేకులు, మాలలు, మాదిగెలు, క్రైస్తవులు, పారసీకులు మున్నగు జాతుల వారిలో బెక్కురు కలరు కదా? వారినందరిని నితడు తమ విశ్వబ్రాహ్మణులుగా జేసెనో! చేయునో! చెప్పవలెను." అని అతి విమర్శ చేసిండు. ఈ పత్రికా సంపాదకులు ఒక కులానికి చెందిన వారందరూ దొంగలే అనే నిర్ధారణ చేయడానికి కూడా వెనుకడుగేయలేదు.

ఈర్ష్యాసూయద్వేషాలతో తమ పత్రికలో పెదగాడ గంగయ్యను విమర్శించినాడు. 'కులము' పేరిట బ్రాహ్మణాధిపత్యాన్ని నిరసించినందుకు ఆయనకు దక్కిన బహుమానమిది. ఈయన గురించి చరిత్ర పుస్తకాల్లో అక్కడక్కడా రికార్డయినా ఆయన రచనలు, విమర్శపై వివరమైన సమాచారం ఎక్కడా అందుబాటులో లేదు. అంతెందుకు రాపాక ఏకాంబరా చార్యులు 'విశ్వబ్రాహ్మణ సర్వస్వము'లోనే ఈయన గురించిన సమాచారం చోటు చేసుకోలేదంటే ఈయన ఎంత విస్మరణకు గురయ్యారో అర్థం చేసుకోవొచ్చు. బహుజన దృక్కోణముతో సాహిత్య చరిత్రను, సాహితీవేత్తలను పునర్మూల్యాంకనం చేసే పని గంగయ్య చేసిండు. జస్టిస్ పార్టీకి చెందిన బ్రాహ్మణేతరోద్యమ పత్రిక 'సమదర్శిని' లో ఆయన రాసిన వ్యాసాలు, 'కులము', 'అయిదుగురు కవుల సంగ్రహ చరిత్ర' తదితర రచనలు పూర్తిగా అందు బాటులోకి వచ్చినట్లయితే ఆయన తెలుగు విమర్శకు చేసిన దోహదాన్ని సమగ్రంగా రికార్డు చేసుకోవడానికి వీలవుతుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 'అయిదుగురు కవుల సంగ్రహ చరిత్ర'లోని సమాచారం ప్రకారం ఆయన సాహిత్య రంగంలో బ్రాహ్మణాధిపత్యాన్ని, తప్పుడు నిర్ధారణలను తీవ్రంగా నిరసించిండని, ఆ నిరసనకు అక్షర రూపమిచ్చి ప్రచారంలో పెట్టిండని, ఇట్లా పుస్తకాలు ప్రచురించినందకు సనాతన బ్రాహ్మణుల నుండి తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నడని భావించవచ్చు.

1942లో వేదము వేంకటరాయ శాస్త్రి 'శ్రీ సారంగధర చరిత్రము' పుస్తకములో చేమకూర వేంకటకవి భోగము వాడని పెదగాడ గంగయ్య నిర్ధారించిన విషయాన్ని సురవరం ప్రతాపరెడ్డి ద్వారా తెలుసుకొని దాన్ని ఆయన చరిత్రలో రికార్డు చేసిండు. "..సికిందరాబాదు నివాసులు పెదగాడ గంగయ్యగారు 'కవుల సంగ్రహ చరిత్ర'లో 'చేమకూర వేంకటకవి సందేహము లేకుండా భోగమువాడే' అనియు, 'ఈదాడన్నను మదనుడు - కోదాడనువాడు' - (విజ 2-192) అనుచోట; (ఈదాడును కోదాడును తాళ వృక్షవిశేషములని వేదంవారి టీక) 'ఈదాడు, కోదాడు నను నవి గ్రామములు, కృష్ణాజిల్లాలోని నందిగామకు 4,5 యోజనముల దూరాననున్నవి. నందిగామలోని జనులు పై సామెతను ఇప్పటికినీ వాడుదురు. కావున కవి అక్కడి వాడై యుండును' అనియును ఆ గ్రంథమున కలదని, ఈ విశేషములను ఆవ్యాజ ప్రీతితో నాకు తెలియజేసిన శ్రీ ప్రతాపరెడ్డి గారికి కృతజ్ఞుడను" అని పేర్కొన్నాడు. సురవరం ప్రతాపరెడ్డి తన 'యువజన విజ్ఞానము' పుస్తకములో ఆంధ్ర వాఙ్మయ చరిత్ర ప్రకరణంలోచదువాల్సిన పుస్తకంలో 'కవుల చరిత్ర- పెదగాడ గంగయ్య' పుస్తకాన్ని పేర్కొన్నాడు.

ఈ విషయమై నవ్యాంధ్ర సాహిత్య వీధులు పుస్తకంలో కురుగంటి సీతారామాచార్యులు ఇలా పేర్కొన్నారు. "సికింద్రాబాదు నివాసి అయిన పెదగాడ గంగయ్య (మృతి 1933) అనే విశ్వ బ్రాహ్మణుడు తన పరిశోధనలకు ఫలముగా 'అయుదుగురు కవుల సంగ్రహ చరిత్ర' అనే గ్రంథము రచించి భాషాసేవ చేసినాడు. ఇందులో ఈయన 'కవికర్ణ రసాయన' కర్త ఇంటిపేరు 'సంకుసాల' కాదనీ 'టంకసాల' అనీ. ఆయన విశ్వబ్రాహ్మణుడనీ ఋజువు చెయ్యడానికి ప్రయత్నించినాడు. ఈ ప్రకారముగా ఈయన గ్రంథములో నూతనమైనవీ, నమ్మడానికి కష్టమైనవీ అనేకమైన సంగతులు చెప్పినాడు. అందులో చేమకూర వెంకటకవి నందిగామ ప్రాంతములో పుట్టి తరువాత


పాంకుసాలకి సోమనాథకవి.

తంజావూరు వెళ్ళినాడనేది ఒకటి. ఇటువంటి పరిశోధనా విషయాలెన్నో ఉన్నవీ పుస్తకములో" అని కురుగంటి వారు రాసింద్రు.

తెనాలికి చెందిన కొండూరి వీరరాఘ వాచార్యులు 1973లో శ్రీకృష్ణదేవరాయల కూతురు, కవయిత్రి అయిన 'మోహనాంగి' పేరిట ఒక నవలను రాసిండు. దానికి ఆయన ముందుమాట రాస్తూ కూడా ఈ పెదగాడ గంగయ్య ప్రస్తావన తెచ్చిండు. అందులో ఇలా ఉన్నది. "కీ.శే. పెదగాడ గంగయ్య గారు 'ఐదుగురు కవుల చరిత్ర'లో సంకుసాల నృసింహకవి విశ్వబ్రాహ్మణుడని నిరూపించినాడు." అని పేర్కొన్నాడు.

వీరేశలింగం పంతులు సంకుసాల నృసింహకవిని గూర్చి రాస్తూ "నితడు నియోగి బ్రాహ్మణుడయినను భట్టపరాశ రాచార్యుడయి వైష్ణవ మతమునందభి మానము కలవాడై యుండెను" అని చెప్పిండు. వీరేశలింగము రాసిన దానికి ఆధారాలు లేవంటూ, నృసింహకవి విశ్వబ్రాహ్మణుడని ఆధారాలతో నిరూపించాడు. "కవికర్ణరసాయనము నందుగల మాంధాతృచరిత్రము, వైష్ణవ మత సాంప్రదాయముతో నిండియున్నది గాన నృసింహకవి విశ్వబ్రాహ్మణుడు కాడని కొందఱు చెప్ప సాహసించెందరు. విశ్వబ్రాహ్మణులలో షణ్మతములు గలవనియు, నాషణ్మతములలో వైష్ణవసాంప్రదాయము గలవారుండిర నియు నొక్కివక్కాణించుచున్నాను. తన కవన చమత్కారమునంతయు, జూపి కష్టపడి వ్రాసిన యీ మహా ప్రౌఢ కావ్యమును విశ్వబ్రాహ్మణ విద్వేషులు రూపుమాపుదురేమోయను భయముచేత తన కులగోత్రములు గాని వాసస్థానము గాని తన గ్రంథము నందెచ్చుటనైన నుదహరించియుండలేదు. నృసింహకవి విశ్వబ్రాహ్మణు డగుటవలననే నన్నయాది పూర్వకవులను కవిస్తుతిలో స్మరించి యుండలేదు. ఈ దిగువ రెండు పద్యములందుగల "పటికిన్నార్చిన లీలన్", "కట్లవైచి తూచుకొనగా" అను

**వీరేశలింగం పంతులు సంకుసాల నృసింహకవిని గూర్చి రాస్తూ "నితడు నియోగి బ్రాహ్మణుడయినను భట్టపరాశ రాచార్యుడయి వైష్ణవ మతమునందభి మానము కలవాడై యుండెను" అని చెప్పిండు.**

ప్రయోగములను బట్టి మన నృసింహకవి విశ్వబ్రాహ్మణుడని చెప్పుటకు సహాయకారులగు చున్నవి."

ఆ పద్యాలివి.

*మ॥ పటికిన్నార్చినలీల జందనము*
*పైఁబైఁబూయనంగారక*
*ఛ్ఛటలందుగాఁచు తెఱంగునం*
*జిగురు సెజ్జంగొర్లగానప్పుట*
*ప్పటికిం జేర(గనిచ్చినట్టొడలిపై*
*ఁబన్నీరు చల్లంగను*
*త్కటమయ్యెం బెనుఁగాక బంగరు*
*సలాకంబోలు నబ్బాలకున్॥*

(125వ పద్యము తృతీయాశ్వాసము, కవికర్ణరసాయనము)

*తే॥ హెూమవేదియందు నొక్క పీఠంబున*
*నొప్పిరపుడు కన్నెయును వరుండు*
*గంతుఁడిరువురంచుఁ గల*
*కూర్మిలొక్కింత*
*చూచి కట్లవైచి తూఁచుకొనఁగ॥*

(193వ పద్యము తృతీయాశ్వాసము- కవికర్ణ రసాయనము)

బ్రాహ్మణకవులు ఇప్పటి మాదిరిగానే ఆనాడు కూడా బ్రాహ్మణేతరుల రచనల పట్ల చిన్నచూపు చూసేవారు. అందుకే కవికర్ణ రసాయనము పీఠికలోని 20వ పద్యములో నృసింహకవి ఇల్లా రాసిండు.

*క. ఎల్లరు మెచ్చని మత్కృతి!*
*నుల్లంబున మెచ్చుగాఁక*
*యొకఁడుష్టకులం!*
*బొల్లని పల్లవి తామ్రము!*
*గొల్లలుగాఁబొగడ నొక్క కోయిల లేదే!*

అని ఆక్షేపించాడు.

అంతేకాదు పెదగాడ గంగయ్య తన విమర్శా గ్రంథములో చేమకూర వేంకటకవి భోగము కులస్థుడని, కందుకూరి రుద్రయ్య విశ్వబ్రాహ్మణుడని, పాల్కురికి సోమనాథుడు జంగముడని (బ్రాహ్మణేతరుడు), తెనాలి రామలింగము విశ్వబ్రాహ్మణుడని నిరూపించారు. అంతకుముందు కవుల చరిత్రను రాసిన గురుజాడ శ్రీరామమూర్తి, కందుకూరి వీరేశలింగం తదితరులు చేసిన నిర్ధారణలు ఎట్లా వాదనకు నిలబడలేవో తేల్చి చెప్పిండు. అంతేగాదు వారి రచనల్లోని పద్యాలను వివరిస్తూ ఎవరి కులమేమిటి?, ఎవరి ప్రాంతం ఏమిటి అనేది సవివరంగా రాసిండు. అయినప్పటికీ ఈ గ్రంథం గురించి ఇప్పటివరకూ చర్చ జరగలేదు. ఇట్లా అకడెమిక్‌గానూ, సామాజికంగానూ, సాహిత్య పరంగానూ విస్తృతంగా చర్చ జరగాలంటే ఈ 'అయిదురు కవుల సంగ్రహచరిత్ర' పునర్ముద్రణ జరగాలి. ఇందుకు కనీసం విశ్వబ్రాహ్మణ సంఘం వారైనా పూనుకోవాలి. కొత్త సాహిత్య చరిత్ర నిర్మాణానికి దోహద పడాలి. ఈ పుస్తక ప్రతి మిత్రులు విశ్వబ్రాహ్మణ సాహిత్యంపై పరిశోధన చేసిన బైరోజు శ్యామ్‌సుందర్ దగ్గర ఉన్నది. అంతేగాదు గంగయ్య ఇంగ్లీషు రచనలోనూ నిష్ణాతులు. ఇంగ్లీషు మాత్రమే తెలిసిన విద్యార్థులు తెలుగు నేర్చుకునేందుకు వీలుగా ఛందస్సు, వ్యాకరణ విషయాలని "ది గ్రౌండ్ వర్క్ ఆఫ్ తెలుగు గ్రామర్" పేరిట పుస్తకాన్ని వెలువరించారు.

పెదగాడ గంగయ్య 1933లో చనిపోయిండు కాబట్టి, అప్పటికి ఆయన వయసు 60 యేండ్లని ఊహించినట్లయితే ఆయన 1870 ఆ ప్రాంతంలో జన్మించి ఉంటాడు. ఆయన బహుశా 1905లో సికింద్రాబాద్ వెస్లి బాయ్స్ స్కూల్ ప్రారంభం నుంచి అందులో టీచర్‌గా పనిచేసి ఉంటాడు. సికింద్రాబాద్‌లో పనిచేసినప్పటికీ కచ్చితంగా తెలంగాణ వాడే అని నిర్ధారించలేము. ఏది ఏమైనా ఆయన పుస్తకాలు సమగ్రంగా అందుబాటులోకి వచ్చినట్లయితే తొలితరం బ్రాహ్మణేతర విమర్శకుడి గురించి సరైన అంచనాకు రావడానికి వీలవుతుంది.



# వ్యంగ్యమే ఆయుధంగా...

# బోయిభీమన్న

1975 కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత...

"కూడు దొరకక ప్రతిరోజు కూలికేగు
కులములన్నియు నొక్కటే కులము కాదె?
బ్రాహ్మణుడు మొదల్ మాదిగవాని వరకు
కష్టపడు వాడు ప్రతివాడు కార్మికుండె"

అని శ్రమజీవులను నిర్వచించిన డాక్టర్ బోయి భీమన్న అందరికీ ఇష్టమైన కవి.

*"ఓరి మూర్ఖుడా!*
*మతం విషంరా, విషం*
*నల్లమందన్నాడెవడో అది అబద్ధం*
*మతం విషం ఆత్మనే చంపుతున్న విషం"*

అంటూ "గుడిసెలు కాలిపోతున్నై" కావ్యంలో మత దురహంకారులను ఎదిరించిన కలం యోధుడు డాక్టర్ బోయి భీమన్న. దుర్మార్గాలను నిష్కర్షగా చీల్చి చెండాడె ఆయన, అదేకావ్యంలో మరింత పదునుగా స్పందిస్తూ...

"మేడలు పెరిగాయి
మురికివాడలు పెరిగాయి" (గుడిసెలు కాలిపోతున్నై)

అంటూ ఆర్థిక అసమానతల తీవ్రతను ప్రశ్నించాడు.

*"ప్రభూ.. మమ్మల్ని*
*వోటర్ల జాబితా నుంచి తొలగించి*
*బానిసల జాబితాలో చేర్చండి*
*చచ్చి మీ కడుపున పుడతాం"*

అంటూ బానిస దృక్పథాన్ని వ్యంగ్యంగా చెబుతూ ఎదిరించిన కవి బోయి భీమన్న .

*"లంచగొండితనం*
*మన జాతీయ క్రీడ కాదా!*
*దానికి నోబెల్ ప్రైజు ఇస్తే*
*ప్రతి ఏడాదీ అది మనదే కాదా"*

అంటూ రోజురోజుకూ పెరుగుతున్న లంచగొండితనం పై వ్యంగ్యాస్త్రాలను సంధించాడు.

*"కాలిపోతున్న గుడిసెల్ని కాలిపోనీ*
*వాటి సమాధులే పునాదులుగా*
*లేచే భవనాలకు రూపం కల్పించుకో"*

అని ఆవేదనను వ్యక్తపరిచాడు. 1975లో ఈ "గుడిసెలు కాలిపోతున్నై" పుస్తకానికి "కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు"ను గెలుచుకున్నారు. భీమన్న కవిగా 1922లో తన పదకొండవ ఏట రచనలు చేయడం ప్రారంభించాడు. 2005 లో మరణించిన బోయి భీమన్న దాదాపు 80 సంవత్సరాలు అక్షర యాత్ర అప్రతిహతంగా కొనసాగిస్తూ సృజనను కొనసాగించాడు. ఆయన పద్యకవి మాత్రమే కాదు. నాటకాలు రాసాడు, గేయ కవిత్వం వ్రాసాడు. వచన కవిత్వం వ్రాసాడు. అయితే సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ పద్యమంటేనే ఎక్కువగా ఇష్టపడ్డాడు. ఆయన వచన కవిత్వం "గుడిసెలు కాలిపోతున్నై" ఆయన రచనలు రాగోదయం(1954), దీపసభ (1955), కావ్యకుసుమాలు (1957), మధుగీత (1957), ప్రకృతిలో మానవప్రకృతి (1963), రాగవైశాఖి (1965), పిల్లీ శతకము (1967), అశోకవనిలో రాముడు (1969), రాభీలు(1971), మణిమానసం(1972) గుడిసెలు కాలిపోతున్నై (1973), బొమ్మ(1974), 'జన్మాంతర వైరమ్'(1980), భీమన్న ఉగాదులు (1983), భీమన్నపాటల తోట (1991), అకాండ తాండవం( 1996) యిలా అసంఖ్యాక రచనలతో తెలుగు సాహిత్య కేదారాన్ని సస్యశ్యామలం చేసిన కవికృషీవలుడు బోయిభీమన్న.



# తొమ్మిది నెలలు ఒక్క జీవితం



డా॥ కొండపల్లి నీహారిణి, 98663 60082



అలవికాని ప్రశ్నల పరంపరలో
ఆమె రూపం కొడిగట్టని దీపం
రాగ విరాగపు జవాబులే వినిపించే ప్రయత్నం
మెదళ్ళ ముళ్ళు మొలిచిన జీవులు వీళ్ల
కరుడుగట్టిన జాతులివి

నేలమ్మపై నెమలీకలెగిరినట్టు
నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గను
విజాతి జాగరూకతై
నీ పాద క్రాంతమైన ఒకానొక సందర్భం
ప్రస్తుతం లోనే జారుడుబండ ఆటలాడుతుంటాయి
అప్రస్తుత క్షణాలన్నీ వేవిళ్ళ రోజులవుతుంటాయి
నిన్ను గర్భశోకాల సంద్రాలలో పడదోస్తుంటాయి

ఓ చిటికెడు వెన్నెలను తెచ్చి
కుప్పలెన్నో పోసాననో
సీతాకోకచిలుకల వన్నెల రెక్కలెన్నో తెచ్చాననో
వాక్య నిర్మాణాల భవంతులను
తయారు చేస్తుంటారు వాళ్ళు

నెల తప్పిన యుద్ధక్రీడలో
ఆనందపు పండును కోసుకోవాలి
వాంతుల పరిణామాలు
తిండి సహించనీయని పరిస్థితులు
తిరుగుడు కుర్చీలకేం తెలుస్తాయి
వ్రణాల సలపరింతలన్నీ

నీవొక్కదానివే అయినప్పుడు
అలకలు విసుగులు హుంకరింపుల తీర్పుల్లో
తొంగి చూసే అహానికి
జీవన ప్రతిబింబమే చాలునట
మనుషులు కదా
మరుపులు ఉంటాయి మార్పులూ ఉంటాయి
నువ్వు కనే పురిటి వనాల్లో
అన్నీ పూల వైభవాలు  పురావైభవాలేనట
ఎండ నీవే నీడ నీవే
పగలు నీవే రాత్రి నీవే
మృత్యు పోరాటాలలో గెలుపు వెలుగువూ నీవే
నీ విషాదాశ్రవులకు అనేక కారణాలను
తొవ్విపోస్తారే గాని
పూడ్చే ధైర్యం ఎవ్వరు చేస్తారులే!

కథ

# సాండ్విచ్ బస్తైంది

రెండు తరాల మధ్యన నలిగిపోయిన ఒక స్త్రీ కథ...




దేవకీదేవి
99496 36515


అలారం వింటూనే దిగ్గున లేచి కూచుంది. మార్చ్ 8th ప్రోగ్రామ్ బాధ్యత ప్రిన్సిపాల్ తన భుజం మీద మోపిండు. సో ఎనిమిదింటికల్లా స్కూల్లో ఉండాలి. అది సరే. తంటాలు పడి టైంకు చేరుకుం దామంటే పనిమనిషి వారం రోజుల సెలవు ప్రకటించింది. తన పనుల జాబితా గిర్రున తిరిగి కళ్ళు దానికి వంత పాడినై. మనసు "కొంగు నడుముకు చుట్టవే చెల్లమ్మా!" అంటూ హితోపదేశం చేసింది. మనసు మాటను గౌరవిస్తూ శయ్యాగారాన్ని వీడింది. రాత్రే గిన్నెలు తోమే పనులు ముగించిన విషయం గుర్తుకొచ్చి ఊపిరి పీల్చుకొని బాత్రూం వైపుగా అడుగులు వేస్తుండగా ఫోన్ మోతకు వెనక్కి తిరిగి ఫోన్ అందుకుంది.

"హ్యాపీ విమెన్స్ డే మేడం." ప్రిన్సిపాల్ గొంతు.

"థాంక్యూ సర్"

"ఎనిమిదింటికల్లా ప్రోగ్రామ్ మొదలెడుదాం. కలెక్టర్ చాలా పంక్చువల్. మాట రాకూడదు. తొందరగా వచ్చేయండి." అంటూ కోపేన ఫోన్ పెట్టేసిండు.

"మధ్యలో ఫోనొకటి." అని విసుక్కుంటూ వెనక్కి తిరిగింది.కోడలు రచన డోర్ నాక్ చేస్తే? "ఓ ఆలోచన తళుక్కున. రకరకాల సందేహాల మధ్య అటు చేరుకుంది. రెండు మూడు సార్లు నాక్ చేస్తే గాని ఫలితం దక్కలేదు. ప్రశ్నార్థక వదనంతో తలుపులు తెరిచిన కార్తీక్ . ఆ మొహం చూడగానే గతుక్కుమంది. ఐనా తప్పదనుకొని

"ఈ రోజు విమెన్స్ డే. పనిమనిషి రాలేదు. ఎయిట్ కల్లా కాలేజీలో ఉండాలి. రచన కొంచెం హెల్ప్ చేస్తుందేమోనని.." సందిగ్ధంగా సగంలోనే ఆగిపోయింది.

"అమ్మా! ఇవాళ శనివారం. వారమంతా ఆఫీసు పనితో ఉక్కిరి బిక్కిరి కదా! పడుకునే ఉంది" నసుగుతూ చెప్పిండు కొడుకు రచన ఏ మాత్రం పట్టనట్టు దుప్పటి తీసి ఓ లుక్కేసి అటు తిరిగి పడుకుంది. మరుక్షణం అక్కడ నిల్చోలేక గిరుక్కున వెనుతిరిగిన శాంతికి


**"ఈ రోజు విమెన్స్ డే. పనిమనిషి రాలేదు. ఐట్ కల్లా కాలేజీలో ఉండాలి. రచన కొంచెం హెల్ప్ చేస్తుందే మోనని.." సందిగ్ధంగా సగంలోనే ఆగిపోయింది. "అమ్మా! ఇవాళ శనివారం. వారమంతా ఆఫీసు పనితో ఉక్కిరి బిక్కిరి కదా! పడుకునే ఉంది" నసుగుతూ చెప్పిండు కొడుకు రచన ఏ మాత్రం పట్టనట్టు దుప్పటి తీసి ఓ లుక్కేసి అటు తిరిగి పడుకుంది.**


"నీకు వీలు కాకపోతే ఫుడ్ ఆర్డర్ చేసుకుంటాములే" అన్న సుపుత్రుని మాటలు చెవిన పడ్డాయి. గుండె బరువెక్కింది. కళ్ళలో నీళ్ళు తన్నుకొచ్చాయి. "వాళ్ళ ఆర్డర్ తిండి సరే. మరి తండ్రి, నానమ్మ ఆ తిండి తినరనే ఇంగితం లేదు" అనుకుంటూ బాత్రూంలో దూరింది.

ఏడున్నరకల్లా మనోవేగాన్ని మించిన వేగంతో వంటలతో తంటాలు పడి టేబుల్ ని ఆ ఆహార పదార్థాలతో సర్వాంగ సుందరంగా అమర్చి అత్తగారి బెడ్రూంలోకి తొంగి చూసింది. మెలకువతోనే ఉన్నదని గమనించి ఓ పిలుపు విసిరింది.

"ఆ((( శాంతి. కొంచెం బాత్రూంలో నా బట్టలు వెయ్యవే. గీజర్ ఆన్ చేయడం మరిచిపోయేవు. అన్నట్టు టిఫిన్ ఏం చేసావు?" అంటూ అత్తగారి ఆర్డర్ల పరంపర. వాటిని శిరసావహిస్తూనే

"ఇడ్లీ ,సాంబార్, చట్నీ చేసానండి" అని సమాధానమిచ్చింది.

"చట్నీ అంటే...?"

"అదేనండీ . కొబ్బరి, పుట్నాలతో"

"అల్లం బెల్లం చట్నీ చేయలేదా? నాలుక్కి ఏమీ సయించడంలేదు."

"లేదత్తమ్మా! ఇవాళ కాలేజీలో మీటింగున్నది. తొందరగా పోవాలి".

"ఏం మీటింగులో ఏముద్యోగాలో?

కథ

> **“ప్రార్థనాగీతం తర్వాత సృజన అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురించి మాట్లాడుతుంది. నెక్స్ట్ రాణీ. రుద్రమ, ఝూన్సీ లక్ష్మీబయి, సావిత్రీబాయి పూలే,అచ్చమాంబ, ఇందిరా గాంధీ, లక్ష్మీ సెహగల్, పాలకుర్తి ఐలమ్మ, కల్పనా చావ్లా, పి.టి ఉష మేథావాట్కర్ మొదలైన వాళ్ళందరి మనోభావాల వ్యక్తీకరణ, ఆ నెక్స్ట్ కలెక్టర్ సందేశం.”**

మా రోజుల్లో....” అంటూ ఏదో తవ్వకం మొదలు పెట్టింది. ఎక్కువసేపుండటం భావ్యం కాదని బయటకు దారి తీసింది. అది అనుభవం నేర్పిన పాఠం. ఎంత సేవ చేసినా తృప్తిలేని జీవితాలు. కొంపలో అందరూ అచ్చుగుద్దిన శాల్తీలే” అని తనలో తాను గొణుక్కొంటూ బయటకు నడిచి స్కూటీ స్టార్ట్ చేయబోతుండగా

“ఏమేవ్! ఏం టిఫిన్ చేసి తగలడ్డావు?” పతియే ప్రత్యక్ష దైవంగా భావించుకునే మొగుడి నుండి ఓ చెణుకు.

“ఇడ్లీ, సాంబారు, చట్నీ, ఆలూ ఫ్రై, వంకాయ ఇగురు. ఇడ్లీలు హాట్ బాక్స్‌లో ఉన్నై. చల్లారితే మీ గొంతు దిగవు కదా! తొందరగా తిని తగలడండి.” అంటూ విసురుగా సమాధానం పడేసి వెళ్ళి పోయింది. గతంలో ఐతే శాంతికి ఈ విసుర్లకు మాట పెగిలేది కాదు.

“ఒసేయ్. రోజురోజుకు గొంతు పెరిగి పోతుందే. మహిళా దినోత్సవమనా?” అన్న మొగుడి మాటలు లీలగా చెవిన పడి ఏడ్వలేక నవ్వుకుంటూ స్కూటీ స్పీడును కసిగా పెంచింది.

ప్రిన్సిపాల్ ఆర్డర్‌ను శిరసావహించిన దానిలా ఎనిమిందింటికల్లా కాలేజ్ చేరుకుంది.

సంతకంతో పాటు ఆయనకూ హాజరు ఇచ్చి కార్యక్రమంలో మునిగి పోయింది. విద్యార్థులందరికీ వాళ్ళ పర్ఫామెన్స్ గుర్తు చేసి వేదిక వైపు వస్తుండగా ప్రిన్సిపాల్ నుండి పిలుపు.

జీ హుజూర్ అన్నట్లుగా అతని ముందు వాలింది.

“ఓ సారి కార్యక్రమాల లిస్టు చెప్పండి.” ప్రిన్సిపల్ జగదీశ్

“ప్రార్థనాగీతం తర్వాత సృజన అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురించి మాట్లాడుతుంది. నెక్స్ట్ రాణీ రుద్రమ, ఝాన్సీ లక్ష్మీభాయి, సావిత్రీబాయి పూలే, అచ్చమాంబ, ఇందిరాగాంధీ, లక్ష్మీ సెహగల్, పాలకుర్తి ఐలమ్మ, కల్పనా చావ్లా, పి.టి ఉష మేథాపాట్కర్ మొదలైన వాళ్ళందరి మనోభావాల వ్యక్తీకరణ, ఆ నెక్స్ట్ కలెక్టర్ సందేశం.”

“అంతమంది అంటే టైం ఎక్కువ తీసుకుంటుందేమో?”

“అందరిది కలిసి గ్రూప్ గా ఒకే ఈవెంట్.”

“టోటల్‌గా ఎంత టైం?”

“అరగంట”

“ఐతే కలెక్టర్ సందేశం తర్వాత పెట్టండి.

“ముఖ్య అతిథి తర్వాత ప్రోగ్రామ్ బావుండదేమో??? ....సర్”

“ఆయనకు వేరే ప్రోగ్రాం ఉందట. అంత టైం ఇవ్వలేనని ముందే చెప్పిండు.”

“నేను చెప్పినట్లు మెజిస్ట్రేట్ మేడం రాధ గారినో యం.డి.వో సుష్మిత మేడంను...”

“నిజమే. రాధ గారు ఫోన్ ఎత్తకపోవడంతో యం.డి.వో కన్నా కలెక్టర్ బెటర్ కదా!” అని ఆలోచించిన.

ఆయనతో వాదించినా ప్రయోజనం లేదని అక్కడి నుండి నిష్క్రమించి పనిలో మునిగి పోయింది శాంతి. అనుకున్న టైంకు ప్రోగ్రామ్ మొదలైంది. ప్రిన్సిపాల్ ఆదేశానుసారం కలెక్టర్ సందేశం ఇవ్వగానే ఆయనకు సన్మాన కార్యక్రమం ముగించి ఆయన్ని సెండాఫ్ చేసి వస్తానంటూ



పోయిన ప్రిన్సిపాల్ నాలుగింటి వరకు జాడా పత్తాలేడు. సమత మిగిలిన లేడీ లెక్చరర్స్ సహకారంతో కార్యక్రమాల న్నిటినీ దిగ్విజయంగా పూర్తి చేసి ఇంటి దారి పట్టింది.

2

కాలింగ్ బెల్ రెండు సార్లు ప్రెస్ చేస్తేగాని తలుపులు తెరుచుకోమని భీష్మించుకున్నై. ముచ్చటగా మూడో సారికి దయతలచడంతో లోపలికి ఎంటరై ముందు బాత్రూం దారి వెతుక్కుని ఫ్రెషప్పైంది. తనను చూస్తూనే

"ఓ తొందరగానే కాలేజ్ వదిలిందే?" ఓ వెటకారపు పలకరింత భర్త నుండి. మనసు చివుక్కుమంది "ఇది ఎప్పటి బాగోతమేగా?" అని సర్ది చెప్పుకున్నా మనసు కుదుటపడలేదు. తను ఉద్యోగం వెలగబెట్టినన్నాళ్ళు రకరకాల పనుల పేరిట కొన్ని సార్లు అర్ధరాత్రి అపరాత్రైనా తీవిగా వచ్చేవాడా. రాగానే టంచనుగా వేడి వేడి చపాతీ చేయక తప్పేది కాదు. నా ఆలస్యం వల్ల పని ఒత్తిడి నాకే గాని తనకు ఒరిగిందేమి లేదు. ఐనా ఈ వెటకారాలు. ఇగో తృప్తి పరుచు కోవడ మంటే ఇదేనేమో. పెళ్ళిళ్ళలకు ఇల్లు కట్టడానికి మాత్రమే తన ఉద్యోగావసరం" అని ఆలోచిస్తూనే

"డిన్నర్‌కు ఏం చేయమంటారు" అని అడిగింది.

"చపాతీ చెయ్యి. సర్దుకుంటాలే."

ఏదో చపాతీ చేయడమే సులువైనట్లు అదో స్టైలు అని తనలో తను గొణుక్కుంటూ అత్తగారి రూం వైపు దారి తీసింది.

"అత్తమ్మా ! ఏం తింటారు రాత్రికి" అడిగింది

"అందరికీ ఏం చేస్తున్నావో...?" అంటూ ఓ దీర్ఘం తీసింది

"మీ. కొడుక్కు చపాతి చేస్తున్న"

"ఔనా? చపాతీ నవలలేక చస్త. కొంచెం ఉప్మా చేయవే. నీకు పుణ్య ముంటుంది." మధ్యలో పుణ్యమొకటి ఊడి పడిందని తనలో తానే నవ్వుకుంటూ వంటింటి దారి పట్టింది. మధ్యలో డైనింగ్ టేబుల్ బ్రేక్ వేసింది నన్ను చూడమంటూ. ప్రతి గిన్నెలో చెంచాలు జెండాల్లా . ఎక్కడివక్కడే ఏదో స్టాప్ గేం తీరు. ఆ సీన్ చూసి ఖంగుతిని హాట్ బాక్స్ తెరిచింది. నిండుగా ఇడ్లీల పలకరింపు. కూరలు రైస్ కుక్కర్ కూడా ఇడ్లీలకు వంత పాడటంతో శాంతి పిల్లల బెడ్ రూం వైపు చూసింది. అప్పుడే ఇంట్లోకి వస్తున్న కొడుకూ కోడలు.

"ఏంట్రా? ఎక్కడినుండి?" అడిగింది కొడుకును.

"మా ఫ్రెండ్ వాళ్ళ గృహ ప్రవేశానికి పోయినం."

"బ్రేక్ ఫాస్ట్...?"

"ఇడ్లీలు తినాలనిపించలేదు. స్విగ్గీలో దోశ ఆర్డర్ చేసుకున్నాం."

"ముందే చెప్తే దోశ చేసేదాన్ని కదా!"

"నీ హడావిడిలో ఆ మాట చెప్పడం మరచిన."

"డిన్నర్‌కు చపాతీలు చేస్తున్న. తింటారా?"

"నాకు ఒక చపాతీ చాలు అత్తమ్మా!" దయతలిచి సమాధానం ఇస్తూ బెడ్రూం లోకి దూరింది కోడలు

"నీ సంగతి?" అంటూ కొడుకును చూసింది.

"రెండు చాలు. చాలా తలనొప్పిగా ఉంది" అంటూ కొడుకూ పెళ్ళాన్ని అనుసరించిండు..

నా జన్మకిది తప్పదు అనుకుంటూ కిచెన్‌లో చొరబడి డిన్నర్ ఏర్పాట్ల తతంగం పూర్తి చేసి విడిదిలో మగపెళ్ళి వాళ్ళకులా ఆహ్వానించింది అందర్నీ. ప్రాణనాథుడు కనికరించి వేంచేశాడు. ఆయనకు ప్లేటు సిద్ధం చేసి అత్తగారి రూమ్‌కు దారి తీసింది.

"అత్తమ్మా! డైనింగ్ టేబుల్ దగ్గరికి వస్తారా? ఇక్కడికే తెమ్మంటారా?" శాంతి టి.వి.లో లీనమైన అత్తగారికి తనమాట చెవిన పడకపోవడంతో మరో సారి అడక్క తప్పలేదు.

"ఒళ్ళంతా నొప్పులేనే. రాలేను. ఇక్కడికే తే." అంటూ ఆర్డర్ పడేసింది. "ఒకచోట కదలకుండా ఉంటె నొప్పులు కాక ఇంకేంటంట" తనలో తాను అనుకుంటూ ఆమె ఆజ్ఞను శిరసావహించి ఉప్మా ప్లేట్‌తో రూం చేరుకుంది. ప్లేటు అందుకున్న అత్తగారు ప్లేట్ లోకి తొంగి చూసి

"చట్నీ లేదా?" అడిగింది

"పొద్దున చేసిన చట్నీ తెమ్మంటారా?

"వద్దులే. దీంతో సర్దుకుంటాలే. అల్లం చట్నీ ఐతే బాగుండేది"

"రేపు ఆదివారమే కదా! తప్పకుండా చేసి పెడ్తాను. ఈ ఒక్కపూటకి సర్దుకోండి ప్లీజ్" అన్న సంజాయిషీతో వెనక్కి తిరిగింది.

టేబుల్ పైన పొద్దుటినుండి పడి ఉన్న గిన్నెలను సార్టౌట్ చేసి ఆ రోజు పనులకు ముక్తాయింపు ఇచ్చి గోడ గడియారం వైపు దృష్టి సారించింది. తొమ్మిదిన్నర కావస్తుంది. పడకమీద వాలుదామని బెడ్‌రూం వైపు అడుగులు వేస్తుండగానే తొందరగా వచ్చెయ్ అన్నట్లుగా ఫోన్ మోత. ప్రొద్దున్నే యారాలు కొడుకు కోడలు అమెరికా నుండి తమ ఇంటికే వస్తున్నారన్న వార్త అందించింది ఫోన్. హతోస్మి. పొద్దున్నే లేవక తప్పదురా భగవంతుడా అనుకుంటూ మంచం మీద పడి మేను వాల్చింది.

పని మనిషి సాయంతో తొందరగానే తెములుకొని వంటింటిలో చొరబడింది.

**"ఔనా? చపాతీ నవలలేక చస్త. కొంచెం ఉప్మా చేయవే. నీకు పుణ్య ముంటుంది." మధ్యలో పుణ్యమొకటి ఊడి పడిందని తనలో తానే నవ్వుకుంటూ వంటింటి దారి పట్టింది. మధ్యలో డైనింగ్ టేబుల్ బ్రేక్ వేసింది నన్ను చూడమంటూ. ప్రతి గిన్నెలో చెంచాలు జెండాల్లా . ఎక్కడివక్కడే ఏదో స్టాప్ గేం తీరు. ఆ సీన్ చూసి ఖంగుతిని హాట్ బాక్స్ తెరిచింది. నిండుగా ఇడ్లీల పలకరింపు.**

పూరీల పిండి తడిపి, కూర్మా తయారు చేసి నాలుగు పూరీలు ఒత్తి కాల్చడానికి పూనుకొంది. అప్పుడే బెడ్రూంనుండి ఊడిపడ్డ కోడలు...

“ఒహ్ ఇంకా బ్రేక్ ఫాస్ట్ రెడీగా కాలేదా? నేను కాంటీన్‌లో తింటాను లెండి. మీరు నెమ్మదిగా చేసుకొండి.” అంటూ వెనక్కి తిరిగింది. కాల్చిన రెండుపూరీలను ప్లేట్‌లో పెట్టి

“రెండు పూరీలు ఐనై. ఇవి తినేవరకు మరో రెండు కాలుస్తా” అని ప్లేటు సిద్ధం చేసిన అత్తను పట్టించుకోకుండా కోడలు వెళ్ళిపోయింది. ఆ సంఘటనకు ఖంగు తింది శాంతి. హాల్లో కూర్చున్న తండ్రి కొడుకులు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

“వాళ్ళు వచ్చే టైమైంది. తొందరగా తెమలండి” మొగడు మహాశయునికి బాధ్యతను గుర్తు చేసింది శాంతి.

“నిజమేనోయ్. మరో ఐదు నిమిషాల ముందు గుర్తుచేస్తే బావుండేది.” ఓ ఉచిత సలహా మొగుడి నుండి.

“ఎంతసేపు నా బాధ్యతలు గుర్తు చేయడం తప్ప మీ బాధ్యతను గురించి ఆలోచించిన పాపాన పోయేదుందా?”

“కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ, భోజ్యేషు మాతా, రూపేషు లక్ష్మీ, శయనేషు రంభా, క్షమయా ధరిత్రీ షట్కర్మ యుక్తా సహ ధర్మ చారిణీ” అని ఊరికే అనలేదోయ్. అనుభవించక తప్పదు” అన్న మొగుడి మాటలకు శాంతి లో అశాంతి తన్నుకొచ్చింది. ఇన్నాళ్ళు పిల్లలకోసం సర్దుకోవడం అలవాటు చేసుకున్న తనకు రోజురోజుకు సహనం నశించిపోతుంది. “తెగేదాకా లాగడమే వీళ్ళపని” అని తనలో తాను గొణుక్కుంటూ అక్కడినుండి నిష్క్రమించింది.

వచ్చిన వాళ్ళు వీడ్కోలు తీసుకునే లోపు శాంతి నడుములు పడిపోయాయి. వచ్చిన వాళ్ళతో రచన తెగ హస్కులు వేసుకుంటూ షాపింగులకు చెక్కేంది తప్ప తనకు సాయం చేసిన పాపాన పోలేదు. ఆ వచ్చిన పిల్లా అంతే. పైగా పోతూ పోతూ “అమ్మానాన్నలు తీర్థ యాత్రలకు వెళ్లటం వలన మిమ్మల్ని శ్రమ పెట్టాల్సి వచ్చింది. టికెట్స్ బుక్ చేసుకున్న తర్వాత విషయం తెలిసింది. బతికి పోయాం. ఇప్పటికైనా ఇల్లు చేరుకున్నారు.” అంటూ ఓ సంజాయిషీ తగిలించి వెళ్ళి పోయారు. అదో ఘట్టం.

3

మూడు సంవత్సరాల కాలం కొన్ని మార్పులు తెచ్చి పెట్టింది. డేట్ ఆఫ్ బర్త్ రిటైర్మెంట్ తీసుకోవలసిందే అని శాసించింది. స్కూటర్ ప్రమాదం ఆయన ప్రాణాలను బలిగొంది. హార్ట్ అటాక్ అత్తగారికి భూమ్మీద నూకలు చెల్లాయని చెప్పింది. కొడుకూ కోడలు దాంపత్యం ఓ చంటిదానికి జన్మనిచ్చింది. వియ్యంకులది పల్లెటూరు. పైగా కోడలు తల్లి లేని పిల్ల. దాంతో కాన్పుతో పాటు బాలింత పని భారం ఒక్క చేత్తో మోయాల్సి వచ్చింది శాంతికి. మనవరాలు వచ్చిందన్న సంతోషం ఆ అలసటను కొంత మాయంచేసింది. ఓ రోజు స్నానం చేసి అప్పుడే హాల్ లోకి వస్తుండగా చంటిది గుక్క పట్టి ఏడుస్తుండటంతో గబాల్న పోయి ఎత్తుకొని జో హాయి అంటూ లాలించడం మొదలు పెట్టింది.

“అత్తమ్మా ఎత్తుడు అలవాటౌతది. ఎత్తుకోకండి” బాత్రూంనుండి వస్తున్న కోడలు గద్దించింది. ఒక్క ఉదుటున పిల్లను తొట్లెలో వదిలేసి వెనక్కి తిరిగింది శాంతి. మరో రోజు తలకు నూనె రాస్తుండగా

“నేను రాస్తాను కదా? అత్తయ్యా.. రాసే పద్ధతి ఇది కాదు.” అంటూ చేతిలోనుండి పిల్లను లాక్కుంది. తినిపిస్తుండగా, బట్టలు వేసేటప్పుడు డైపర్ మార్చేటప్పుడు. ఇట్లా అన్ని సందర్భాల్లో శాంతిని విమర్శిస్తూ, వ్యతిరేకిస్తూ కొనసాగుతూ పోవడం మొదలైంది.

కాని కొడుకులో చలనం వచ్చింది. రచనకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. డైపర్లు మార్చడం, నిద్ర పుచ్చడం వంటి పనులు ఓపిగ్గా చేస్తుంటే గుండమ్మ కథలోని “ఆడుతు పాడుతు పని చేస్తుంటే” పాటను గుర్తు వచ్చింది శాంతికి. ఈ మార్పు శాంతిని ఆశ్చర్య పరిచినా సంతోషాన్నిచ్చింది. “ఈ సహనం సహకారాలు తన జీవితంలో తొంగి చూస్తే ఎంత బావుండేదో “ అన్న ఆలోచన తన మనసును వాడిగా గుచ్చుకున్నా తన్ను తానే సంభాళించుకుంది. చంటిదానితో డిటాచ్మెంట్ తప్ప మిగిలిన ఇంటిపనులన్నీ తన చుట్టే తిరుగుతున్నై. శరీరం సహకరించను పొమ్మంటుంది. మనసు సంభాళించు కొమ్మంటుంది. రెంటి మధ్య పెద్ద సంఘర్షణ. ఇంతకాలం తను ఒక సాండ్విచ్‌లా రెండు తరాల మధ్య నలిగి పోయింది. ఇంకా ఆ ఒత్తిడిని భరించాల్సిన అవసరం లేదు. వ్యక్తుల్లో మానవత్వం ఉండి స్వార్థం దూరమైతే తప్ప తనలాంటి వాళ్ళు బతుకలేరు. చట్టాలన్నీ మహిళా దినోత్సవంలాంటివే . మంచి పెన్షన్ వస్తున్న తను ఇంకా ఇంకా ఒత్తిడిని భరించాల్సిన అవసరం లేదు.” అని ఆలోచించి తన పేరుమీదున్న ఇంటిని ఓ అనాథ శరణాలయానికి తనపార్థివ శరీరాన్ని హాస్పిటల్‌కు డొనేట్ చేసే వీలునామా రాసి శాంతి అనే సాండ్విచ్ బస్తె సాకేత్ ప్రణామ్ దారి పట్టింది.

**మూడు** సంవత్సరాల కాలం కొన్ని మార్పులు తెచ్చి పెట్టింది. డేట్ ఆఫ్ బర్త్ రిటైర్మెంట్ తీసుకోవలసిందే అని శాసించింది. స్కూటర్ ప్రమాదం ఆయన ప్రాణాలను బలిగొంది. హార్ట్ అటాక్ అత్తగారికి భూమ్మీద నూకలు చెల్లాయని చెప్పింది. కొడుకూ కోడలు దాంపత్యం ఓ చంటిదానికి జన్మనిచ్చింది. వియ్యంకులది పల్లెటూరు. పైగా కోడలు తల్లి లేని పిల్ల.

వ్యాసం

# ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మహిళా సాహిత్యం

మహిళా సాహిత్యం పైన ఒక కోణం...



డా॥ భీంపల్లి శ్రీకాంత్
90328 44017

తెలుగు సాహిత్యంలో పాలమూరు జిల్లా సాహిత్య ప్రస్థానం అగ్రగణ్యమైనది. ప్రాచీనకాలం నుంచి నేటి ఆధునికకాలం వరకు అపురూపమైన ఎన్నో గ్రంథాలు ఈ నేలన ఆవిష్కరించబడ్డాయి. అమూల్యమైన సాహిత్యవికాసం ఈ గడ్డపై విరాజిల్లి తెలుగునేలంతా దేదీప్యమానంగా ప్రకాశమానమైంది. అంతేకాదు పాలమూరు జిల్లా కవిపండితులకు, రచయితలకు, పరిశోధకులకు, ఉద్యమ కారులకు, స్వాతంత్ర్య సమరయోధులకు, పత్రికా సంపాదకులకు నిలయం. సంస్థానాల ఖిల్లాగా పాలమూరు జిల్లా యావత్తు రాష్ట్రంలోనే వినుతికెక్కింది. నాటి సంస్థానాలు కవులను, పండితులను ఘనంగా పోషించి అమూల్యమైన గ్రంథాలకు పురుడుపోశాయి. అనేక అద్భుతమైన కావ్యాలు వెలుగు చూడటానికి దోహదపడ్డాయి. పాలమూరు జిల్లాలో తెలుగులోనే కాక సంస్కృతం లోనూ అనేక కావ్యాలు వెలుగుచూశాయి. తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలకు శ్రీకారం చుట్టిన జిల్లా కూడా పాలమూరు జిల్లానే కావడం జిల్లాకి గర్వకారణం.

పాలమూరు జిల్లాలో సింహగిరి కృష్ణమాచార్యులు, గోన బుద్ధారెడ్డి, కాకునూరు అప్పకవి, ఎలకూచి బాలసరస్వతి వంటి ప్రసిద్ధ కవులు సృష్టించిన సాహిత్యం తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసింది. సంస్థానాల పోషణలో చాలా కావ్యాలు వెలుగు చూశాయి. తెలంగాణలోనే ప్రసిద్ధమైన జటప్రోలు, వనపర్తి, గద్వాల, ఆత్మకూరు, అలంపురం, గోపాల్‌పేట సంస్థానాలలోని రాజుల ప్రోత్సాహంతో విరివిగా సాహిత్యం వెలుగుచూసింది. ఆయా తెలుగు, సంస్కృత కవులను ప్రోత్సహించి అనేక కావ్యాలు వెలుగుచూడటానికి దోహద పడ్డాయి. కవులు అనర్ఘరత్నాలనదగ్గ కావ్యాలను వెలువరించడానికి కారణమయ్యాయి.

సంస్థానాల కాలంలో ఇక్కడి పాలకులు తెలుగు కవులను పోషించి చక్కని పద్యకావ్యాలను, శతకాలను, నాటకాలను వెలువడటానికి కారణమయ్యారు. ఈ ప్రాంతంలోని కవులు స్వతంత్ర కావ్యాలనూ, అనువాద కావ్యాలనూ రెండింటిలోనూ తగినంత ప్రావీణ్యాన్ని సంపాదించి కావ్యాలను వెలువరించారు. రాజులకు, కవులకు మంచి సాన్నిహిత్యం, మిత్రత్వం ఉండటం వల్లనే తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయే కావ్యాలను కవులు లోకానికందించారు. నాటి ప్రాచీన సాహిత్యం మంచి నేటి ఆధునిక సాహిత్యం వరకు జిల్లాలో వెలువడిన సాహిత్యంలో మహిళా సాహిత్యం కూడా పేర్కొనదగినది.

### "తొలి తెలుగు కవయిత్రి" కుప్పాంబిక

పాలమూరు జిల్లాకు చెందిన ఎంతోమంది కవయిత్రులు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. అందులో ప్రముఖంగా పేర్కొనదగింది తొలి తెలుగు కవయిత్రి కుప్పాంబిక. ఈమె జన్మస్థలం బూదపూర్ అంటే నేటి భూత్పూర్ మండల కేంద్రం. ఈమె తెలుగులో మొట్టమొదటి రామాయణ మైన రంగనాథ రామాయణకర్త గోన బుద్ధారెడ్డి కుమార్తె. మాల్యాల గుండనాథుని భార్య. కుప్పాంబిక తన భర్త చనిపోయినప్పుడు క్రీ.శ.1276లో ఆమె బూదపూర్ (నేటి భూత్పూర్) లో ఒక శాసనం వేయించింది. "అనుమకొండ పురవరేశ్వర కాకతీయ రుద్రదేవ మహారాజులు ఓరుగంటను



కుప్పాంబిక

పృథ్వీరాజ్యము సేయుచుండంగాను" వేయించిన శాసనమిది. ఈ శాసనాన్ని బట్టి ఈమె 1250 ప్రాంతంలో పుట్టిందని భావించవచ్చు. కుప్పాంబిక భర్త మాల్యాల గుండనాథుడు. ఇతడు మాల్యాల వంశానికి చెందినవాడు. గోన, మాల్యాల వంశాలవాళ్ళు కాకతీయుల సామంతులు. తన తండ్రి గోన బుద్ధారెడ్డి నుండి సాహిత్యాన్ని వారసత్వంగా పొందిన కుప్పాంబిక అనేక పద్యాలను రచించింది. అయ్యలరాజు రామభద్రుడు తాను సంకలనం చేసిన గ్రంథంలో కుప్పాంబిక రాసిన ఈ కింది పద్యాన్ని పేర్కొన్నాడు.

మ. *వనజాతాంబరుడేయు*
*సాయకములన్ వర్ణింపగా రాదు, నూ*
*తన బాల్యాధిక యౌవనంబు మదికిన్*
*ధైర్యంబు రానీయద*
*తనురక్తిన్ మిముబోంట్లకున్*
*దెలుపనాహా! సిగ్గు మైకోదుపా*
*వన వంశంబు స్వతంత్రమీయదు*
*చెలీ! వాంఛల్ తుదలుకునే*

బాల్యం నుండి యవ్వన దశకం చేరుతున్న తనపై మన్మథుడు కురిపించే బాణాలు పెంచే మోహాన్ని తన ప్రియసఖులతో కూడా చెప్పుకోలేకపోవడం సిగ్గుమూలంగా ఉన్నత వంశంలో జన్మించడం మూలంగా తన భావాల్ని పంచుకోలేకపోవడాన్ని ఆమె ఈ పద్యం ద్వారా వివరించింది.

కుప్పాంబికను తొలి తెలుగు కవయిత్రిగా వెలుగులోకి తీసుకువచ్చింది ప్రసిద్ధ తెలంగాణ చరిత్ర, సాహిత్య పరిశోధకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్. కుప్పాంబికనే కాదు అనేక తెలంగాణ చరిత్రకారులను, సాహిత్యవేత్తలను వెలుగులోకి తీసుకువచ్చింది శ్రీనివాస్. అయితే కుప్పాంబిక పాలమూరు జిల్లా కవయిత్రి కావడం జిల్లాకే గర్వకారణం.



నాంపల్లి శాంతాకుమారి

అలాగే పాలమూరు జిల్లాలో సంస్థానాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఈ సంస్థానాలలో కవయిత్రులు తమదైన కలవాలాన్ని, సాహితీపిపాసను లోకానికి అందించారు.

## చేబ్రోలు సరస్వతిదేవి

ఉమ్మడి పాలమూరు జిల్లా సంస్థానాలలో ప్రసిద్ధమైన జటప్రోలు సంస్థానంలో చేబ్రోలు సరస్వతిదేవి కవయిత్రిగా పేరుగాంచింది. ఈమె ప్రసిద్ధకవి వాజపేయయాజుల రామసుబ్బా రాయకవి సమకాలికురాలు. ఈమె "సరస్వతీ రామాయణం, ఉత్తర రామాయణం, శ్రీ సత్యనారాయణ వ్రతకల్పం, సరస్వతీ శతకం, పతివ్రతా శతకం, ఆత్మోపదేశం, గురుగీత " అనే రచనలు చేసింది. ఈమె సంపాదకత్వం లోనే 1928లో "వైజయంతి" అనే మాసపత్రిక వెలువడింది. ఈమె రచించిన 'సరస్వతీ రామాయణం' మద్రాస్ విశ్వవిద్యాలయంలో ఇంటర్మీడియట్ వారికి పఠనీయగ్రంథంగా ఉండడం విశేషం.

## తిరుమల బుక్కపట్నం కృష్ణమ్మ

ఆత్మకూరు సంస్థాన కవయిత్రి అయిన తిరుమల బుక్కపట్నం కృష్ణమ్మ ఆత్మకూరు సంస్థాన విద్వాంసులైన బుచ్చి వేంకటాచార్యుల కుమార్తె. ప్రసిద్ధ 'బాలసరస్వతి' బుక్కపట్నం శ్రీనివాసా చార్యుల సోదరి. తండ్రి దగ్గరే సంస్కృతం, జ్యోతిశ్శాస్త్రములలో అద్భుతమైన పాండిత్యా సంపాదించింది. పలు రచనలు చేసిన కృష్ణమ్మ 19వ శతాబ్దకాలంలో జీవించింది.

## రూఫానుపేట రత్నమ్మ

ఆత్మకూరు సంస్థానంలో విరివిగా విద్వత్సభలు జరిగేవి. ఈ విద్వత్సభలకు ఇప్పటూరు నుంచి రూఫానుపేట రత్నమ్మ వచ్చి పాల్గొనేది. ఈమె అసలు పేరు రాణీ రత్నమాంబ దేశాయి. ఈమె 'శివ కురువంజి' అనే యక్షగాన కోవకు చెందిన కురవంజి ని రచించింది. ఇంకా "వెంకటరమణ శతకం, శ్రీనివాస శతకం, బాలబోధ, దశావతార వర్ణన" అనే రచనలు చేసింది. తెలంగాణ ప్రాంతం నుంచి కురవంజి ఇదొక్కటేనని యక్షగాన సాహిత్యంపైన పరిశోధన చేసిన ఆచార్య ఎస్వీ జోగారావు పేర్కొనడం విశేషం.

## బోయినపల్లి ఆండాళమ్మ

ప్రసిద్ధ పాలమూరు రచయిత్రి, ఆత్మకూరు నివాసి అయిన బోయినపల్లి ఆండాళమ్మ హనుమంతుని చరిత్ర ఆధారంగా 'హనుమజ్జీవితం' పేరుతో తెలుగులోకి అనువదించింది. ఇందులో హనుమంతుని జీవితంలోని అనేక ముఖ్యఘట్టాలను ఆవిష్కరించింది. గోలకొండ కవుల సంచికలో ఈమె రాసిన ఉమామహేశ్వర వ్రతకథ ప్రచురితమైంది.

## వి.లక్ష్మీదేవమ్మ

అమరచింతకు చెందిన వి.లక్ష్మీదేవమ్మ గోలకొండ కవుల సంచికలో 'దేశమాత' ను కీర్తిస్తూ అనేక పద్యాలను రచించింది.

## బిజినేపల్లి చెన్నకృష్ణమ్మ

వనపర్తి సంస్థానానికి చెందిన బిజినేపల్లి చెన్నకృష్ణమ్మ ప్రసిద్ధ చంద్రమౌళీశ్వరస్వామి శిష్యురాలు. ఈమె 19వ శతాబ్దం ఉత్తరార్ధానికి చెందిన కవయిత్రి. ఈమె "కపిల దీవహంతి సంవాద యక్షగానం, సత్యనారాయణ కథాకల్పం, బువ్వబంతి పెండ్లి పాటలు, గురుభజన తత్త్వములు" అనే కృతులను రచించింది.

## చిగుళ్ళపల్లి సుశీలమ్మ

రచయిత వలకొండ మల్లయ్య కూతురైన చిగుళ్ళపల్లి సుశీలమ్మ దాదాపు రెండు వందల కీర్తనలు రాసింది. వాటిని 'గురు భజన కీర్తనలు' పేరుతో పుస్తకంగా ముద్రించింది.

## మనుసాని వెంకటలక్ష్మమ్మ

ఆత్మకూరుకు చెందిన మనుసాని

వెంకటలక్ష్మమ్మ "భజనలు - కీర్తనలు - తత్వములు" అనే కీర్తనల సంపుటిని రచించింది. ఈమె రచించిన కీర్తనలకు 'ఆత్మకూరు నిలయ శ్రీలక్ష్మాంబ వరద ప్రసన్న' అనే ముద్ర కూడా ఉంటుంది. ఈమె ఆత్మకూరు ప్రాంతంలో అనేక భజనలు, సప్తాహాలు, యాగాలూ, వ్రతాలు నిర్వహించిన విదూషీమణి.

### యం. లక్ష్మీనరసమ్మ

తిమ్మాజిపేట మండలం గొరిట గ్రామానికి చెందిన ఎత్తం లక్ష్మీనరసమ్మ "నారదగిరి భజనమాల" పేరుతో సంకీర్తన సంపుటిని వెలువరించింది. వట్టెంలోని నారదగిరి క్షేత్రంపై రాసిన కీర్తనలివి.

### నారదగిరి సీతమాంబ

బిజినేపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన నారదగిరి సీతమాంబ అనేక కీర్తనలను రచించింది. నారదగిరి సంకీర్తనల్లో ఈమె రాసిన కీర్తనలు చాలా ప్రసిద్ధిగాంచాయి.

### కొండపల్లి ఆండాళమ్మ

పాలమూరు పట్టణానికి చెందిన కొండపల్లి ఆండాళమ్మ "శ్రీ శ్రీయఃపతి గానామృతములు" అనే గ్రంథాన్ని రచించింది. ఇందులో కీర్తనలతో పాటు మంగళహారతులు, లాలిపాటలతో పాటు అండాళ్, ఆళ్వారులపై రాసిన కీర్తనలున్నాయి.

**తెలంగాణా మాండలికంలో కథలు రాసిన రచయిత్రి, స్వాతంత్ర్యానంతరం కథలు రాసిన తెలంగాణ తొలితరం రచయిత్రి, తెలంగాణ భాషకు, యాసకు పట్టం కట్టిన తొలి రచయిత్రి యశోదారెడ్డి. తెలంగాణ భాషకు ప్రతీకలా నిలిచి రచనలు చేసింది. ప్రాచీన కావ్యాల్లోనే ఎక్కువగా తెలంగాణా పదాలు ఉన్నాయని పేర్కొంటూ వాటిని తన రచనల్లో చూపింది యశోదారెడ్డి.**



### వెల్దండ యాదగిరమ్మ

పాలమూరు పట్టణానికి చెందిన ప్రముఖ కవయిత్రి వెల్దండ యాదగిరమ్మ "రామశతకం, నారసింహ శతకం, యాదగిరి శతకం"లను రచించింది.

"రాముడె తల్లియు దండ్రియు
రాముడె బాంధవుండు రాముడె గురుడౌ
రాముడె దాతయు బ్రతయు
రాముడే నాత్మదేవ రాజగు రామా"

అంటూ రాముడి గుణగణాలను, విశేషణాలను తెల్పింది.

### ఆచార్య పాకాల యశోదారెడ్డి

ఆచార్య పి. యశోదారెడ్డి బిజినేపల్లిలో ఆగస్ట్ 8, 1929లో జన్మించింది. స్వయంకృషితో చదివి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యస్థాయికి ఎదిగిన విదుషీమణి. పి.జి.లో తెలుగు, సంస్కృతం చదివి 1976లో ఆగ్రా విశ్వవిద్యాలయం నుంచి డి.లిట్ ఆనర్స్ పొందింది. జర్మనీ భాషలో డిప్లొమా పొందింది. యశోదారెడ్డి 1955 నుండి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యురాలిగా, అకడమిక్ కౌన్సిల్ సభ్యురాలిగా పనిచేసింది. సాహిత్య నాటక అకాడమి, లలిత కళా సమితి, సాహిత్య అకాడమిలో సభ్యురాలిగా పనిచేసింది. 1990లో అధికార భాషా సంఘం అధ్యక్షురాలిగా 1993 వరకు పనిచేసి తన ప్రతిభను చాటుకుంది. యశోదారెడ్డికి తెలుగులోనే కాక హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఆంగ్ల భాషలలో తగినపట్టు ఉంది. యశోదారెడ్డి "తెలుగులో హరివంశములు" అనే బృహత్ పరిశోధనా గ్రంథాన్ని వెలువరించింది. తెలుగులో వచ్చిన హరివంశాలన్నింటి మీద సమగ్రమైన పరిశోధన చేసిన ఏకైక పరిశోధకురాలు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వచ్చిన అతి పెద్ద పిహెచ్.డి గ్రంథం కావడం విశేషం. హరివంశం, మహాభారతానికి గల సంబంధం, హరివంశ విష్ణుపురాణ భాగవతాలు, ఎర్రాప్రెగడ, నాచన సోముడు, నేమాని భైరవకవి, తాళ్ళపాక పెదతిరుమలయ్య, మల్లాది సూర్యనారాయణశాస్త్రి కవితాశైలి, కావ్య విశేషాలు, కవుల అనువాద పద్ధతి, హరిహరభేదం వంటి వాటిపై అధ్యాయాలుగా పరిశోధన చేసి తెలుగులోని హరివంశాలన్నింటిని తన పరిశోధన గ్రంథంలో నిక్షిప్తం చేసింది.

తెలంగాణా మాండలికంలో కథలు రాసిన రచయిత్రి, స్వాతంత్ర్యానంతరం కథలు రాసిన తెలంగాణ తొలితరం రచయిత్రి, తెలంగాణ భాషకు, యాసకు పట్టం కట్టిన తొలి రచయిత్రి యశోదారెడ్డి. తెలంగాణ భాషకు ప్రతీకలా నిలిచి రచనలు చేసింది. ప్రాచీన కావ్యాల్లోనే ఎక్కువగా తెలంగాణా పదాలు ఉన్నాయని పేర్కొంటూ వాటిని తన రచనల్లో చూపింది యశోదారెడ్డి. తెలంగాణా పదాలను కథల్లో నిక్షిప్తం చేయాలని, పల్లీయుల భాషకు వన్నె తేవాలనే పట్టుదలతో తెలంగాణా మాండలిక భాషలో కథలు రాసింది. అప్పట్లో ఆకాశవాణిలో ప్రసారమైన 'మావూరి ముచ్చట్లు' యావత్ తెలుగు ప్రజలందరినీ రేడియోకు అతుక్కునేలా చేసింది. ఇది యశోదారెడ్డికి రాష్ట్రమంతటా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. వాటినే 'మా ఊరి ముచ్చట్లు'గా పుస్తకరూపంలో తెచ్చింది. ఈ కథా సంపుటిలో యశోదారెడ్డి తను పుట్టి పెరిగిన గ్రామీణ జీవన విధానాన్ని మాండలికంలో చెప్పిన కథలున్నాయి. గ్రామీణ జన వ్యవహారంలో

వ్యాసం

ఉన్న పలుకుబడులను తన రచనల ద్వారా వెలుగులోకి తెచ్చింది. అలాగే 'ఎచ్చమ్మ కథలు, ధర్మశాల' అనే కథా సంపుటాలను ప్రచురించింది. 'ఎచ్చమ్మ కథలు' తెలంగాణా కథల సంపుటి. తెలంగాణా మాండలిక భాషను తన రచనల్లో ఎక్కువగా ఉపయోగించి దానికి సార్థకత చేకూర్చింది యశోదారెడ్డి అనడం అతిశయోక్తి కాదు. నేషనల్ బుక్ ట్రస్ట్ వారు "పి. యశోదారెడ్డి ఉత్తమ కథలు" పేరుతో 24 కథలను సేకరించి ముద్రించింది. అలాగే పలు నాటకాలను రచించింది. 'నందుని ధర్మదీక్ష, జీవనయాత్ర, ప్రవాసనం' వంటి నాటకాలను రచించి ప్రదర్శింపజేసింది.

అలాగే 4, 5వ తరగతి విద్యార్థులకు తెలుగు వాచకాలను 1985లో రూపొందించింది. అలాగే ఆచార్య పాకాల యశోదారెడ్డి పలు హిందీ, ఆంగ్ల గ్రంథాలకు తెలుగనువాదం చేసింది. 'హిందీ కవయిత్రులు, చిత్రకళ ప్రతీకవాదం, నాకు తెలిసిన పి.టి.రెడ్డి, వివేకానందుని అనువాద వేదాంతం' వంటి పుస్తకాలను తెలుగులోకి అనువాదం చేసింది. అలాగే ఆచార్య పాకాల యశోదారెడ్డి పలు విమర్శన గ్రంథాలను రచించింది. భారతంలో స్త్రీ, ఎఱ్ఱాప్రెగడ, పారిజాతపహరణ పర్యాలోచనం, భాగవత కావ్యకుసుమాలు విమర్శనా, పర్యాలోచనం వంటి గ్రంథాలను రచించింది. పురాణాల్లో, ఇతిహాసాల్లో, కావ్యాలలో పేర్కొనబడ్డ స్త్రీ గురించి 'భారతంలో స్త్రీ' అనే పరిశోధన గ్రంథాన్ని యశోదారెడ్డి రచించింది. అలాగే నంది తిమ్మన్న రచించిన పారిజాతాపహరణం కావ్యం గూర్చి 'పారిజాతాపహరణ పర్యాలోచనం' అనే చక్కని విమర్శ గ్రంథాన్ని రచించింది. ఈ గ్రంథంలో పారిజాతాపహరణ వృత్తాంతం, రచనా కాలం, పాత్రపోషణ విధానం, రసపోషణ, అలంకారాలు, వర్ణనలు, ప్రబంధ విశేషాలు, సాంఘిక జీవితం వంటి సమకాలీన వృత్తాంతాలను చక్కగా తనదైన కోణంలో పరిశోధనాత్మకంగా రచించింది. "ఎఱ్ఱాప్రెగడ" గ్రంథంలో ఎఱ్ఱాప్రెగడ కాలం, కావ్య రచనా విధానం, రసపోషణ వంటివి వివరించబడ్డాయి. అలాగే ఆంధ్ర కవయిత్రులు మొల్ల, రంగాజమ్మ, ముద్దుపళని వంటి వారి సాహిత్య విశేషాలను తెలుపుతూ గ్రంథాలను రచించింది.

సాహిత్య విమర్శలో యశోదారెడ్డిది అసాధారణ పాండిత్యం, విషయవిశ్లేషణతో నిశితదృష్టిలో విమర్శనాత్మక సాహిత్యాన్ని వెలువరించడం ఆమె ప్రతిభకు నిదర్శనం. యశోదారెడ్డి బాలల కోసం బాలసాహిత్య రచనలు కూడా చేసింది. నక్కబావ, బడి పెద్ద, బూచిగాడు వంటి కథలు రాసింది. ఇవన్నీ 1960లో ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి. 'భావిక, ఉగాదికి ఉయ్యాల' అనే వచన కవితా సంపుటాలను కూడా వెలువరించింది. కథకురాలిగానే గాకుండా కవయిత్రిగా కూడా మంచి కవిత్వం రాసిన కవితాపిపాసి. ఈమె పదాల్లో ఎక్కువగా తెలంగాణ మాండలిక పదాలు కనిపిస్తాయి. భావసంపదకు పరిపుష్టం చేకూర్చుతాయి. బహుగ్రంథకర్త అయిన యశోదారెడ్డి 'ఆంధ్ర సాహిత్య వికాసం' పేరుతో తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథాన్ని రచించింది. ఈ గ్రంథంలో తెలుగుదేశం, ప్రాంజ్ఞన్నయ యుగం, సాహిత్యయుగ విభజనం, పురాణ యుగం, కవిత్రయం, లక్షణశాస్త్ర గ్రంథాలు, రామాయణ కర్తలు, శతక వాఙ్మయం, ఉదాహరణ వాఙ్మయం, గద్య వాఙ్మయం, శివకవుల యుగం వంటి శీర్షికలతో తెలుగు సాహిత్యాన్ని తనదైన పరిశోధనా పటిమతో రచించింది.

> **సాహిత్య** విమర్శలో యశోదారెడ్డిది అసాధారణ పాండిత్యం, విషయవిశ్లేషణతో నిశితదృష్టిలో విమర్శనాత్మక సాహిత్యాన్ని వెలువరించడం ఆమె ప్రతిభకు నిదర్శనం. యశోదారెడ్డి బాలల కోసం బాలసాహిత్య రచనలు కూడా చేసింది. నక్కబావ, బడి పెద్ద, బూచిగాడు వంటి కథలు రాసింది. ఇవన్నీ 1960లో ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి.

కథా నేపథ్యం గురించి 'కథా చరిత్ర' అనే గ్రంథాన్ని రచించింది. ఇందులో కథ పుట్టుక, పాశ్చాత్య దేశాల్లో కథ, కథా లక్షణాలు, కథానికా భేదాలు, తెలుగు కథానిక రీతులు గురించి చక్కగా విశ్లేషించింది. అలాగే ఆచార్య పి. యశోదారెడ్డి ఇతరులతో కలిసి పలు గ్రంథాలకు సంపాదకురాలిగా కూడా వ్యవహరించారు. తెలుగు సామెతలు, ఆంధ్రక్రియాస్వరూప మణిదీపిక, మాండలిక పదకోశం' వంటి గ్రంథాలకు సహసంపాదకురాలిగా కూడా వ్యవహరించారు..

ఇవేకాక పలు సాహిత్య గ్రంథాలకు, సంచికలకు సంపాదకురాలిగా కొనసాగింది. 'మా తెలుగు పలుకు' గ్రంథానికి గౌరవ సంపాదకురాలిగా వ్యవహరించింది. ఇంకా 'పోతన కవితాసుధ, పోతన పద్యకుసుమావళి, కృషీవలుడు' వంటి గ్రంథాలకు చక్కని విపులమైన వ్యాఖ్యానాన్ని రచించింది. మహాభాగవతాన్ని పారవశ్యంతో రచించిన పోతనామాత్యుని కవిత్వం గూర్చి యశోదారెడ్డి చక్కని సరళ వ్యాఖ్యానంతో 'పోతన కవితాసుధ' అనే వ్యాఖ్యాన గ్రంథాన్ని రచించింది. ఇందులో పోతన కవితాతత్త్వం, కవితా సౌందర్యాన్ని గూర్చి చెప్పిన వ్యాఖ్యానం పండిత పామరుల్ని ఆకట్టుకుంటుంది. అలాగే కవికోకిల దువ్వూరి రామిరెడ్డి రచించిన 'కృషీవలుడు' పద్య కావ్యానికి చక్కని వ్యాఖ్యాన గ్రంథాన్ని రచించింది. కర్షకుణ్ణి కథానాయకుడిగా చెప్పిన పద్య కావ్యం కృషీవలుడు. రైతుజీవిత అనేక కోణాలను హృద్యంగా చిత్రించిన పద్య కావ్యమిది. పోతన పద్యాలను చక్కగా వ్యాఖ్యానించిన గ్రంథం ' పద్యకుసుమావళి'.

**(మిగతా వచ్చే సంచికలో...)**

కథ

# తనలో దాగిన నది

స్నేహబంధము, ఎంత మధురము..



కుప్పిలి పద్మ
98663 16174

అవుట్ ఆఫ్ ఫోకస్ లో వున్న వ్యూ ఫైండర్‌లోని దృశ్యమల్లే యెదురుగుండా గోదావరి అస్పష్ట చిత్రం. "వీరీ... వీరీ... గుమ్మడిపండు... వీరి పేరేమి?" అని కళ్ళు గట్టిగా మూసి ప్రశ్నిస్తున్న చిన్ననాటి స్నేహితురాలికి మల్లే కేవలం ముందున్న మెట్లు, రావిచెట్టు తప్ప మిగిలిన పరిసరాలన్నిటినీ యేమాత్రం కనబడకుండా దాచేసిన పొగమంచు. యింతలో చూస్తుండగానే అంత దట్టమైన పొగమంచూ చిత్రంగా మాయమైపోయి తనలో దాగిన అఖండ గోదావరి దర్శనం. వొత్తైన లేతమబ్బు రంగు. అస్సలు అతుకు కనబడకుండా చాల నైపుణ్యంగా అతికించిన టూ షీట్ వాల్ పోస్టర్ కు మల్లే నీలి గోదావరికి ఆకాశానికి మధ్య వుండాల్సిన క్షితిజ రేఖ యేమాత్రం కనబడటం లేదు...

ఆ వొడ్డున స్నానాలు చేస్తున్నవాళ్ళవో, పూజలు చేస్తున్నవారివో మాటల కోలాహలం. గోదావరీమాత ముందు వెలుగుతున్న దీపం. అగర్బత్తీల హర్షసౌరభం. యింతలో మెల్లగా చిగురిస్తున్నపసి సూర్యుడు. నీటిరాసుల మీద పరుచుకుంటున్న సూర్యకాంతులు.

"వావ్... వ్వాట్ యే బిగ్ రివర్!" వశిష్ఠ.

ఆ పసి కళ్ళల్లోకి చూసాను. నాన్నగారు మొదటిసారిగా యిక్కడే గోదావరిని చూపించినప్పుడు నా కళ్ళు యిలానే మెరిసి వుంటాయా? మనసులో వో మెరుపు మెదిలింది. నయనపు కాంతి భాష నాన్నగారికి మాత్రమే తెలుసు. యిక నేనిప్పుడు తెలుసుకునే అవకాశమూ లేదు. మూడువారాల క్రితం వారు ఢిల్లీలో యీ లోకాన్ని వదిలి వెళ్ళిపోయాక వారికిష్టమైన యీ వొడ్డునే కార్యక్రమాలన్నీ చెయ్యాలని అమ్మ పట్టుబట్టి అందర్నీ యీ వూరుకే రమ్మంది. గౌతమికి స్కూల్ మానే వీలులేదు. ఆఫీస్ పని వత్తిడివల్ల శశాంక్ కు రావడానికి వీలు కుదరలేదు. నాన్నగారు వెళ్ళిపోయారనే విషాదం. వొంటరిగా ప్రయాణం చెయ్యాలని పించలేదు. కొడుకు టెన్నీస్ ప్రాక్టీస్ పోతుంది, పియానో క్లాసులు మిస్ అవుతాడన్నాడు శశాంక. అయినా వశిష్ఠతో బయలుదేరాను. పద్నాలుగేళ్ళ వశిష్ఠ జర్నీలో యిచ్చిన భరోసా చూస్తూ నేనిలాంటి భరోసాని నాన్నగారికి ఆ యేజ్ లో యిచ్చానా? యేమో!

"పడవ యెక్కుదాం" వశిష్ఠ.

పడవలో వెళ్ళుతుంటే లాంచీ కూడా యెక్కుదామన్నాడు. మమ్మల్ని నాన్నగారు భద్రాచలం తీసుకెళ్ళటం... పాపికొండలు కళ్ళల్లో. వెళదామని చెప్పాను.

* * *

వశిష్ఠకి రోజ్ మిల్క్ రుచి చూపించాలని గట్టు దిగి గుండువారి వీధి లోంచి వెళ్తుంటే అన్నీ బంగారం దుకాణాలే. పేరుకే అది వీధి కానీ అది వొక యిరుకు సందు. పైగా ఆ బంగారం దుకాణాల ముందు బోలెడన్ని టూ వీలర్స్. పక్కపక్కన నడవటం కాదుకదా వొక్కొక్కళ్ళు నడవటం కూడా కష్టంగా వుంది. దుకాణాల అద్దాల్లోంచి కనిపిస్తున్న రంగు రంగుల గాజులు, ఆభరణాలు అంతటా బంగారం పరిమళం.

మెయిన్ రోడ్ లో రోజ్ మిల్క్ షాప్ ముందంతా కిక్కిరిసి వుంది. గాలంతా గులాబీపూల మధురిమ.

రోజ్ మిల్క్ తాగుతూ, చుట్టూ చూస్తూ "మా నాన్నగారికి రోజ్ మిల్క్ అంటే యెంతిష్టమో! యీ వూరు నుంచి చదువుకోడానికి వెళ్ళిపోయి ఢిల్లీలో స్థిరపడిపోయినా యిక్కడికి వచ్చినప్పుడు పిల్లందరినీ తప్పకుండా తీసుకొచ్చేవారు".

"నువ్వు నన్ను తీసుకొచ్చినట్టు... రైట్..." రీల్స్ చేస్తూ వశిష్ఠ.

"వూ... అని ఆగి అమ్మమ్మ గారు, బామ్మగారు ఆ సందులోనే బంగారాన్ని సూర్యరావు గారి కొట్లో కొనేవారు. యీ వూరు నుంచి వెళ్ళిపోయాక కూడా అమ్మ యిక్కడే బంగారం కొనేది"

"నాక్కొంటావా"

"వూ... యేం కావాలి"

"నీ ఛాయిస్."

"వో యస్"

అలా ముందుకొచ్చాం.

కోటగుమ్మం సెంటర్లో ఫౌంటెన్ శివుడిని రీల్స్ చేస్తున్నాడు వశిష్ఠ. అలా నడుస్తూనే వున్నాము. యెండ మామూలుగా లేదా చురుక్కు.

"గౌతమీ గ్రంథాలయం" ఆటో అతనితో.

ఆ కుర్రవాడు యెప్పుడూ వినని పేరు విన్నట్టు "యెక్కడా"?

గౌతమీ గ్రంథాలయమే వో ల్యాండ్ మార్క్ కదా... అలాంటిది ఆ గౌతమీకే ఆనవాలు చెప్పాల్సి వస్తే యేం చెప్పాలి?

"వూరికి కొత్తగా వచ్చావా బాబూ? " అని అడిగాను.

"లేదమ్మా. యిక్కడే పుట్టి పెరిగాను"

"మరి గౌతమి గ్రంథాలయం తెలియదంటున్నావు. సరే నే దారి చూపిస్తానులే. పద."

చాలా కాన్ఫిడెంట్గా ఆటో యెక్కేసా వశిష్టతో. కొంత దూరం వెళ్ళాక అర్థమైందేమిటంటే యీ వూరు మారింది. నా మస్తిష్కంలో వున్న రూట్ నుంచి యెలాగో గౌతమీ దగ్గర ఆటోని ఆపాను.

"యిక్కడా... పందలపాక అప్పారావు బిర్యానీ సెంటర్ అని చెపితే తెచ్చేద్దును".

అప్పట్లో లేదీ బిర్యానీ పాయింట్. చాల రద్దీగా వుంది. పాపులర్ ప్లేస్ అన్నమాట.

గౌతమీ ఆవరణలో అదే పొగడ చెట్టు. పొగడ చెట్టు చుట్టూ కొంచెం పెచ్చు లూడిన చెప్టా. కొన్ని రాలిన యెండు టాకులు. అప్పట్లో మొదటిసారి నాన్నగారు యీ లైబ్రరీని చూపించారు. వచ్చినప్పు డంతా పొగడ పువ్వులని పోగేసుకునేదాన్ని. ఆ ఆవరణంతా పువ్వులు. చిలుకలు. ఆకులు. కాంపిటేటివ్ యెగ్జామ్స్ కి ప్రిపేర్ అవుతున్న స్టూడెంట్స్ చదువుకుంటూ అక్కడక్కడా. లోపల సరస్వతి మాత. ప్రశాంతంగా కళకళ్లాడుతూ. లోపలికి వెళుతూ 'శ్రీపాద వారిని అడుగు' అని నాన్నగారు అన్న మాటలు గుర్తొచ్చాయి. బాబాయమ్మ హాల్కి మరో వైపు కొత్తగా కట్టిన ప్రాంగణము. పెద్దపెద్ద కిటికీల్లోంచి కనిపిస్తున్న కొబ్బరి చెట్లు. వాటి వెనక నిలువెత్తు అపార్ట్మెంట్స్లో కొబ్బరి చెట్ల నీడలు. శీతాకాలం రశ్మి హాల్లోకి లేత లేతగా పరుచుకుంటూ. యెంతో స్ఫూర్తినిచ్చే గౌతమీ ల్యాండ్ మార్క్ కాకుండా పోవడం దేనికి సూచన? ఆలోచిస్తూ దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ వైపు అడుగులేసాము.. ఆ ఆర్ట్ గ్యాలరీ వున్నచోట అసలు మెయింటెనెన్స్ లేదు. యీ గొప్ప గొప్ప వాళ్ళని, వాళ్ళ గుర్తుల్ని మనం గౌరవంగా, జీవంతో యెందుకు కాపాడుకోలేము? యెందుకనో? యెదురుగా సుబ్రహ్మణ్యం మైదానం. మైదానంలో యిసక, సిమెంట్తో పని జరుగుతుంది. అక్కడే విక్రమహాల్ ... నాన్నగారికి అప్సర హోటల్లో కాఫీ భలే యిష్టం. యిప్పుడక్కడ అప్సర హోటల్ లేదు. ఆ ప్రాంగణంలో బోలెడన్నిలారీలు. చుట్టూ చెత్త. యిక్కడ యేం రాబోతుందో?

యిక్కడే పుట్టి యెనిమిదో తరగతి వరకు చదువుకున్న నాన్నగారికి ప్రపంచమంతా తిరిగినా యీ వూరంటే బాల్యం. బాల్యమంటే యీ వూరే. యీ వూరి ముఖద్వారం నుంచి ప్రపంచంలోకి అడుగుపెట్టిన నాన్నగారు తన తల్లితండ్రులున్నంత కాలం సెలవులకు, అలానే అన్నయ్య, నేనూ చదువులకి అమెరికా వెళ్ళిపోయినా యిండియా వచ్చినప్పుడు నాన్నగారు యిక్కడికి తీసుకొచ్చేవారు. ఆస్తిలో వాటాగా వచ్చిన యింటిని నాన్నగారు అమ్మలేదు. రాజోల్లో వుండే నాన్నగారి పెద్ద చెల్లెలు బాధ్యత తీసుకుని ఆ యింటిని చూసుకోడానికి వో చిన్నిపోర్షన్ కట్టి సుబ్బు కుటుంబాన్ని జీతానికి పెట్టుకున్నారు. పుష్కరాలకి... కార్తీకమాసంలో, శివరాత్రికి బంధువులు, స్నేహితులు యీ యింట్లోనే వుండేవారు.

నాన్నగారితో వీధుల్లో తిరుగుతు న్నప్పుడు... ఆలయాలకి, దుకాణాలకి, హోటల్స్ కి వెళ్ళినప్పుడు యెందరో తెలిసినవాళ్ళు పలకరిస్తుండేవారు. యిప్పుడు తెలిసిన ముఖము వొక్కటి కూడా కనిపించట్లేదు. నాన్నగారు వెళ్ళిపోయాక యీ వూరిలో బయటకి వొస్తే తెలిసిన వాళ్ళెవరూ కనిపించక వెలితిగా వుంది.

★ ★ ★

సాయంరశ్మిలో నెమ్మదిగా నది. వొడ్డున పడవలు. రావి చెట్టు. వేదంలా ఘోషించే గోదావరి' 'పుప్పొంగెనే గోదావరి' పాటలు. గోదావరి హారతి ప్రాశస్త్యం. మెట్ల నిండా అన్నివయసుల జనం. ప్రతి వాళ్ళ చేతుల్లో స్మార్ట్ ఫోన్. గోదావరిని పడవల్ని ఫోటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు. గోదావరి హారతి. గంటానాదం అలలు అలలుగా. వొక హారతి తర్వాత మరొక హారతి. చీకటిని వెలిగిస్తూ కర్పూరసౌరభం. పాత బ్రిడ్జి మీద వొకదాని తర్వాత మరొకటిగా మారుతూ గులాబీ... పసుపు... ఆకుపచ్చ... వైలెట్ రంగుల కలనేత ప్రదర్శిస్తున్న యెల్ యీ డీ లైటింగ్.

"వో... గ్రేట్" పట్టరాని సంబరం వశిష్ఠ ముఖంలో.

హారతయ్యాక చాలమంది పూజారుల దగ్గరికి వెళ్ళారు. గోదావరి జలంని పూజారులు జల్లుతూ... ప్రసాదంని అందిస్తుంటే... బొట్టు పెట్టుకొంటున్నారు. రద్దీ తగ్గాక ఆగి పూజారి గారిని పలకరించాను. యెంతమంది హారతిస్తారు? రోజూ హారతి యిస్తారా? యిలాంటి ప్రశ్నలు అడుగుతుంటే "యెక్కడి నుంచి వచ్చారు?" అని అడిగారు పూజారిగారు.

యిక్కడికి యెక్కడి నుంచో రావటం యేమిటి? యీ నది, యీ నేల మాకేం కావా? యిక్కడి నుంచి యెక్కడికి వెళ్ళాము? యెక్కడినుంచి యిక్కడికి వచ్చాము? యీ నది మీద... వూరి మీద, యిక్కడి యింటి మీద... బెంగ పడుతూనే వుండేవారు నాన్నగారు. ఆ బెంగ ఫ్లూ లా అంటుకుంది నాకు.

★ ★ ★

"యెక్కడికి వెళ్లావు?" అన్నయ్య.

"చెప్పాను కదా! వూరు చూసి వస్తానని"

"కార్ తీసుకెళ్లాల్సింది కదా. చూడు యెలా అయిపోయాడో" వశిష్ఠకి అలోవెరా

కథ

జెల్ పూస్తూ.

"ప్రొటెక్టెడ్‌గా వెళితే చాలా విషయాలు తెలియవు. బయలుదేరినప్పుడు యెక్స్‌ప్లోర్ చేయడానికి వెళుతున్నాననుకోలేదు. వెళ్ళే కొద్ది అలా అయిపోయింది."

నాన్నగారు రాసిన విల్లుని అమ్మ తెరచి చదివింది. నాన్నగారు యెవరికి యేం యివ్వాలో అన్ని వివరంగా రాశారు. ఆ విల్లులో మమ్మల్నందరిని విపరీతంగా ఆశ్చర్యపర్చిన విషయం మీద వొకరిని వెళ్ళి కలవమని అమ్మ అడిగింది. ఆ రోజే అన్నయ్య అమెరికా వెళ్ళిపోతూండటంతో ఆ బాధ్యతను నాకిచ్చారు.

★ ★ ★

మర్నాడు గోదావరి గట్టుకి బయలుదేరుతుంటే అమ్మ "యీ విషయానికి వశిష్ఠ యెందుకూ చిన్నవాడు కదా" అంది.

అవును యెందుకు! వశిష్ఠని ప్రతీ చోటుకీ తీసుకువెళుతున్నాను! బాల్యంలో నాన్నగారి చేయి పట్టుకుని యీ వూళ్లో తిరుగుతూ నే చూసిన ప్రతీదీ వశిష్ఠకు చూపించాలని, అనుభూతి చెందిన ప్రతీదీ వశిష్ఠకు పరిచయం చెయ్యాలని లోలోపల యెక్కడో నాకు తెలియకుండానే నాలో అంతర్లీనంగా కోరిక వుందా! వశిష్ఠ తో యిక్కడికి బయలుదేరి వచ్చినప్పుడు యిలాంటి ఆలోచన యేం వున్నట్టు లేదే... యేమో... నాకే తెలియని నా అంతరంగం.

వశిష్ఠని తీసుకెళ్ళాను.

"భానుమూర్తి గారి యిల్లు తెలుసా మీకు" గట్టు మీద గోలీ సోడా బండతన్ని అడిగాను.

"మీరు ఆరికేమౌతారు? కూతురా? లేక కోడలా"?

"రెండూ కాను. వారున్నారా?"

"కూతురో, కోడలో అయితే కాతంత బుద్ది సెబుదారని... ముసిలాయన్ని అస్సలు పట్టించుకోకుండా గోదారికి వొగ్గేసి యిదేసాలికి యెల్లిపోయారు. తనకోసం వొక్క పైసా కూడా అట్టి పెట్టుకోకుండా వున్నదంతా ఆ పిల్లలకే యెట్టినా, యే వొక్కళ్ళూ పట్టించుకున్న పాపానపోలేదు. ఆరు తిన్నారో... వున్నారో... పట్టించుకోలేదు. యిన్నేళ్ళలో వొక్క సారైనా తొంగిసూడలేదు. వొక్క రూపాయైనా యేనాడూ అంపిందీ లేదు. యీ వయస్సులో కూడా ఆరి పొట్టకు ఆరే సంపాదించుకోవాలి. ఆరు యింతకు ముందులా తెలుగులో ప్రయివేట్లు సెప్పుదామన్నా సెప్పించుకునేవాళ్ళు యెవరూ లేరు. కొన్నాళ్ళ క్రితం ఆళ్ళ ఆవిడ గారు పోయారు. యిన్నేళ్ళలో యిప్పుడే ఆరి కోసం వచ్చినవోల్లను సూడటం... వున్నదంతా వూడ్చి పిల్లలకి పెట్టడమంత బుద్ది తక్కువ మరొకటి లేదమ్మగోరు. మరీ యింత దారునమా? యీనగారి బతుకు చూసాక మాకేటి అర్థం అయిందంటేనమ్మా పిల్లల కోసం మన కాడ వున్నదంతా కర్చుపెట్టీ కూడదమ్మా. కాలాన్ని బట్టీ మనమూ మారాలి, మన జాగర్తలో మనం వుండాలి. నా పెళ్ళానికి యిది అర్థమైసావదు. కళ్ళ యెదుట అమ్మానాన్నలని పట్టించుకోని వాళ్ళని సూస్తూ కూడా కొడుక్కి అడిగిన మొబైల్ కొనలేదని అలిగి పుట్టింటికి యెల్లి పోయిందమ్మా కొడుకు కూడా. యిప్పుడెల్లి తీసుకురావాలి" అంటూ హడావిడిగా వొడ్డుకు వెళ్ళుతూ భానుమూర్తి గారి యింటి వైపు చెయ్యి చూపిస్తూ పడవ యెక్కేసాడు. అదన్నమాట విషయం! తన యింటి తగాదాతో పేరెంట్స్‌ని పిల్లలు పట్టించుకోరనే నిర్ధారణకు వచ్చేసారా గోలీ సోడా వారు.

చిన్న యిల్లు. యెదురుగా నిండు గోదావరి. యింటి ముందు చిన్న అరుగు. నాచు పట్టిన యింటి గుమ్మాలు. గోడలు.

ఫలానా వారి అమ్మాయినని చెప్పగానే వారు వొక్కసారిగా వుద్వేగానికి గురయ్యారు.

"మిమ్మల్ని వెతికి పట్టుకోవటం కష్టమయింది. ఆశ్చర్యంగా యింట్లో మీరెవ్వరికీ తెలియరు. నాన్నగారు వెళ్ళిపోయిన విషయం తెలియ చెయ్యలేకపోయాం" అన్నాను.

మౌనం.

"అవునామ్మా... అందుకేనా నాకు మూడు వారాలుగా ఫోన్ లేదు. బిజీగా వున్నాడనుకున్నాను. తను చెయ్యటమే. నేను చేసేది తక్కువే డిస్ట్రబెన్స్ అని. మేమిద్దరం స్కూల్లో క్లాస్మేట్స్. యెనిమిదో, తొమ్మిదేళ్ళు వుంటాయమ్మ. యీ వొడ్డునే బాగా యీత కొట్టేవాళ్ళం. లంకల్లోకి పడవల్లో వెళ్ళేవాళ్ళం. గోదావరి అంటే పిచ్చి యిష్టం. వో వెన్నెల రాత్రంతా గోదావరిని చూస్తూ కూర్చున్నాం. మీ తాతగారికి నేనే వాడిని చెడగొతున్నానని భలే కోపం వచ్చింది. మా స్నేహాన్ని కట్టడి చేసారు. అయినా వచ్చేసేవాడు గోదావరిలో పడవలో తిరగాలనో, యీత కొట్టాలనో మా యింట్లో కట్టడి లేదమ్మా. యిక లాభం లేదని మీ తాతగారు తనని వూటీలో స్కూల్లో జాయిన్ చేసారు, మెల్లగా కమ్యూనికేషన్ తెగిపోయింది. ఆ తర్వాత వుద్యోగంలో చేరాక నన్ను చూడటానికి వచ్చాడు. గోదావరి వొడ్డున తిరిగేవారం. అంత పెద్ద జాబ్ లో వున్నా ఆ చిన్నప్పటి స్నేహాన్ని యిష్టపడేవాడు. మాటాడుకునేవాళ్ళం. పోయినసారి కలిసినప్పుడు పిల్లలు అమెరికాలోనే స్థిర పడ్డారని చెప్పినప్పుడు తన పిల్లలూ అక్కడే సెటిల్ అయిపోయారన్నాడు. తనతో ఢిల్లీ వచ్చెయ్యమన్నాడు. లేదా యీ అద్దె యింట్లో యేమి అవస్థ పడతావు. మనింట్లో వుండు. తనకి తృప్తినిస్తుందన్నాడు. మొక్కలంటే యిష్టం కదా తోటమాలిని గైడ్ చెయ్యి. యీ ట్యూషన్స్ యేవో అక్కడే చెప్పు... అని శతవిధాలా చెప్పాడు. గవర్నమెంట్ టీచర్ గా అప్పట్లో కుదురుకోలేకపోయినందుకు దిగులు పడ్డాడు. మనసు విప్పి మాటాడుకునే వొకే వొక్క స్నేహితుడు. అయ్యో! వెళ్ళిపోయాడా?" కళ్ళలో చెమ్మ.

వారి మాటల్ని వింటూనే నా కళ్ళు మసకబారిపోయిన ఆ యింటి గోడలపై ఫ్రేం కట్టించిన వో ఫోటో పై నిలిచాయి. యిద్దరు సన్నని పొడవైన పిల్లలు. పరిశీలనగా చూస్తే నాన్నగారు... భానుమూర్తి గారు... వొకరి భుజాలపై వొకరు చేతులువేసుకుని. ఫోటో మొత్తం కమురు కట్టేసింది కానీ వీరి స్నేహం యెంత సజీవంగా వుందో కదా!

కథ

వంట చేసి, యింటిని శుభ్రం చేసే ఆమె రాగానే "యీమె మంగ" .

"పిల్లలు కాలిఫోర్నియాలో. వీలుకాదంటారు. రాకపోకలు తగ్గిపోయాయి. పిల్లలు వృద్ధిలోకి రావాలని అప్పటి అవకాశాల వైపు నడిపించాం. సంతోషించాం. వాళ్ళ జీవితాల్లో వాళ్ళు కుదురుకుని, పిల్లల బాధ్యతలని చూసుకుంటున్నారు శ్రద్ధగా. వొక్క వూరిలోనే వున్నా వొకరి యింటికి మరొకరి యిల్లు దూరం అనిపిస్తున్న యీ కాలంలో అంత దూరం నుంచి వాళ్ళు అస్తమానూ రాలేరు కదమ్మా! మనవలకీ, మనవరాళ్ళకీ ఆసక్తి వుండదు. యిక్కడ పుట్టి పెరగలేదు కదా! వారానికోసారి పిల్లలు కాల్ చేస్తారు".

"రాకపోవచ్చు అయ్యగారూ కానీ అమెరికాలో ఆళ్ళు బోల్డు సంపాయిత్తారు కదా! యీ వయస్సులో కూడా మీరు కట్టపట్టం యేంటి? ఆళ్ళను యెనకేసుకుని వత్తారు కానీ..." గబగబా అనేస్తున్న మంగని వారిస్తూ...

"నువ్విలా యే పిల్లల్ని అంటున్నా నీకు చెపుతూనే వున్నాంగా. పిల్లలు మన ఆస్తులు కారు. మన వృద్ధాప్యానికి చేతికొచ్చే బ్యాంకు డిపాజిట్లూ కాదు. అవసరమైనప్పుడు యెన్ క్యాష్ చేసుకునే మ్యూచ్యువల్ ఫండ్ బాండ్స్ కారు. పిల్లల్ని ప్రేమగా, బాధ్యతగా పెంచటం మన ఆనందం కోసం. వాళ్ళ నుంచి మనకి ప్రేమ, గౌరవం రావటం మన జీవితానికి అదనపు బోనస్" చిరునవ్వుతో.

"యిదమ్మా వొరస. కన్న పిల్లలే పట్టించుకోపోతే యీ రోజుల్లో యేరే వొల్లెందుకు పట్టించుకుంటారమ్మా? యీరికి ఆమద్దెన వొంట్లో బాలేనప్పుడు సోడా బండి సుబ్రమణ్యం, మా ఆయన సూసుకున్నారు. నాకేదో కాత్త వోపికున్నప్పుడు యింటి పని చేసి యింత వుడకేసి పోతున్నాను. అవసరాలకి కూడా కాసిన్ని డబ్బులు దాసుకోకుండా అంతా పిల్లలకే యెట్టేసారు. రుణం వుంచుకోకూడదని యెప్పుడన్నా యేడబ్బులన్నా వత్తే, యెంత వొద్దంటున్నా యినకుండా మాకిచ్చేస్తారు. యేమైనా అంటే ప్రేమకి స్నేహానికి తప్పా యింక దేనికీ రుణపడకూడదంటారు" గుక్కతిప్పుకోకుండా మాటాడుతూనే వుంది మంగ.

వీరికి పిల్లలకి మధ్య గ్యాప్ వున్నట్టే వుంది. యెందుకనో... కుటుంబాల్లో యేవేవో పొగుపడి పైకి కనిపించని రీజన్స్ యెన్నో వుంటాయి. వారంవారం కాల్ చేస్తున్నారు కదా... పట్టించుకోవటముంది. కానీ వీరి ఆర్థికస్థితి వాళ్ళకి తెలీదేమో. వెళ్ళాక వాళ్ళతో మాట్లాడాలి. వాళ్ళు వీరిని

**"నువ్విలా యే పిల్లల్ని అంటున్నా నీకు చెపుతూనే వున్నా మంగా. పిల్లలు మన ఆస్తులు కారు. మన వృద్ధాప్యానికి చేతికొచ్చే బ్యాంకు డిపాజిట్లూ కాదు. అవసరమైనప్పుడు యెన్ క్యాష్ చేసుకునే మ్యూచ్యువల్ ఫండ్ బాండ్స్ కారు. పిల్లల్ని ప్రేమగా, బాధ్యతగా పెంచటం మన ఆనందం కోసం. వాళ్ళ నుంచి మనకి ప్రేమ, గౌరవం రావటం మన జీవితానికి అదనపు బోనస్" చిరునవ్వుతో.**



విజిట్ చెయ్యటమో... వీరిని అక్కడికి కొన్నాళ్ళు తీసుకెళ్లటమో... మాట్లాడితే అతుక్కోని పగుళ్ళు యేముంటాయి.

వీరి పరిస్థితి యిది. అమ్మకి ఆర్థిక యిబ్బంది లేదు. కానీ తనిప్పుడు వొక్కతే వుండాలి. తామిక్కడి రాలేము. డబ్బు కొన్ని భరోసాల్ని యిస్తుంది. అంతకు మించిన సపోర్ట్ మానసికంగా అవసరమవుతుంది కదా. అమ్మని వీలైనన్నిసార్లు విజిట్ చెయ్యాలి. వొకరు తరువాత వొకరు రావాలని అన్నయతో మాటాడాలి. పలురకాల స్ట్రక్చరల్ అభివృద్ధి సాగినంత వేగంగా కొత్త కుటుంబాలకి తగినట్టుగా కావలసినన్ని సపోర్టివ్ సిస్టమ్స్ అన్ని చోట్లా కావాల్సినన్ని రాలేదు. యిప్పుడు వీరింట్లో మంగ మా ముందే జరిపిన ఆ సంభాషణ యెంత మంది యిళ్ళల్లో జరుగుతుందో? మా ముందే యీ మాటలన్నీ మాట్లాడటం వారికెలానూ యిబ్బందే. నాకింకా యిబ్బందిగా వుంది. అలాగని మళ్ళీ యింకో రోజు వచ్చి విషయం చెప్పే వీలూ లేదూ. వోపెన్ టికెట్ అయినా మరీ యెక్కువ రోజులు వుండే అవకాశం లేదు. పిల్లని వదిలి వచ్చాను. శశాంక యెంత బాధ్యతగా వున్నా వర్క్ లో పడితే అన్నీ మర్చిపోతాడు. వశిష్ఠకు లాంచీలో భద్రాచలం తీసుకువెళ్ళతానని మాటిచ్చాను. యిప్పుడున్న డెవలప్మెంట్ పద్ధతి అంతా కొండల్ని... అడవుల్ని... భూమినీ... తీరాల్ని మింగేయటమే కదా. మళ్ళీ వచ్చేసరికి పాపికొండలు వుంటాయో లేదో యెవరు భరోసా యివ్వగలరు.

అమ్మ వచ్చేవారం వారణాసి వెళ్ళుతుంది. పదకొండు రోజులూ అన్ని కార్యక్రమాలని అమ్మ శ్రద్ధగా చేయించింది. తన పెద్ద ఆడపడుచు గాజులు తీయించే కార్యక్రమం చెప్పినప్పుడు 'గాజులు... బొట్టూ... యేవీ తియ్యను. మీ అన్నయ్య గారున్నట్టే వుంటాను' అంది అమ్మ.

'యెవరేనా యేమైనా అంటారు వదిన గారు...' నసుగుతున్న ఆడపడుచుతో,

'యెవరైనా యేమైనా అంటారని, అనుకుంటారని మనం యీ అర్థం పర్థం లేని ఆచారాలని ఆచరిస్తూ పోతామా?'' అంది అమ్మ.

అసలిక్కడ యీ విషయాలెందుకు గుర్తొస్తున్నాయి...!

"మీతో సెల్ఫీ తీసుకోవచ్చా?'' వశిష్ఠ అడిగాడు.

వారు నవ్వుతూ "నీకు... అందునా మా వాడి ముద్దుల మనవడికి పర్మిషన్ కావాలా!'' అన్నారు.

అలాగే చిన్నపిల్లలుగా భానుమూర్తి గారు, నాన్నగారు కలిసి వున్న ఫోటోను కూడా వశిష్ఠ మొబైల్ తో ఫోటో తీసాడు.

వారికి యేమాత్రం సంపాదన లేదని, వారి ఆర్థిక పరిస్థితి యేమాత్రం బాగోలేదని తెలుస్తూనే వుంది.

నా చేతిలో వున్న విల్లుని వారి ముందుంచాను.

కాసేపు నిశ్శబ్దం.

"తన బ్యాంక్ అకౌంట్ కి నన్ను నామినీగా పెట్టటం యేమిటీ? రేపే బ్యాంక్ కి వస్తానమ్మా. సంతకం పెడతాను. అక్కౌంట్ లో వున్న డబ్బు డ్రా చేసి అమ్మగారికి యివ్వండి''.

"నాన్నగారు మీ పేరుని నామినీగా పెట్టారంటే ఆ డబ్బు మీకోసమనే అర్థం బాబాయిగారూ. మీకే చెందుతుంది''.

"చిన్న అమౌంట్ కాదు కాదమ్మా! మీరెవరూ యిక్కడ లేరు కదా! నేనంటే నమ్మకం కాబట్టి, నేను మీకు అణాపైసలతో సహా అందచేస్తానని నామినీగా పెట్టి వుంటాడు.''

**వీరి పరిస్థితి యిది. అమ్మ కి ఆర్థిక యిబ్బంది లేదు. కానీ తనిప్పుడు వొక్కతే వుండాలి. తామిక్కడి రాలేము. డబ్బు కొన్ని భరోసాల్ని యిస్తుంది. అంతకు మించిన సపోర్ట్ మానసికంగా అవసరమవుతుంది కదా. అమ్మని వీలైనన్నిసార్లు విజిట్ చెయ్యాలి. వొకరు తరువాత వొకరు రావాలని అన్నయతో మాటాడాలి.**

బ్యాంక్‌లో వున్న అమౌంట్ తీసుకోవడానికి ఆయన ససేమిరా వొప్పుకోవడం లేదు.

"వొద్దనకండి బాబాయిగారూ. మేమంతా వుద్యోగాల్లోనే వున్నాం. మా ఆస్తులే కాకుండా నాన్నగారి తదనంతరం మాకు వ్రాసి యిచ్చినవి వున్నాయి. యివన్నీలేకపోయినా కూడా మా నాన్నగారి యీ నిర్ణయాన్ని మేమెంతో సంతోషంగా నెరవేరుస్తాం. నాన్నగారి మాటంటే మాకన్ని విషయాల్లోనూ గౌరవం. మా అమ్మగారు, అన్నయ్య, నేను యింకా మా కుటుంబ సభ్యులం అందరం కలిసి యీ బ్యాంకు అక్కౌంట్ లో వున్న మొత్తం మీదేనని అనుకున్నాం. మీకు అందించాలని నిర్ణయం తీసుకున్నాం. నాన్నగారితో మాకున్న అనుబంధంతో ఖచ్చితంగా చెప్పగలను... యిది నాన్నగారి కోరిక... నిర్ణయం. యిది మీ ప్రాణ స్నేహితుడు మీకిస్తున్న కానుక. యీ డబ్బు ని తీసుకోవడానికి అంగీకరిస్తేనే మా అందరికి నాన్నగారి కోరికని తీర్చిన తృప్తి వుంటుంది. యిండియాకి నాన్నగారిని చూడ్డానికి వచ్చినట్టే యికపై యీ వూరికి మిమ్మల్ని చూడటానికి వస్తాను. నాకిక్కడ నాన్నగారి స్నేహితుడున్నారు. వూహూ మా బాబాయిగారున్నారు.'' అన్నాను.

దీనంతటిని వొక కథలాగా చూస్తూ వింటున్నాడు వశిష్ఠ.

యీ రోజుల్లో కూడా యిలాంటి మంచి మడుసులుంటారాన్న ఆశ్చర్యపు ముఖంతో మంగ "వద్దనకండయ్యా... మీ స్నేయితుడి ఆత్మ యేలోకంలో వున్నా సాంతిత్తదండి.''

వారు నా తల మీద చెయ్యి వుంచి ఆశీర్వదించారు.

బయటకొచ్చి గట్టు మీద విశాల గోదావరిని చూస్తున్నాను. నిర్మలంగా కుదురుగా.

వశిష్ఠ నా చేతిని చేతుల్లోకి తీసుకుంటూ "నేనెంత యిండిపెండెంట్ అయినా మీకు దగ్గరగానే వుంటానమ్మా''.

వుప్పొంగిన హృదయ గోదావరి.

కవిత

# పొద్దుతిరుగుడు పువ్వు



**అరుణ నారదభట్ల, 97050 15207**

ఆ ట్రైడీ రన్వేలో ఉంది
ఇది టేకాఫ్ కాలం

కాలం ఒకానొక పొద్దుతిరుగుడు పువ్వే
రోజూ ఒకవైపే ముఖం చేసుకుని ఉండలేదది
వెలుగు కావాలి దానికి
చైతన్యం నరనరానా వ్యాపించి
మెరుపులు చిందేందుకు!

ఋతువులు నిండిన కాలాలు
ఎప్పుడూ ఒకేలా ఉండవు ఇదీ అలాగే!
భూగోళానికి
అన్నివైపులా రాత్రీ పగళ్ళున్నట్టు
ఓసారి ఓవైపు
మరోసారి మరో వైపు వెలుగు!

"సమానత్వాన్ని మరిచిన
మనుషులను చూడలేక కాలం
సవరణలు చేస్తుందిప్పుడు!"

ఆడపిల్లంటే అణగారిన ఆటబొమ్మలు కారు
ఆకాశాన్ని అధిగమిస్తున్న తారాజువ్వలు

మెదడు నిండా మేధస్సు
మనసు నిండా చైతన్యం
అలుపెరుగని శ్రమైక జీవనం
చేతినిండా సంపాదన
ముఖం నిండా చిరునవ్వు
అణువణువునా ఆత్మవిశ్వాసం
ఈ తరం ఆడపిల్ల రూపం

నీరసం నిద్రమబ్బు బద్ధకం సహించేది లేనితనం
ఎవరికి వారే రక్షణా కవచం!

ఇక స్వయంవరాల కాలం మళ్ళీ మొదలైంది
వెట్టి చాకిరీ కర్మలకు విముక్తి గీతం మొదలైంది
స్వేచ్ఛ పది దిక్కులను  ఆవహించి కేతనమై ఎగురుతుంది!!



# 'మహి'షాసుర మర్దిని

**తనని తాను రక్షించుకుంటూ ఆత్మస్థైర్యంతో ఉన్నత స్థితికి చేరిన ఓ యువతి కథ...**



మాద నాగాంజలి
96400 98344

మహి, "ఈరోజు స్కూల్‌కి వెళ్ళవా"? అని, నాన్న గట్టిగా అరిచేసరికి వెంటనే లేచి కూర్చున్నా. అప్పటికి ఉదయం 6.30 అవుతోంది.

సూర్యోదయం అయింది. సూర్యోదయం మిస్ అయింది. సూర్యుని కన్నా ముందు లేవాలి అని నాన్న రూలు. గబగబా రెడీ అయ్యా. అమ్మ చేసిన, గుంట పొంగనాలు ప్లేటులో వేసుకుని తింటుంటే వారెవ్వా ఎన్ని తిన్నా తినాలనిపిస్తుంది. కాగా, మాతో పాటు నాన్న గారు టిఫిన్ చేస్తున్నారు. ఆ భయంతో అమ్మ ఇంకా రెండు అనబోయి, ఏం లేదు, ఇదిగో ఇక్కడ చట్నీ పెడుతున్నా చెప్తున్నా అని మాటని దాటవేశాను. నాన్న ఏది వద్దు అనరు కానీ అది ఆహారమైన, ఆహార్యమైన మాటైనా అతి వద్దు అంటుంటారు. అప్పుడు ఎందుకు చెప్పారో అర్థం కాలేదు కానీ ఇప్పుడు నాన్న ప్రతి మాట అమృతపు చినుకులు గా కురుస్తుంది, ఇప్పటికీ.

"అరే ప్రహ్లాద్ నీకు ఎన్నిసార్లు చెప్పాలి రా బ్యాగు రాత్రిపూట సర్దుకోమని. రోజు నీవల్ల స్కూల్ లేటు. అసెంబ్లీకి డుమ్మా కొడితే పి.ఈటితో తన్నులు. అమ్మా! నేను, చెల్లి వెళ్తున్నాం వీడ్ని ఎప్పుడు పంపుతావో నాకు తెలియదు" అని బ్యాగు భుజానికి వేసుకొని లంచ్ బాక్స్ చేత్తో పట్టుకుని బయలుదేరుతుండగా, మహి మీరు వెళ్తే వాడు స్కూల్‌కి రాడు వాడిని బతిమిలాడడం, కొనివ్వడం అన్ని చేసేసరికి మధ్యాహ్నం అవుతుంది, తల్లి నా బంగారం కాదు ఒక్క నిమిషం ఆగు, నేను వాడిని లాక్కొస్తా అని గడప పట్టుకొని బతిమిలాడింది అమ్మ. అక్కడ దిమ్మమీద బ్యాగు పెట్టుకొని చెల్లి లక్షిత నేను, ప్రహ్లాద్ కోసం కూర్చున్నాం. కొద్ది సేపటికి వాడితో కలిసి స్కూల్ కి వెళ్ళాము.

అప్పుడు నేను 8వ తరగతి, తమ్ముడు, 7వ తరగతి, చెల్లి లక్షిత 5వ తరగతి చదువుతున్నాం. స్కూల్ నుండి ఇంటికి వచ్చేసరికి అమ్మానాన్న ఇంట్లో లేరు. పక్కింటి రాధ ఆంటీ వచ్చి "మహి, మీ అమ్మను హైదరాబాద్ తీసుకుని వెళ్లారు. కంగారు పడకు" అంది. ఏమైంది ఆంటీ అమ్మకు? మేము వెళ్లేటప్పుడు బానే ఉంది కదా అన్నాను, బ్యాగు అరుగు మీద పెడుతూ. ఈమధ్య తనకి ఏదో ఇబ్బందిగా ఉందని చెప్తుంది కానీ బయటికి చెప్పట్లేదు అంది ఆంటీ వాళ్ళ ఇంటికి వెళ్తూ.

నాకు ఇంట్లో పని చేయడం అంట్లు తోమడం బట్టలు ఉతకడం ఇల్లు ఊడ్చడం వచ్చు. కానీ వంట చేయడం రాదు. తప్పదు అమ్మానాన్న వచ్చేసరికి లేట్ అవుతుంది తమ్ముడు, చెల్లి ఆకలి తట్టుకోలేరని ఎలాగో అలా పొయ్యి దగ్గర కూర్చుని అన్నం వండాను. ఉదయం అమ్మ చేసిన టమాటా పప్పు వేసుకుని తిని పడుకున్నాం. ఆ రోజు రాత్రి అమ్మానాన్న ఇంటికి రాలేదు. అప్పటికే చెప్పారట ఇవాళ రావట్లేదని మేము భయపడతామని తెల్లారి చెప్పారు, వాళ్ళు. ఉదయం అన్ని పనులు చేసుకుని స్కూల్ కి వెళ్లి వచ్చాక గాని అమ్మా నాన్న వచ్చారు.

గబగబా వెళ్లి అమ్మను చూశాను. చాలా నీరసంగా ఉంది ఏమైంది అని నాన్నని అడగలేక అమ్మ దగ్గర కూర్చున్నాం. మా ముగ్గురిని చూసి అమ్మ కన్నీళ్లు పెట్టుకుంది. నాన్న వచ్చి మీరు బయట ఆడుకోండి వెళ్ళండి, అని చెప్పారు. మహి, నువ్వు ఇంట్లో పని చూడు అని అమ్మ దగ్గర కూర్చున్నాడు నాన్న. ఎప్పుడూ లేనిది నాన్న పొలం వెళ్లకుండా ఇక్కడే ఉన్నారు అమ్మ ఇంతలా నీరసపడింది నాకు ఏదో భయంగా ఉంది. కొద్దిసేపటికి అమ్మమ్మ మామయ్య వాళ్ళు వచ్చారు చుట్టుపక్కల వాళ్ళు వచ్చి వెళుతున్నారు. మాకు వినపడకుండా చిన్నగా మాట్లాడుతున్నారు మేం భయపడతామని కాబోలు. టైఫాయిడ్ లేక కామెర్లు అలాంటిది అనుకున్న కానీ మా అమ్మ మమ్మల్ని శాశ్వతంగా దూరం చేసే మహమ్మారి క్యాన్సర్ వచ్చిందని ఊహించే స్థాయి, తట్టుకునేంత ధైర్యం నాకు లేదు.

నాన్న చెప్పారు, నువ్వు స్కూల్ కూడా కొన్నిసార్లు వదులుకోవాల్సి వస్తుందని, సరే అన్నాను తల దించుకుని. అమ్మమ్మ మాతో పాటే ఉంది అమ్మ కోసం.

కొన్ని నెలలకు మా అమ్మ మమ్మల్ని విడిచి కనపడని లోకాలకు దూరంగా ఎప్పుడూ కనిపించనంత శాశ్వతంగా దూరమైంది. అమ్మ అనే మాట వినలేనంత దూరంగా వెళ్లిపోయింది. కంటినిండా కన్నీళ్లు, మనసు నిండా బాధ, చెప్పుకోలేనంత వేదన, ఎవరు ఓదార్చినా తీరని ఆవేదన మా గుండెల నిండా నిండిపోయింది. మేం ముగ్గురం అమ్మ దగ్గర కూర్చొని ఏడుస్తుంటే వచ్చిన వాళ్ళందరూ కన్నీటి పర్యంతమయ్యారు. నాన్న చేయని ప్రయత్నం అంటూ లేదు. మమ్మల్ని ఓదార్చడానికి. తాతయ్యకు బాగా లేక అమ్మమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళింది. నేను ఇక్కడ పెద్ద బాధ్యతని బరువుని మోయాల్సిన చిన్నదాన్ని.

నైన్త్ క్లాస్ ఎండాకాలంలో నేను, ప్రహ్లాద్,చెల్లి లక్షితతో ఆడుకుంటున్నాం. సడన్ గా కడుపులో నొప్పి వచ్చి కళ్ళు తిరిగి పడిపోయాను. చుట్టుపక్కల వాళ్ళు వచ్చి మజ్జిగ ఇచ్చి లేపి కూర్చోబెట్టారు. అమ్మ లేని ఇల్లు చీకటిల్లు. అమ్మలేని పిల్లలు ఏకాకులమే. ఆరోజు బాగా అర్థమైంది. నాన్న ఇంటికి వచ్చేసరికి, చుట్టుపక్కల వాళ్ళు ఇంట్లో ఉన్నారు. ఏమైందోనని నాన్న కంగారు పడ్డారు. ఏం లేదు మీ పాప మెచ్యూర్ అయిందని కొత్తగా వచ్చిన స్పందన ఆంటీ చెప్పి నన్ను మూలన కూర్చోబెట్టారు. నాకు ఏడుపాగటం లేదు చుట్టూ ముత్తైదువులు ఇప్పటినుండి ఈ అమ్మాయి తన ప్రాబ్లమ్స్ ని ఎవరికి చెప్పుకోవాలి? సన్నగా వినపడుతోంది. అమ్మమ్మ వాళ్లు వచ్చి ఓ వారం ఉండి వెళ్లారు. వాళ్లు తీసుకుని వెళ్తాము అనగా ముగ్గురు మీకు కష్టమే అత్తయ్య, మామగారికి ఒంట్లో బాగోడం లేదు కదా, నా పిల్లలు నా కు కష్టం కాదు అని, అమ్మ కాలం చేసినప్పుడే చెప్పారని ఆరోజు తెలిసింది. మా కోసం నాన్న మళ్ళీ పెళ్లి చేసుకోలేదు.

అప్పటినుండి కష్టాలు రెట్టింపు అయ్యాయి. రోడ్డుమీద ఆకతాయిలు సైగలు చేయడం ర్యాగింగ్ చేయడం మొదలుపెట్టారు. ఇంట్లో చెప్తే నాన్న స్కూలు మానిపిస్తాడేమోనని భయం ఇంకా ఏమైనా గొడవలు అవుతాయని భయం.

ఒకరోజు నేను జ్వరం వచ్చి స్కూల్‌కి వెళ్ళలేదు. నాన్న పని మీద ఊరు వెళ్లారు. నేను ఇంట్లో పని అయ్యాక వరండాలో బుక్స్ తీసుకొని చదువుతున్న. పక్కింటి అంకుల్ నాన్న సీనియర్ వెంకట్రావు నా పక్కన కూర్చుని మాట్లాడటం ప్రారంభించారు. మీ నాన్న ఎక్కడికి వెళ్లాడు? ఎప్పుడొస్తాడని. తను నన్ను ఎత్తుకొని తిరిగారు కదా అదే చనువుతో ఎప్పటిలాగే నేను మాట్లాడాను. మంచినీళ్లు తెమ్మంటే తెచ్చి ఇచ్చాను తాగారు. కొద్దిసేపు మాట్లాడి వెళ్లారు. మళ్లీ మధ్యాహ్నం రెండు గంటలకు ఎవరూ బయట తిరగని టైంలో ఇంట్లోకి వచ్చి తలుపువేశారు. నేను భోజనం చేద్దామని ప్లేట్లో అన్నం పెట్టుకున్నా. ఈ హఠాత్ పరిణామానికి ఏమీ అర్థం కాలేదు.

కానీ ఎందుకో భయం వేసింది.

మహి ఇలారా నీకు స్వీట్లు తెచ్చాను అని కుర్చీలో కూర్చొని పిలిచాడు మళ్ళీ వెంకట్రావు అంకుల్. ఇలాంటి ప్రవర్తన ఎప్పుడూ చూడలేదు వద్దన్నా తీసుకోకపోతే ఊరుకోవడం లేదు. భుజం మీద చేయి వేసి మంచం మీద కూర్చోబెట్టడానికి తీసుకువెళుతున్నట్టు అర్థమైంది. దురుద్దేశంతో ఉన్న అతని నుండి నేను ఎట్లా తప్పించుకోవాలని, సెకండ్ లో ఒక ఉపాయం వచ్చింది. అప్పటికే ప్లేట్లో కూరతోపాటు వేసుకున్న, కారప్పొడి అది కుడి చేతిలోకి తీసుకున్న. మంచం మీద కూర్చోగానే కళ్ళలో కారం కొట్టి గబా గబా వచ్చి తలుపు గొళ్ళెం తీసి బయటికి వచ్చి అరిచేసాను గట్టిగా. నా అరుపుకు చుట్టూ అందరూ పోగయ్యారు. వాడు సర్దుకొని ఇంటి వెనక గోడ దూకి పారిపోయాడు. వచ్చిన వాళ్లకు దొంగ వచ్చాడు అని చెప్పి పంపాను లేకపోతే అందరికీ చులకన అవుతానని.

నాన్నకు జరిగిన విషయం చెప్పగా శభాష్ బేటా మంచి పని చేశావు. వాడిని ఈ చుట్టుపక్కల రాకుండా నేను చూసుకుంటానని నాన్న భరోసా ఇచ్చారు.

ఎలాగో అలా టెన్త్ పూర్తి చేశాను కుటుంబ బాధ్యతలతో.

ఇంటర్ పల్లె నుండి సిటీకి గుంటూరు ప్రయాణం. నాన్నకు భయం, పల్లెటూరు ఇలా ఉంటే సిటీ ఎలా ఉంటుందోనని. అందుకే అందరం గుంటూరు షిఫ్ట్ అయ్యాం. నాన్న కొబ్బరి బోండాల షాపు



ప్రారంభించారు. మాకు ఒక కిలోమీటర్ దూరం కాలేజీ. గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ గుంటూరులో, ఎంపీసీ గ్రూప్ లో జాయిన్ అయ్యాను. కాలేజీ ఇల్లు క్షణం తీరిక లేకుండా గడుస్తుండేది.

కాలేజీకి వెళ్లేటప్పుడు ఆకతాయిల వేధింపు ఎక్కువైంది. ఒకరోజు ఒకడు వచ్చి ప్రపోజ్ చేశాడు. నేను రిజెక్ట్ చేసి కాలేజీ కి వెళ్లాను.

తిరిగి వచ్చేటప్పుడు వెనక నుండి వేగంగా రావడం చూశాను. వాడి చేతిలో ఏదో ఉంది గమనించే లోపే యాసిడ్ బాటిల్ మూత తీసి మీదికి విసిరాడు చున్ని, బుక్స్ అడ్డుపెట్టి గబుక్కున పక్కన ఉన్న హోటల్లోకి పరిగెత్తాను. అక్కడే టీ తాగుతున్న వాళ్లు వాడిని పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. నా మీద కొన్ని చుక్కల ఆసిడ్ పడింది. అక్కడి వాళ్ళు ఫస్ట్ ఎయిడ్ చేసి నాన్నను పిలిచి అప్పగించారు. దీంతో నాన్న చాలా భయపడి చదువు వద్దు ఏమీ వద్దు మన ఊరు వెళ్దాం అని చెప్పారు.

నాన్న ఎక్కడికి వెళ్ళినా ఈ సమస్య తప్పదు అక్కడ తక్కువ,ఇక్కడ ఎక్కువ వేధింపులు అంతే తేడా. ఇక చదువు కోకపోతే రేపటి సమాజంలో బ్రతకలేము నాన్న. నేను రేపటి నుండి కాలేజీకి వెళ్తా అన్నాను. కొన్ని రోజులు ఆగు మహి నా మాట విను అని నాన్న బతిమాలే సరికి ఆగిపోయాను.

ఇంటర్ 90% మార్క్స్ తో కాలేజ్ టాపర్ ని నేనే. ఎంసెట్లో మంచి ర్యాంకు హైదరాబాద్లో ఇంజనీరింగ్ సీటు వచ్చింది. ర్యాగింగ్ కు మారుపేరు ఇంజనీరింగ్ కాలేజీలు. సమస్యలు చుట్టుముడు తున్నప్పుడే దాన్ని అధిగమించే శక్తి మనలో ఉత్పన్నమవుతుందని ఎవరో చెప్పినట్టు గుర్తు.

ఫ్రెండ్స్ ని ఎంతవరకు కట్ చేయాలో అంతే డిస్టెన్స్ మెయింటైన్ చేస్తూ పార్ట్ టైం జాబ్ లో జాయిన్ అయ్యాను. ప్రైవేట్ ట్యూషన్స్ చెప్తూ, నా కాలేజీ కంటిన్యూ చేశాను. 20 స్టూడెంట్స్ దాకా వచ్చారు ఖర్చులు పోను నాన్నకు పంపడం జరిగేది. ఫైనల్ ఇయర్లో క్యాంపస్ ఇంటర్వ్యూలో ఇన్ఫోసిస్ లో జాయిన్ అయ్యాను. మంచి ప్యాకేజీ 5 అంకెల సంఖ్య దాటింది ప్రతి నెల,చాలా ఆనందం అనిపించింది. నాన్న బిజినెస్ కూడా ఊపందుకుంది. స్టేట్ మొత్తం హోటల్స్ల్లా కొబ్బరి బొండాలు సప్లై చేయడం స్టార్ట్ చేశాడు నాన్న.

ఒకరోజు నాన్న ఇంటికి రమ్మనగా వెళ్లాను. “అమ్మా, మహి నీ బాధ్యతను పూర్తి చేసుకుంటాను కాదనకు నీతో పాటు చెల్లి కూడా ఉంది. నో చెప్పలేక ఒకే అన్నాను. మా మేనత్త కొడుకు వికాస్తో పెళ్లి నిశ్చయించారు నాన్న. ఇన్నాళ్ల మాకు దూరంగా ఉన్న మా మేనత్త ఎప్పుడైతే ఉన్నత స్థితికి వచ్చామో,అప్పుడు దగ్గరయింది. నాన్నను వచ్చి అడిగేసరికి నాన్న కాదన లేక వికాస్తో పెళ్లి జరిగితే బాగుంటుంది అని, నాకు చెప్పారు. నాన్నను కాదనలేక నేను ఒప్పుకున్నాను. వికాస్ డాక్టర్ జనరల్ ఫిజీషియన్. వాళ్లది ప్రకాశం జిల్లా ఒంగోలు. మేము హైదరాబాదుకి వచ్చాము పెళ్లయ్యాక.

ఇద్దరము బిజీ అత్తయ్య వాళ్ళు అప్పుడప్పుడు వచ్చేవాళ్ళు. మహి ఈరోజు మూవీ కి వెళ్దాం నీకు వీలవుతుందా అన్నాడు. నాకు నైట్ షిఫ్ట్ ఉందండి అన్నాను. మాట్లాడుకోలేనంత బిజీ. ఒకరోజు నేను ఫ్రెండ్స్ తో వీడియో కాల్ మాట్లాడుతుండగా వికాస్ వచ్చాడు. అది గ్రూప్ కాల్. రకరకాల ఫ్రెండ్స్ ఉన్నారు తను చూసి ఎవరు ఏంటి అని ఆరా తీశాడు. జస్ట్ ఫ్రెండ్స్ అయితే,ఎవరిని ఎక్కడ ఉంచాలో అక్కడే ఉంచు అని అన్నాడు. నాకు తెలుసు నా హద్దుల్లో నేను ఉంటాను నేనేమీ వాళ్లతో రాంగ్ గా మాట్లాడలేదు కదా మిగతా వాళ్లతో వాళ్లు అలా ప్రవర్తించారు. అందులో నా తప్పేమీ లేదు కదా అన్నాను. అక్కడ మొదలైంది. అది చిలికి చిలికి గాలివాన అవుతుందని ఎక్స్పెక్ట్ చేయలేదు. తను ఇంటికి లేటుగా రావడం ముఖం ముభావంగా పెట్టుకోవడం నేను గమనిస్తూ వచ్చాను. ఒకరోజు మమ్మల్ని చూద్దామని నాన్న ఇంటికి వచ్చారు. రాత్రి పది అయినా అల్లుడు ఇంటికి రాకపోయేసరికి నాన్న అడిగారు. జరిగింది చెప్పాను ఏమీ అనలేదు తెల్లారి కామన్ గానే ఇంటికి వెళ్ళిపోయారు.

కొన్ని రోజులకి నాన్న నుండి పిలుపు ఇద్దరినీ ఇంటికి రమ్మని చెల్లి లక్షిత పెళ్లి నిశ్చయం అయిందని చెప్పారు. వికాస్ ని కొద్ది రోజులు వాళ్ళ హాస్పిటల్ లో డ్యూటీ డాక్టర్ని పెట్టి రమ్మని చెప్పారు,నాన్న. మామయ్య మాట కాదన లేక అలాగే చేసాడు వికాస్.

ఇద్దరు బాల్కనీలో కూర్చున్నారు. ‘వికాస్ నువ్వు నా మేనల్లుడివే కాదు నా కొడుకుతో సమానం’. అని దిగాలు తో మాట్లాడాడు ‘ఏమైంది? మామయ్య ఇలా అంటున్నారు అన్నాడు వికాస్. ఏమీ లేదు వికాస్ మహి నాకు జరిగిందంతా చెప్పింది. మహి చిన్నప్పటినుండి మగ జాతిలో వున్న కొన్ని క్రూర మృగాల నుండి తనను తాను కాపాడుకుంటూ వచ్చింది. చాలా సిన్సియర్. ఆఖరికి పెళ్లి కూడా నా ఇష్ట ప్రకారమే ఒప్పుకుంది. మీ ఇష్టమే నా ఇష్టం నాన్న అని మాట ఇచ్చి ఆ ప్రకారమే నిలబడింది. ఒక్కమాట ఎదురు చెప్పలేదు. నా కూతురు అని కాదు గాని ఈ సమాజంలో ధైర్యవంతమైన మహిళల్లో నా మహి, మహిషాసుర మర్దిని లాంటిది. కుటుంబాన్ని ఒక స్థాయిలో నిలబెట్టింది. మహిని చేసుకోవడం నీ అదృష్టం. మీరు చిలకా గోరింకలాగా చిరకాలం చిరాయుష్షుతో ఆదర్శంగా ఉండాలి వికాస్ చేతులు అని పట్టుకోగా, మామయ్య నేను మహిని అపార్థం చేసుకున్న. నా తప్పు సరి చేసుకుంటానని మాట ఇచ్చాడు వికాస్.

సైకాలజీలో మాస్టర్స్ చేసింది డిస్టెన్స్ లో మహి. జాబుతో పాటు హాస్పటల్లో కౌన్సిలింగ్ సెంటర్ ని స్టార్ట్ చేసింది మహిత W/O. డాక్టర్ వికాస్. సమస్యలతో వచ్చిన జంటలను విడిపోనివ్వకుండా వాళ్లు చిలకా గోరింక లాగా కలిసి ఉండేలా చేస్తూ అందరికీ ఆదర్శప్రాయమైన మహిళగా సమాజంలో ఒక ఉన్నత స్థానంలో నిలబడింది మహిత.

కవిత

# ఆత్మీయ సమ్మేళనం



అంజలి, 9908113648

అదిగదిగో లీల
ఇది ఆనందాల హేల
పచ్చగ విరిసిన ప్రకృతి అందం
చల్లగ వీచే పిల్లగాలులు
ఆటల పాటల సవ్వడులు
మిత్రులు చేసిన అల్లరులు
పిల్లలు పంచిన ఉల్లి గారెలు
శ్రీమహితమ్మగు వేములవాడ
లింగ మూర్తుల దర్శనము
ఆంజనేయుని అపార కృపతో
అండగ నిలిచే కొండ గట్టులు
దేవుని గుడిలో సరిగమలు
వీనుల విందగు మధురిమలు
బృందావనమే నందనవనమై
మనసును దోచిన రమణీయం
మది మురిపించే మలయ మారుతం
ఎద అలరించే సత్కారం
ఘుమ ఘుమ లాడే విందు భోజనం
అతిథులకిచ్చిన ఆతిథ్యం
తారు రోడ్డుపై త్రాచుపాములా
బుసలు కొట్టుతూ బస్సు ప్రయాణం
జల జల పారే జలపాతం
గడ బిడ చేసే ఇంజన్లు
అలల తాకిడి పరవళ్ళు
అలసిన మనసుకు ఒరవళ్లు
కోమటి చెరువు అందాలు
భూతల స్వర్గం చందాలు
కవి విరచించిన కవనంలా
కనివిని ఎరగని కమనీయం
అందరి ఆత్మీయ సమ్మేళనం,
ఇది తీయని జ్ఞాపక సమ్మిళితం.



వ్యాసం

# విజయకేతనాన్ని ఎగరేస్తున్న 'ధీర'ల రోజిది

ఛాందస భావాలు పోవాలంటున్న వ్యాసం...



శిలాలోలిత
93913 38676

అంతర్జాతీయ మహిళా దినోత్సవమిది. అయితే ఈ ఉత్సవం జరుగుతున్నందుకు భిన్నాభిప్రాయాలు అనేకం వున్నాయి. స్త్రీలంటే వుండే కొంత వ్యంగ్యంలో 'స్త్రీల దినమిది' అనే మాటలు వింటుంటాం. ఒక్కరోజు తల్చుకుంటే సరిపోయిందా అనేమాట ఒకటి చలామణిలో వుంది. తమకు ఏమాత్రం సంబంధం లేని క్రతువు మాత్రమే అనే పురుషులూ వున్నారు. స్త్రీల సాధికృతను, శ్రమశక్తిని గుర్తు చేసి ప్రకటించే రోజిది అన్నవాళ్ళు వున్నారు.

నిజానికి సమాజానికి రెండు సమాన భాగాలైన స్త్రీ, పురుషులు ఇరువురూ కలిసి చేయాల్సిన ఉత్సవమిది. కొత్తకొత్త బృందాలు, నిర్ణయాలు, చేసుకోవాల్సిన రోజిది.

స్త్రీలు సాధించిన విజయాలు, ఈరోజు ప్రాముఖ్యత స్త్రీలు ఎదుర్కొన్న విషయాలు, స్త్రీలు పోరాడి సాధించుకున్న వైనాలు ఒకటేమిటి? ఎన్నెన్నో ఆధునిక విషయాలను తలుచుకోవచ్చును.

కానీ, కొన్నిచోట్ల కేవలం స్త్రీలకు సంబంధించేదేనంటూ, ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్ వంటి రొటీన్ ఆటలు కొన్ని, గిఫ్టులు, ఆఫీసుల్లో సైతం పూజాకార్యక్రమాలు, వేదికల మీద కుప్పలుగా స్త్రీలను కూర్చోబెట్టి, తామెంతో అవకాశమిచ్చామని గర్వించే వైఖరులు, ఈ ఒక్కరోజుకే మేం చేయం గానీ, హెూటల్ నుంచో, జుమాటో నుంచో తెచ్చుకోండనే రాయితీలు వెరసి, స్త్రీనొక ఆటబొమ్మగా, విలాసవంతులుగా, కుటుంబాలను మోసే భావవాహికలుగా, రెండవశ్రేణి మనుషులుగా ఇంకా చూడ బడుతున్న స్థితి నేటికీ కొనసాగుతోంది.

మారాలి. మనుషులు ఇకనైనా కొంతవరకన్నా మారాలి. ఏదో ఒక్క క్షణంలో రాదు కదా! ఇన్నాళ్ళ, ఇన్నేళ్ళ శ్రమను ప్రతిఫలాలు కావాలి.

ఆధునికులు అనుకొన్న కొందరిలో కూడా ఇంకా ఛాందసవాదుల పేరిట, సంస్కృతి పేరిట పాతభావాలే కొనసాగుతున్నాయి. ఈతరం వ్యక్తుల్ని చూసినప్పుడు ఆశ మళ్ళీ చిగురిస్తోంది. భావవిప్లవాలు వచ్చాయి. ఒకరినొకరు గౌరవించుకునే స్థితి వచ్చింది. బలవంతంగా కలిసుండే స్థితులు తగ్గి, ఒకరిపట్ల ఒకరికి ఉండాల్సిన సమానస్థితిని కొందరైనా సాధించుకోగలుగుతున్నారు అన్నది అంగీకరించాల్సిన నిజం.

ముఖ్యంగా సాహిత్యం జీవితాల్లో భాగమైపోయాక స్త్రీవాదం స్పష్టమైన రూపంతో కనిపించాక, ఆలోచనా ధోరణుల్లో చాలా మార్పులొచ్చాయి. 'ప్రశ్న నుండే జ్ఞానం ఉదయిస్తుంది అన్నట్లుగా ప్రశ్నలే, తిరుగుబాట్లే స్త్రీలల్లో పెనుమార్పులు తెచ్చింది.

ఇవాళ స్త్రీలు సాధించుకున్న విజయాల వెనుక స్త్రీల చైతన్యం, పట్టుదల, ధైర్యం, సాహసం, కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తున్నాయి.

శ్రామిక స్త్రీలు దోపిడీని ఎదుర్కొన్న స్థితి ప్రపంచవ్యాప్తంగా 'ధీర'లుగా నిలబడ్డ పరిస్థితి మనం అంగీకరించాల్సిందే.

స్త్రీ పురుషుల ఆలోచనా విధానాల్లో మార్పు వచ్చినప్పుడు, సమాజం, కుటుంబాలు బాగుపడ్తాయి. జెండర్ వివక్ష కుటుంబాల్లోని మూలస్వభావంగా మారిపోవడాన్ని గమనించాలి. పిల్లల పెంపకంలో తగుమార్పులు రావాలి. ఒక లాగానే పెంచాలి. చిన్నప్పటినుంచి పెంచిన, పెరిగిన విధానమే పెద్దయ్యాక కనిపిస్తాయి. ఆడగా, మగగా కాక ఒకటిగా పెంచాలి. కూతురు, కోడలు, కొడుకు, అల్లుడు లాంటి వారిపై ఒకే ధోరణి వుండాలే కాని, ఆలోచనాధోరణి మారాలిగానీ, తర్వాత రావడానికి చాలా కష్టపడాల్సొస్తుంది. పనివిభజన కూడా వుండొద్దు. ఇంటిపని, పిల్లల్ని కనే పని, పెంచే పనీ, కుటుంబపెద్దల్ని చూసేపని, ఉద్యోగం చేసేపని, ఊడిగం చేసేపని ఉండొద్దు. ఆర్థిక స్వాతంత్ర్యం లేని స్థితి. ఇవన్నీ ఉన్నాయి.

స్త్రీ తనను తానొక మనిషిగా గుర్తుంచుకోవడంతోపాటు దేన్నయినా సాధించుకోగలిగిన శక్తిని గుర్తెరగాలి. తన

వ్యాసం

మేధోసంపత్తి ద్వారాఎలాంటి చిక్కుముడులనైనా విప్పగల 'ధీర' స్త్రీ. అటువంటి స్త్రీగా పుట్టినందుకు గర్వించగలగాలే గానీ, న్యూనతకు గురికావొద్దు. శీలమంటే వున్న అర్థం మారాలి. ఇది ఇరువురికీ సంబంధించింది. శరీరపు దాడిగా మాత్రమే గుర్తించాలి. గుర్తిస్తున్నారు కూడా. ఐతే స్త్రీలు సాధించుకున్న అనేక విజాయాలను ఈరోజు, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్న తీరుతెన్నులు గర్వకారణం. 30 ఏళ్ళ క్రితం రాసిన కవిత్వంలో వున్న స్త్రీల స్థితి ఈనాటికీ కొనసాగుతుండడం చూసి నిర్వేదం కలగక తప్పదు. అప్పటిలానే స్త్రీలు హింసలకు గురవుతూనే వున్నారు. హింసల్లో మార్పులొచ్చాయి. క్రూరత్వం మరింతగా పెరిగింది. ఇది కొంచెం బాధించే అంశమైనప్పటికీ, ఈ తరపు స్త్రీలు మారిన వైఖరులు బతుకుపట్ల గొప్ప ఆశల్ని చిగురింపజేస్తున్నాయి. మహిళలు సాధించిన, సాధించుకుంటున్న విజయకేతనం ఈరోజు. ఈరోజు మనం గొప్ప ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, విజయాలను సాధించుకున్న 'ధీర'లుగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్న విలువైన రోజిది. రేపటితరాలకు మరో మైలురాయి.

కవిత



# సౌందర్యకాంక్ష

డా॥ జ్యోత్స్న 94918 77359

అతడు నిర్దేశించిన కొలతల కోసం
తనూంతికను అంగుళమంగుళం
చెక్కుకుంటుంది
కడుపు మాడ్చుకొని
కనుపాపలను మార్చుకొని
వర్ణమయాధరాలతో
కొంచెం కొంచెం
అందం అద్దుకుంటుంది ఆమె
చిత్రసుందరిగా మారడం కోసం
చిత్రహింస పడుతుంది
ఆ వేదిక కోసం
సంసిద్ధం అవుతుంది ఆమె
ఆదిమ వస్త్రధారణతో
వేదిక పైకి చేరుతుంది
హంసనడక అనలేం గాని
అడుగులేవో విచిత్రంగా వేస్తుంది
కడకంటి చూపులు కావు గాని
కాల్చేసే చురకత్తి చూపులు విసురుతుంది
బ్యూటీ విత్ బ్రెయిన్
మాటల మహేంద్రజాలంలో చిక్కుకొంటుంది
మార్కెట్ మాయజాలంలో పావుగా మారుతుంది
తానో చంచలావల్లికలా మెరిసిపోతుంది, మురిసిపోతుంది
ఎన్నాళ్ళని ఆ సౌందర్యం? తల్లీ
ఆరిపోదా ఆ కాంతి
ఎక్కడికమ్మా పరుగులు
ఆత్మసౌందర్యం కొలమానం తెలుసుకో
అంతరంగిక సౌందర్యం పెంచుకో-

కథ

# నన్ను క్షమించు తల్లీ!

**తప్పిపోయిన కూతురు గొప్పగా తిరిగి వచ్చిన వేళ...**



పురిమళ్ల సునంద
94418 15722

"అమ్మా! అమ్మా! ఇటు చూడు అన్నయ్య కంటే నాకే ఎన్నెన్ని ప్రైజులు వచ్చాయో! చేతుల నిండా ప్రైజులను పట్టుకుని సంతోషంగా తల్లి దగ్గరకు పరుగెత్తుకుంటూ వెళ్ళింది. అంతలోనే తండ్రి మాటలు గుర్తొచ్చి కళ్ళనీళ్ళు తిరిగాయి సహనకు.

"అరెరే ఎందుకురా బంగారూ?ఈ సంతోష సమయంలో కన్నీళ్ళు? తల నిమురుతూ అంది.

తల్లి భుజాల చుట్టూ చేతులు వేసి చూపిస్తూ "ఎందుకమ్మా?నాన్నకు నేనంటే ఇష్టం లేదా?

ఆటల్లో ప్రైజులొచ్చినా,చదువులో బహుమతులొచ్చినా

"ఆ వచ్చాయిలే .. నీవెక్కడ వాడెక్కడా.. వాడితో నీకు పోలికా! వాడు మగ మహారాజు.. నువ్వెన్ని తెచ్చుకున్నా.. ఈ ఇల్లు ఆ ఇల్లు వరకే.. అసలు నీవల్లే రేపు ఇంకొకడి కాళ్ళు పట్టుకునే పరిస్థితి రాబోతోంది" అంటారెందుకు? నేనేం తప్పు చేశాను?

కన్నీళ్ళతో అడుగుతున్న బిడ్డకు ఏం జవాబు చెప్పాలో తెలియలేదు అనసూయకు.

చిన్నారి మనసును అంతగా గాయ పరుస్తుంటే తట్టుకోలేకపోతోంది. కానీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి."ఏం మాట్లాడినా కయ్యానికి కాలు దువ్వే" భర్తతో మాట్లాడడం, వాదించడం కంటే నోరు మూసుకోవడమే మంచిదని తెలుసు. అందుకే ప్రశ్నించడం మానేసింది.

కానీ ఆ పసిది అడిగినప్పుడల్లా గుండె కలుక్కుమంటుంది. ఆయన మాటలతో తండ్రిపై ద్వేషం ఎక్కడ పెంచుకుంటుందో ఏమోనని ఎప్పటికప్పుడు అపార్థం చేసుకోకుండా సర్ది చెబుతూ ఉంటుంది.

"నీకేమైనా కష్టం కలిగితే భరించలేడమ్మా! మీ నాన్న. నిన్ను అత్తారింటికి పంపించాక నీవు లేకుండా ఉండలేనని ఇలా మాట్లాడుతుంటారు. అంతే కానీ నీ మీద ప్రేమ లేక కాదురా బంగారూ! ఆ చిన్ని మనసు నొచ్చుకోకుండా తండ్రి మీద ప్రేమ తగ్గకుండా బుజ్జగింపుగా నుదుటన ముద్దు పెట్టింది.

* * *

కాలం ఓ నిరంతర స్రవంతి.మహా సముద్రంలోని కెరటం.అవి రెండు ఎవరికోసం ఆగకుండా సాగిపోతూనే వుంటాయి.

అనసూయ హృదయం ప్రతి క్షణం తల్లడిల్లి పోతోంది. భర్త చేసిన గారాబం వల్లే కదా కొడుకు జీవితం గాడి తప్పింది. చదువు సంస్కారం లేకుండా తయారయ్యాడు. ఇదేమని మందలించబోతే తండ్రి మాట గుర్తు చేసి "నాకేం మగ మహారాజును! నువ్వేంటమ్మా! ఎప్పుడూ ఏవో నీతులు చెబుతావు" తనను విమర్శించే వాడిని చూస్తుంటే ఇక వాడు చెప్పిన మాటలు వినే స్థాయి దాటిపోయిందని అర్థమైంది.

అందుకే "భగవంతుడే ఆ తండ్రీ కొడుకులను మార్చాలి' అనుకుని మౌనంగా ఉండటం నేర్చుకుంది.

* * *

"మంచి-చెడు, కష్టం- సుఖం, ఆనందం - ఆవేదన... వీటితో నిమిత్తం లేకుండా నిశ్శబ్దంగా మోసుకుని పోవడమే కదా కాలం పని".

ఆరోజు ఓ పీడకల. అంతులేని దుఃఖాన్నీ దురదృష్టాన్ని మిగిల్చిన రోజు.

ఇరుగు పొరుగు అంతా సమ్మక్క సారలమ్మ జాతరకు వెళుతుంటే కొడుకు అడిగాడని తమనూ బయలుదేర తీశాడు.

నేల ఈనినట్టు జనం.మేడారాన్ని చూస్తుంటే మహా సముద్రంలా కనిపిస్తోంది.

అందులో కూతురు చేయి పట్టుకొని తాను. కొడుకు చేయి పట్టుకొని ఆయన పరిసరాలు చూస్తూ వెళుతున్నారు.

రకరకాల ఆట వస్తువులు , బొమ్మలే కాకుండా రంగుల రాట్నం,కీలు గుర్రం లాంటివి గిరగిరా తిరుగుతూ ఆకర్షిస్తూ వున్నాయి. కొడుకు అడిగిందల్లా కొనిస్తూ,

కథ

జెయింట్ వీల్ లాంటివి ఎక్కిస్తూ “అబ్బో! వాడి ధైర్యం చూడు!” అని మురిసిపోతూ వున్నాడు.

అదంతా చూస్తున్న సహన “అమ్మా! అమ్మా! నేనూ రంగుల రాట్నం ఎక్కి తిరుగుతానమ్మా! ఇదొక్కటే అమ్మా! ఇంకేం అడగను.కొంగు పట్టుకొని బతిమిలాడుతూ “నాన్నకు చెప్పమ్మా! అదిగో అన్నయ్య ఎన్ని ఎక్కాడో.. ఎన్ని కొనుక్కున్నాడో.. ఇదొక్కటే అమ్మా! “ అంటూ

అక్కడే ఆగిపోయింది.

“ఏం చెబుతుంటే నీక్కాదా! వాడితో పోల్చుకోవద్దని వందల సార్లు చెప్పిన. అక్కడ నుంచి వస్తావా రావా!” పసిదాన్ని గొర గొర లాక్కుపోతున్న భర్త వంక ఒక్క క్షణం కోపంగా చూసింది అనసూయ.

ఆర్థిక స్వాతంత్ర్యం లేని తనను నిందించుకుంది. పసిపిల్ల అడిగిన ఒకే ఒక్క కోరిక తీర్చలేని నిస్సహాయతకు దుఃఖం వచ్చింది.

“వద్దండీ ! దాన్ని ఏమనకండి! నేను నచ్చచెబుతా కదా!’ గబగబా వెళ్ళి విడిపించింది. బిడ్డను దగ్గరకు తీసుకొని ఓదార్చింది.

గట్టిగా ఏడ్చినా తండ్రి ఊరుకోడని, ఇంకా కోపమొచ్చి కొడతాడనే భయంతో ఎక్కిళ్ళను బిగబట్టుకుంటోంది.

తల్లి కొంగులో ముఖం దాచుకుని “అమ్మా! నాన్నకు నేనంటే అసలు ఇష్టం లేదు. నువ్వే... నువ్వే ఎప్పుడూ అబద్ధం చెబుతున్నావు” అన్న బిడ్డ మాటలకు పాతాళంలోకి జారిపోయింది.

తీరని కోరికను తల్చుకుని, తల్చుకొని కుమిలి కుమిలి ఏడుస్తూ రోజంతా ఏమీ తినకుండా పడుకుంది.

“కడుపు మాడితే అదే తింటుంది “ అన్న భర్త మాటలకు అసహ్యం వేసింది.తల్లి మనసు తల్లడిల్లి పోయింది. భర్తలా తాను తేలిగ్గా తీసుకోలేక పోయింది.తను కూడా తినకుండా బిడ్డను గుండెలకు హత్తుకుని ఆలోచిస్తూ పడుకుండి పోయింది.

★ ★ ★

పొద్దున్నే లేచి చూసుకుంటే బిడ్డ కనిపించలేదు. “సహనా! సహనా! బంగారూ! ఎక్కడ తల్లీ! దిక్కులు పిక్కటిల్లేలా ఏడవ సాగింది.

పిచ్చిదానిలా చుట్టుపక్కల అంతా వెతికింది. ఎక్కడా కనబడలేదు.

పోలీసు కంప్లైంట్ ఇవ్వమని భర్త చేతులను పట్టుకుని వేడుకుంది.

“ఆ ఎక్కడికి పోతుంది! అదే దొరుకుతుంది. ముందు నీ ఏడుపు ఆపేయ్!” అంటున్న భర్త నిర్లక్ష్యపు మాటలు వింటూ, మనసులోనే

**పొద్దున్నే లేచి చూసుకుంటే బిడ్డ కనిపించలేదు. “సహనా! సహనా! బంగారూ! ఎక్కడ తల్లీ! దిక్కులు పిక్కటిల్లేలా ఏడవ సాగింది. పిచ్చిదానిలా చుట్టుపక్కల అంతా వెతికింది. ఎక్కడా కనబడలేదు. పోలీసు కంప్లైంట్ ఇవ్వమని భర్త చేతులను పట్టుకుని వేడుకుంది.**



అసహ్యించుకుంటూ అంతటా వెతికింది.. వెతికి వెతికి అలసిపోయింది.

★ ★ ★

ఆ జాతరలో తప్పిపోయిన బిడ్డను గురించి అనసూయ తలవని రోజు లేదు. దుఃఖపడని క్షణం లేదు.

కొడుకు ఎందుకూ పనికి రాని జులాయిగా తయారయ్యాడు.చదువునూ, సంస్కారాన్ని వదిలేశాడు.

చివరికి తండ్రి మాట కూడా లెక్క చేయని స్థాయికి దిగజారాడు.మాటకు మాట ఎదురు జవాబు చెబుతున్నాడు. ఎక్కడెక్కడో తిరుగుతూ అర్ధరాత్రి, అపరాత్రి ఇంటికి రావడం.''ఇదేంటి అని ప్రశ్నిస్తే.. బెదిరించడం నేర్చుకున్నాడు. గట్టిగా అంటే ఏదైనా అఘాయిత్యానికి పాల్పడతాడేమోనని భయంతో వాడి వల్ల ఎప్పుడు ఎలాంటి చెడు వార్త వినాల్సి వస్తుందేమోనని భయం భయంగా గడపసాగారు.

★ ★ ★

ఇప్పుడిప్పుడే అనసూయ భర్తలో పశ్చాత్తాపం..

బంగారు తల్లిని, ఆ బిడ్డను ఏడ్పించిన శాపమే పాపమై వెంటాడుతోందని పశ్చాత్తాపం పడుతున్నాడు. లోలోపల కుమిలి పోతున్నాడు.

కానీ భార్య ముందు మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నాడు.

"అనసూయా! అనసూయా! నా బిడ్డ నన్ను క్షమించింది.అదిగో! నా కోసం వస్తోంది.

ఎంతో ఉన్నత స్థితిలో ఉంది. తెలుసా! తను రాగానే చేతులు పట్టుకుని క్షమాపణలు అడుగుతా. తెల్లవారు జామున కల నిజమౌతుందట.''. అటూ ఇటూ కాని నిద్రావస్థలో అంటున్న భర్త మాటలకు ఆశ్చర్యపోయింది.

"ఏమండీ! ఏమిటా పరాకు మాటలు!"

గబగబా భర్త మంచం దగ్గరకు వెళ్ళి గట్టిగా భుజం ఊపుతూ తట్టిలేపింది.

"అనసూయా! నా బిడ్డను దాని పసిదాని మనసును క్షోభ పెట్టాను.నేను పాపిష్టి వాడిని నన్ను క్షమించు! ఆ

**"అనసూయా! నా బిడ్డను దాని పసిదాని మనసును క్షోభ పెట్టాను.నేను పాపిష్టి వాడిని నన్ను క్షమించు! ఆ మాటలు విన్న అనసూయకు ఏమనాలో తోచలేదు.ఇన్నాళ్ళకు భర్తలో వచ్చిన మార్పుకు సంతోషించాలా? క్షమించరాని తప్పు చేసి చేజేతులా దూరం చేసుకున్నందుకు కోపగించుకోవాలో తెలియడం లేదు.**

మాటలు విన్న అనసూయకు ఏమనాలో తోచలేదు.ఇన్నాళ్ళకు భర్తలో వచ్చిన మార్పుకు సంతోషించాలా? క్షమించరాని తప్పు చేసి చేజేతులా దూరం చేసుకున్నందుకు కోపగించుకోవాలో తెలియడం లేదు.

ఉందో లేదో తెలియని బిడ్డ గురించి పడే బాధ ఈ జన్మకు తీరుతుందా? బిడ్డను గురించి అనుకోగానే కన్నపేగు విలవిల్లాడింది.

సరిగ్గా పదిగంటల సమయం. తలుపు చప్పుడు. "ఏమండీ! ఎవరో తలుపు తడుతున్నారు. అన్న మాటలకు సోఫాలో కూర్చుని టివి చూస్తున్న అనసూయ భర్త వెళ్ళి తీశాడు.

ఎదురుగా ఓ యువతి. తన సహన పోలికలతో... "సహనేనా? చిన్నప్పటి బిడ్డ ముఖం గుర్తు తెచ్చుకుని పోల్చి చూస్తూ.. 'కలా! నిజమా?' గిల్లి చూసుకుంటూ శిలలా నిలబడి పోయాడు.

నిశ్చేష్టుడైన అతన్ని చూసి

"మీ అమ్మాయే! ప్రసాద్ గారూ! సందేహం లేదు" వెనకనుండి మాట్లాడుతున్న వ్యక్తి ఎవరో తెలియక అయోమయంలో పడిపోయాడు.

వంగి కాళ్ళకు దండం పెడుతున్న సహన తలపై వెచ్చని కన్నీటి బొట్లు...

"నన్ను క్షమించు తల్లీ!" జోడించిన చేతులను పట్టుకుంది.లోపల్నించి వచ్చిన అనసూయ కళ్ళలో కోటి పున్నముల వెలుగు.

ఎన్నేళ్ళ నుంచో ఉగ్గబట్టుకున్న కన్నీళ్ళు వరదలై సహనను తడిపేశాయి.

ఆ వెనుకనే అనసూయ స్నేహితురాలు ధరణి.

"ఇంకా ఎందుకు ఏడుస్తావ్ అనూ! బాధ పడకు! నీ బిడ్డ నీ చెంతకు చేరింది కదా! భుజం తట్టింది.

"ఈ చిట్టి తల్లిని ఆరోజు నేను జంపన్న వాగు దగ్గర చూడబట్టి సరిపోయింది. లేదంటే ఏమయ్యేదో...

ఆరోజు మీ దగ్గరకు తీసుకొచ్చి దింపుతానంటే అస్సలు వద్దని ఏడ్చింది. "మా నాన్నకు నేనంటే ఇష్టం లేదు. మీరు నన్ను అక్కడకు పంపొద్దు" అన్న మాటలకు మా హృదయం ద్రవించింది. మాతో పాటు హైదరాబాద్ తీసుకుని వెళ్లి పోయాం. ఇంట్లో మాకు భారం కాకూడదని ఎంత బతిమిలాడినా

"అనాధాశ్రమంలో ఉంటానంది. అక్కడే ఉండి చదువుకుంది. వయసుకు మించిన తెలివితేటలు ఉన్నాయి.చదువుల తల్లి సరస్వతి తాను"

"ఈరోజు తానో ఐ.ఏ.ఎస్ ఆఫీసర్ గా సెలెక్ట్ అయ్యింది తెలుసా! ఆడపిల్లలు ఎందులోనూ తీసిపోరని ఋజువు చేసింది. మాకు తన వల్లే సమాజంలో మరింత గౌరవం లభించింది."

అదే సమయంలో అక్కడికి వచ్చిన కొడుకు కృష్ణ వాళ్ళ మాటలు వింటూ సిగ్గుతో తల దించుకున్నాడు.

కొడుకలా తలవంచుకోవడం చూసి అనసూయ ఆశ్చర్యపోయింది.''ఇకనైనా వాడిలో మార్పు వస్తే బాగుండు'' అనుకుంది.

★ ★ ★

తన కల నిజమైనందుకు ఓ పక్క సంతోషం,మరో వైపు తాను చేసిన తప్పు, ఆడపిల్ల అని చూపిన వివక్షత గుర్తుకు వచ్చి ప్రసాదులో అంతులేని పశ్చాత్తాపం.

"నా బిడ్డ నన్ను క్షమించిందా?ఎందుకు క్షమించదు? ఆడపిల్లలది అమ్మ మనసు.. అనుకుంటూ భార్య స్నేహితురాలైన ధరణికి చేతులు జోడించి కృతజ్ఞతలు తెలియజేశాడు.



కవిత

# పాకశాస్త్ర ప్రవీణ



డా॥ సరోజ వింజామర, 80997 21928

చేసేది వంటే కదా అని తేలికా!
వంటపనే కదా అని చిన్న చూపా
ఎన్ని మేళవిస్తే వంట
ఎంత నైపుణ్యం ఉంటే వంటపని

ఏ సుగంధ దినుసులతో ఎంత పరిమళం
ఎంత ఉప్పూ కారాలనే అరచేతి గణితం
దేనితో వంటకు రంగు
దేనిలో ఏ ఔషధ తత్త్వం
షడ్రుచుల పోపాళింపులతో
ఇల్లంతా ఘుమఘుమలు
వృధా చేయని ఆర్థికవేత్తల అత్తెసర్లు
చిట్కాలతో చిటికెలో
పులిహోర దద్దోజనాలు

ఏ శరీరానికి ఎటువంటి తిండి
ఏ జబ్బుకు ఏం వంటకం
ఏ పూటకు ఏ ఆహారం
ఏ కాలానికి ఏ కూర
ఏ పండుగకు ఏం ఆరగింపు
ఏ దేవునికి ఏ ప్రీతిపాత్రమైన నైవేద్యం
ఆమె మనకందించే ఔషధీయ ప్రసాదం
ప్రతి ఇంట్లో మెదిలే వైద్యురాలు

ఆహారంగా ఏది
పిండి వంటలేవి
ఘన పదార్థంగా ఏది ఇవ్వాలి
రసాలుగా ఏవి పంచాలి
తక్షణం తినగలిగినవి
ఏడాదిపాటూ నిలవుంచవలసినవి
ఏ సమయానికి ఏమివ్వాలి
వండకుండానే ఇవ్వాల్సినవేవి
ఆహార విద్య ఆమె సొంతం

ఒంటిచేత్తో వందమందికి వండి పెట్టే బామ్మలు
వారిననుసరిస్తూ కళను నేర్చుకునే కొత్తవారు
ఇంటివారందరికీ వారి వారి తీరుగా ఆహారాలు
ఒళ్ళు గుల్ల చేస్తున్న ఆధునిక తిళ్ళకు
చెక్ పెడుతూ
సంప్రదాయంతో ఆరోగ్యం నింపే
సాంస్కృతిక వారధులు

పాకశాస్త్రాన్ని తన పిల్లలద్వారా
తరాలకు అందించే వారసులు

బయట మీరు స్వేదం చిందిస్తే
వంటింట్లో ఆమె ఇంటిని నిర్మిస్తుంది
పనులిద్దరివీ గొప్పవే
ఇద్దరి ఆరాటం కూటికోసమే
నువ్వైనా అలసిన శరీరానికి విశ్రాంతినిస్తావు
ఆమె విశ్రాంతి
రేపటి వంట ఆలోచనలోనే
వాటి తయారీలోనే
నలభీములలా పేరు లేకున్నా
తనవారి ఆకలి తీర్చి తృప్తి పడే
ప్రతి ఇంటి పాకశాస్త్ర ప్రావీణ్యురాలు

చిన్ననాడు ఉగ్గు ఐనా
ముదిమిలో జావ ఐనా
ఆమె చేతి చలవే.
ఏ బడులూ నేర్పకున్నా
ఓరిమితో చూసి నేర్చుకునే
ఏ శిక్షణలు లేకుండా నిపుణులుగా మారే
తరాల వంశానుగత పరంపరగా
కమ్మగా నోటికందిస్తున్న
అమృత హస్తాలను
కడుపున మోసి కడుపు నింపిన
అమ్మ, ఇల్లాలు, ఆడబిడ్డలను
గర్వంగా మొక్కాల్సిందే.

వ్యాసం

# నిన్నా నేడు
# స్త్రీల రచనలు - సమాలోచనలు

ఇది మహిళా ఆవిష్కరణ యుగం...




అనిసెట్టి రజిత
98494 82462


వంద సంవత్సరాలపైన ప్రపంచవ్యాప్తంగా స్త్రీల పోరాట రూపాల్నీ, సాహసపు గమనాల్నీ, ఉద్యమ చేతనలనూ, వారు దాటి వచ్చిన మైలు రాళ్ళనూ చూస్తున్నాం. శతాబ్దకాలంతో నడిచి వచ్చిన మహిళా చేతన, స్త్రీలు నిర్జన వారధులుగా నిశ్శబ్ద ఒంటరితనాల గూళ్లలో, కృష్ణపక్షంలో నిలబడిపోయిన సమయాల నుండి ఇప్పుడు సామాజిక అభ్యుదయం అభివృద్ధికి సారధులుగా రూపొందిన చరిత్రనూ చూస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా తమ హక్కుల కోసం ఉద్యమించి సాధించుకున్న సమానత్వపు ఆత్మగౌరవపు ఘోషల్నీ వింటూనే ఉన్నాం.

ప్రాచీన కాలం నుండి సాహిత్య రంగంలోకి ప్రవేశించడానికి, సామాజిక అనారాచాలను ఎదురించడానికి స్త్రీలు సాహసం చేస్తూనే ఉన్నారు. ఓటములు ఎదురైనా తమ పట్టును విడవకుండా వారి అస్తిత్వాన్ని ప్రకటిస్తూనే ఉన్నారు. స్త్రీలుగా 'ఆత్మవికాసం, పునర్వికాసం' చెందే దశాబ్దాలనూ, ఈ కాలంలో స్త్రీల సాహితీ సృజననూ వెలుగుతున్న కళ్ళతో, ఉప్పొంగుతున్న హృదయాలతో వీక్షిస్తూనే ఉన్నాం. అన్ని సాహిత్య ప్రక్రియలూ స్త్రీల చేతుల్లో విశిష్టతలనూ సార్వజనీనతనూ సాధించి వారు అనుభవించిన కష్టాలనూ, చెరలనూ పటాపంచలు చేయడం, అది గురజాడవారు చెప్పినట్లుగా ఆధునిక మహిళ యుగ చరిత్రను తిరగరాసే నూతన ఆవిష్కరణగా నిలవడం స్త్రీత్వపు సాఫల్యతకు గర్వకారణంగా ఉన్నది.

లైంగిక రాజకీయాలను ఛేధించే జండర్ దృక్పథాలు ప్రధాన కేంద్రంగా వ్యక్తిగతాలను అంతర్గతం నుండి విశాలమైన జీవన కాన్వాస్ మీదికి తెచ్చి రహదారుల్ని వేసుకొనే పనిలో రచయిత్రులూ, సాంస్కృతిక కార్యకర్తలూ కదనోత్సాహులై పురోగాములవుతున్న సందర్భం ఇది.

వాస్తవిక పరిస్థితులను, అనుభవాల నుండి అన్వయించుకొని భిన్న అస్తిత్వాలను, భిన్న దృక్పథాలతో క్రోడీకరించుకుంటూ భిన్న సవాళ్ళను ఎదుర్కొంటూ, ఛేదిస్తూ రచనారంగంలో సాహసోపేతంగా నవ్యతనూ, సవ్యతనూ సాధించి తమను తాము నిరూపించు కుంటున్నారు స్త్రీలు..

ఈ వ్యవస్థ పూర్వం నుండీ మనకు ఒకే ఒక కథను శిలాశాసనంలా చేసి చూపిస్తూ అదే నిజం అని నమ్మిస్తున్నారు.. మనతో కూడా పరంపరగా అదే కథ పలికిస్తున్నారు. కానీ ఒకే ఒక కథంటూ ఉంటుందా.. ఎప్పటికీ ఒకే కథ సజీవత కలిగి ఉంటుందా.. అది స్త్రీల గురించి ఒక అబద్ధపు కథ, తప్పుడు కథ, తక్కువతనపు కథ అయి ఉండవచ్చు. మనమీ రాతిబండలా గుదిబండలా మారిన ఆ కథను బద్దలు కొట్టి పనికిమాలినదని పనికిరానిదని నిరూపించాలి.

★ ★ ★

భారతదేశంలో రచయిత్రుల, సంస్కర్తల ప్రయాణం నల్లేరు మీద నడకలా సాగింది కాదు. శతాబ్దాలుగా అంటే 600 బి.సి. నుండి నేటి వరకు అక్షర సేద్యం చేయడానికి స్త్రీలు చెల్లించిన మూల్యం జీవిత కాలం కూడా అయి ఉండవచ్చు. నిర్బంధాలు, వెలివేతలూ, శిక్షలూ తట్టుకొని తమ మార్గం తాము వేస్తుకున్న వీరాంగనలు స్త్రీలు. వాళ్ళు ఎదుర్కొన్న అవమానాలు అడ్డంకులు, సవాళ్ళు, భయానక పరిస్థితులూ, ప్రతిఘటనలూ ఆ ప్రయాణం ప్రమాదకరంగా సాగిన దారులు అయినా ఆ పరిస్థితులు నేటికీ మారలేదు, ఆ వెతలూ సమసిపోలేదు. రచనారంగంలో స్త్రీల అక్షర వ్యవసాయం ఈనాటికీ పెద్ద సవాల్.

అయితే బలంగా కొనసాగుతున్న అణిచివేతనూ, దాని ఆచరణాత్మక రూపమైన పెత్తనాలను వెనకా ముందూ చూసుకుంటూ ప్రణాళికాబద్ధంగా, వ్యూహాత్మకంగా విసిరికొడ్తూ ప్రయాణం ఆగకుండా కొనసాగిస్తూ చేస్తున్నారు సమాలోచనలూ, సమూహ గానాలు! సాగర మథనాల నుండి విషానికి విషం, అమృతానికి అమృతం వేరు చేసి చూపిస్తున్నారు. ఇది మహిళావిష్కరణ యుగం!

నీలి మేఘాలను తాకుతూ, సరిహద్దులులేని సంధ్యల్ని చిత్రిస్తున్నారు.. దారులేసిన అక్షరాలను సృజిస్తూ మాకు గోడలు లేవని ప్రకటిస్తున్నారు. తొలి అడుగులను గుర్తించి నమస్కరిస్తూ ఈ శతాబ్దాపు భారతీయ మహిళల రచనల్ని వెలికితెచ్చి స్త్రీవాద రాజకీయాలు ఎజెండాగా వర్తమాన సారస్వతాన్ని చర్చిస్తున్నారు. ఆధునిక తెలుగు స్త్రీల సాహిత్యాన్ని మెరిపిస్తూ మురిపిస్తున్నారు, సృజన విమర్శశక్తులుగా రాణిస్తున్నారు, తీరొక్క పువ్వులను గుదిగుచ్చి పరిమళాలుగా వ్యాపిస్తున్నారు.

దీనికి సాక్ష్యంగా 1970 నుండీ అగ్నిజ్వాలల్లా విస్తరిస్తున్న సాహిత్య, సామాజిక ఉద్యమాలలో స్త్రీలు విరివిగా పాల్గొంటుండటమేనని గుర్తించాలి. ఈ నేపథ్యంలో సాహిత్య చరిత్రతో కలిసిన స్త్రీల ప్రయాణం సుదీర్ఘమైనది. ఒంటరి ధిక్కార స్వరాలు, సమూహ చైతన్యగానాలు, మౌన విస్ఫోటనాలు అంతా తిరగబడే తిరుగుబాటు పథమే. నిర్మాణం, ప్రాకృతిక వనరుల రక్షణ స్త్రీలదైతే, పడగొట్టడం, నశింపజేయడం పురుష పెత్తందారుల స్వభావంలోని ఒక అరాచక కోణంగా ఉంటూ వస్తున్నది. ఇదొక చరిత్ర పార్శ్వమైతే అణిచివేతా విధ్వంసపు దాడులతో కుల-వర్గ-వర్ణ శ్రేణులు ద్వేషం చిమ్ముతూ మూడు విషసర్పాలై కాటు వేస్తూ సమాజంలోని సాంఘిక, మత సమన్వయాల జీవన విధానాలను తగలబెడుతున్న చరిత్ర కోణం మరో పార్శ్వం ఒకటి. వీటికి తోడుగా తోడుగుగా కుటుంబపరంగా, సమాజ, రాజ్యపరంగా హింసలు, అత్యాచారాలు స్త్రీలపై అనునిత్యం అమలవుతున్న దౌర్జన్యాల దుస్థితి.

అయినా కొండలంత శిధిలరాశుల కింద కప్పిపెట్టబడిన స్త్రీల చైతన్య స్పృహలు పెనుగులాడుతూ, మనోధైర్యాలనూ, భౌతిక, నైతిక శక్తుల్నీ కూడగట్టుకుంటూ చిరు అంకురాల్లా పైకి ఎక్కివస్తూ శిఖరారోహణలకు అక్షరాల తోవలను వేసుకుంటుండటం ఒక మహోజ్వలమైన కాల పరిణామం. వెలుగుల చరిత్రకు వేయి సుస్వరాల స్వాగత గీతం. ఇదంతా స్త్రీ వ్యక్తిత్వం ఉద్యమ ప్రవాహమై సజీవ నదిలా తరంగించడం కాక మరేమిటి ?

★ ★ ★

స్త్రీవాదం - దళితవాదం సాహిత్యరంగంలో ప్రవేశించడంతో స్త్రీలూ, దళితులూ భిన్న అస్తిత్వాల స్పృహతో, భిన్న దృక్పథాలతో రచనలు చేయడం ప్రారంభమయ్యింది. సామాజికుల, సాహిత్యకారుల ప్రాపంచిక దృక్పథంలో మార్పులు చోటు చేసుకుంటూ మూస రచనల్లోకి కొత్త అంశాలు ప్రవేశించాయి. అన్ని వర్గాల స్త్రీలు అస్తిత్వ స్పృహతో రచనా రంగాన్ని ఎంచుకొని తమ భావ ప్రకటన చేయడం ఒక చారిత్రక పరిణామం. ఈ రోజున స్త్రీ వాద దృక్పథం నుండి వర్తమాన రాజకీయ చర్చలు జరుగుతుండటం అవసరమైన పరిణామం. ఎందుకంటే స్త్రీల వ్యక్తిగతమంతా సాంఘిక- ఆర్థిక - కుల- రాజకీయ శాస్త్రమేనని తెలుసుకున్నారు కాబట్టి. అయితే ఈ సైద్ధాంతిక చర్చలు ఒకసారి ఒక రుతువులో జరిగి ఆగిపోకూడదనవి. ఎప్పటికప్పుడు పరిశీలనకూ పరిశోధనకూ పదును పెడుతూ ఆయా భాషల్లోని పత్రికల్లోని రచనల వల్ల విషయాలు తెలుసుకుంటూ ఉండాలి. ఈ రోజున జండర్ అధ్యయాల ప్రాముఖ్యత పెరిగింది. స్త్రీవాద సాహిత్య సామాజిక ఉద్యమాల ప్రభావంతో కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో స్త్రీల అభ్యున్నతి, అభివృద్ధికోసం అధ్యయన కేంద్రాలూ, శాఖలూ, పాఠ్యాంశాలూ ప్రవేశపెట్టారని గమనించాలి. గత 30-40 సంవత్సరాలుగా స్త్రీల పరిశోధన, అధ్యయన కేంద్రాలు మన సమాజం సంస్కృతులు, స్త్రీల నిత్య జీవితాలను స్త్రీవాద కోణం నుండి అర్థం చేసుకునేందుకు సామాజిక శాస్త్రాల పరిధులను ప్రశ్నిస్తున్నాయి. ప్రజాస్వామిక సంస్కృతిని నిలబెట్టుకోవడానికి నిత్యం ప్రయత్నిస్తున్నాయి. స్త్రీవాద రాజకీయాలలో ఉద్యమాలలో ఎదురయ్యే సవాళ్ళను, ప్రశ్నలను, ఎదుర్కొంటున్న సమస్యలను విశ్లేషించే విశ్లేషణాత్మక రచనలను సంకలనం చేసి ప్రచురిస్తున్నారు.

ఎన్నో అవాంతరాలకోర్చి కొన ఊపిరిదాకా గాయాలతో ఉండే నేటి దాకా తమ సాహిత్య సంపదను మనదాకా తెచ్చిన మన ప్రాచీన రచయిత్రుల ధీరత్వాన్నీ, వారి రచనా స్ఫూర్తినీ మరి కొన్ని దశాబ్దాల పాటు కాల పరిస్థితులకు అనుగుణంగా ముందుకు తీసుకుపోతూ ముందు తరాలకు చేరేలా చేయడం రచయిత్రులందరి బాధ్యతా కర్తవ్యం.

చరిత్రలో మహిళల రచనల పేజీలు ఎన్నో ఖాళీగా ఉన్నాయి. వాటిని పూడ్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పరిశోధనలకు పెద్ద పీట (కుర్చీ) వేస్తున్న కాలం ఇది.. తొలి అడుగులు వేస్తూ నిప్పుల గుండాలు తొక్కుతూ వచ్చిన రచయిత్రుల గురించి క్షుణ్ణంగా తెలుసుకుంటూ ప్రాచీన తెలుగు కవయిత్రుల నుండి ఈ ఆధునిక యుగం కవయిత్రుల దాకా చదివి తెలుసుకోవడం ముఖ్యమైన పని. కథా కవితారామాల్లో, నవలా పుటల్లో పూలతావుల్లా ఉన్న రచయిత్రుల రచనల్ని సేకరించి చదవాలి. విమర్శా వ్యాసాలు రాయాలి, స్త్రీల ఆత్మకథలూ వచ్చాయి వస్తున్నాయి, అవి చదివి తీరాలి. జ్ఞాన విస్తరణ జరుగుతుంది. మన గురించి మనం సగర్వంగా తెలుసుకుంటాం.

సాహిత్య పరిశోధనలూ, సమీకరణలూ, సేకరణా అధ్యయనాలు, విశ్లేషణలూ, ప్రచురణలూ ఊపందుకున్న కాలం ఇది. కొత్త భావజాలంతో అస్తిత్వాలు కొత్త నీటి ప్రవాహాలై ఉరకలెత్తుతున్న వాతావరణంలో ఉన్నాం మనం. సామాజిక సందేశాలను దోసిళ్ళ కొద్దీ చెలిమె నీరులా తాగిస్తూ సృజన సాహిత్యాన్ని సౌందర్యమయం చేస్తున్న సాహిత్యం పండుతున్న సమయం ఇది. జీవన మాధుర్యాన్ని రాగాలాపన చేస్తున్నది సమిష్టి జీవన ప్రయాణం. పువ్వులు తీరుతీరువైనా, అస్తిత్వాలు భిన్నమైనవయినా, రంగులు అనేకం అయినా కలిపి గుత్తుల్లా, గుల్దస్తాల్లా కడితే ఆ ప్రాకృతిక అందం ఒక దార్శనీయతను అద్భుత సాకారంగా చేస్తుంది. ఆ కాలం ఇదే! ఆ సృజన సాధకులం మనమే!

ముఖాముఖి

# కట్టుకథలు నీటి బుడగలు
## - తాయమ్మ కరుణ

ఉద్యమమే జీవితం అయిన తాయమ్మ కరుణతో
వెల్దండి శ్రీధర్ ఈ మాసం ముఖాముఖి...

తాను నమ్మిన సిద్ధాంతాన్ని అక్షరాల ఆచరించిన వ్యక్తిత్వం తాయమ్మ కరుణది. సామాజిక రంగంలో సాహిత్య రంగంలో ఆమె వ్యవసాయం ఫల సాయం కోరనిది. తన జీవనయానాన్ని సాహిత్య అనుభవాన్ని దానితోపాటు తన పరిణామాన్ని, కథీకరణతో తాను కొనసాగిన విధానాన్ని, మా పాఠకులతో పంచుకుంది తాయమ్మ కరుణ. ఆమె అంతరంగాన్ని వెల్దండి శ్రీధర్ ఆవిష్కరించిన విధానం చూడండి ఈ మాసం....

**మీ కుటుంబ నేపథ్యం ఏమిటి?**

మాది చేనేత వృత్తి అయినప్పటికీ తాతల కాలం నుంచి వారసత్వంగా వచ్చిన వైద్యాన్నే మా నాయిన ప్రధాన వృత్తిగా చేశారు. అలాగే వ్యవసాయమూ చేశారు. నేను పుట్టేనాటికి మాది ఎగువ మధ్యతరగతి కుటుంబం. నేను పెద్దయ్యేనాటికి దిగువ మధ్యతరగతి కుటుంబంగా మారిపోయింది. ఆస్తులన్ని హరించుకుపోయాయి.

మా నాయిన మా తాటికల్ (నకిరేకల్ మండలం, నల్లగొండ జిల్లా) గ్రామ మొదటి సర్పంచ్. ఆ తర్వాత మరో మూడుసార్లు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారట. "ఎప్పుడూ నువ్వే వుంటవానే" అన్నందుకు అతనినే సర్పంచిగా నిలబెట్టి, రాజకీయాల నుంచి తప్పుకున్నారు. అంతేకాదు, చంద్రపుల్లారెడ్డి గ్రూప్‌లో మా నాయిన స్థానిక నాయకుడిగా పనిచేశారు. జనశక్తి పార్టీలో ఆయన స్థాయి ఏమిటనేది నాకు తెలియదు కానీ ఈ మధ్యే ఒక అన్న ద్వారా తెలిసింది - చాలా ప్లీనరీలలో పాల్గొన్నాడని, చంద్రపుల్లారెడ్డికి దగ్గరగా ఉండేవాడని. బంద్రు నర్సింహులు, యానాల మల్లారెడ్డిలతో కలిసి పనిచేశారు. నేను పుట్టకముందే మా ఇంటి మీద పోలీసుల దాడులు జరిగాయి. ఊరిని, ఇంటిని చుట్టుముట్టి పోలీసులు ఇంట్లో



సోదాలు చేశారట. నిజానికి పోలీసుల ఈ సోదాకు కొద్దిసమయం ముందే పార్టీ నాయకుడిని తీసుకుని మా నాయిన ఊరుదాటాడట.

పార్టీ వద్దన్నదని కాంట్రాక్టర్‌గా వున్న మా నాయన... ఆ పనుల నుంచి తప్పుకున్నారట. అడిగిన వారందరికీ ఇస్తూ పోయారు. అందువల్ల పొలాలు, ఆస్తులు లేకుండా పోయాయి. ప్రజల మనిషిగా మాత్రం గుర్తింపు తెచ్చుకున్నారు. కానీ, ఇంట్లో మా అమ్మ పట్ల అందరిలాగే ఆనాటి మామూలు భర్తల్లాగే చాలా దుర్మార్గంగా వ్యవహరించారు. వడ్ల మిల్లు పడుతూ మా అమ్మనే ఇంటినంతా నడిపింది. ('తాయమ్మ కథ'లో ఇంట్లోని మా నాయిననే రాశాను కానీ, బయట ఆయన మంచితనం గురించి రాయలేదు. ఇప్పుడైతే ఆ కథను వేరేలాగా రాసేదాన్ని. మా గ్రామం, పరిసర గ్రామాల ప్రజలను కలిసి మాట్లాడి, మా నాయిన గురించి చిన్న పుస్తకమైనా వెలువరించాలని అనుకుంటున్నా).

మా అమ్మ కూడా తన చిన్నతనాన తెలంగాణ సాయుధ పోరాట దళాలకు సెంట్రీలు చేసిందట. అట్లా అమ్మానాయిన ఇద్దరూ ఉద్యమంలో పనిచేసినవారు కావడం వల్లనేమో... నేనూ ఉద్యమాలబాట పట్టాను.

**మీరు సాహిత్యరంగంలోకి ఎలా వచ్చారు?**

ఒక్కమాటలో చెప్పాలంటే ఉద్యమం తోనే నా అసలైన సాహిత్య ప్రపంచం మొదలైంది.

చిన్నతనంలో 'చందమామ' కథలు... టెన్త్‌కు వచ్చేసరికి డిటెక్టివ్ నవలలు, యండమూరి వీరేంద్రనాథ్ నవలలు చదివేదాన్ని. కానీ అవి నచ్చలేదు. ముఖ్యంగా ఆ 'తులసీదళం' తర్వాత ఆయనవి దాదాపు చదవలేదు. డిగ్రీ తర్వాత మహిళా పోరాటాల్లో పాల్గొంటుండటం వల్ల మళ్లీ సాహిత్యం చదవడం మొదలైంది. ముఖ్యంగా మతం రవికుమార్ (మంజీర)ను పెళ్లి చేసుకోవడంతో అంటే... ఉద్యమంలోకి

పూర్తికాలం కార్యకర్తగా వెళ్లడంతో నా సాహిత్య ప్రస్థానం మొదలైంది.

మంజీర స్వతహాగా తను కవి, రచయిత, వ్యాసకర్త. దీనికితోడు మమ్మల్ని రెగ్యులర్‌గా కలిసే ఐ.వి. సాంబశివరావు మాస్టారు. మా మంజీర (రవి) రూమ్‌లో నేను వెళ్లేనాటికే బోలెడన్ని పుస్తకాలు వున్నవి. వాటిని చదవడంతో పాటు మాస్టారుతో జరిగే సాహిత్య చర్చలు, సాయంత్రాలు రోడ్ల వెంట తిప్పుతూ కథలపై మంజీర చెప్పే విశ్లేషణలు... నా సాహిత్య అభిలాషను మేల్కొలిపాయని అనుకుంటున్న. వీటన్నిటికి మించి మా అమ్మ 'ముచ్చట' బాగా చెప్పేది. అమ్మ ముచ్చట చెప్పేటప్పుడు తెలియకుండానే అమ్మ చేయిని పట్టుకుని ఆ 'కథ' వెంట నడిచేదాన్ని. అమ్మ ముచ్చట ఎట్లా చెప్పేదంటే.. 'బిడ్డా...! అయ్యాల... ఆడున్న మనిషి ఈడికి కనిపిస్తలేదు. అంత మంచు కురుస్తుండే' అని మొదలుపెట్టేది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. బహుశా అమ్మ 'ముచ్చట' చిన్నప్పటి నుంచి నాపై ప్రభావం చూపింది. అందుకే కథను నేను ముచ్చట చెప్తున్నట్టే రాస్తాను. అలాగే రావిశాస్త్రి గారి కథ చెప్పే పద్ధతి కూడా నా మీద నన్ను అమితంగా ఆకట్టుకున్నది. నాకేమీ తెలియదు, పాత్రలే నాచేత కథ రాయిస్తున్నాయి అన్నట్టు ఉంటాయి ఆయన కథలు.

**మీ సాహిత్యకృషిని గురించి చెప్పండి?**

1994లో మొదటిసారి 'తాయమ్మ కథ' రాసాను. అది మూడేండ్లకు 1996లో 'మహిళామార్గం'లో అచ్చు అయింది. ఇదే, నా మొదటి కథ. కానీ 'తాయమ్మకథ' ప్రింట్ అవ్వని ఈ మూడేళ్ల కాలంలో నేను రాసిన కథలు కొన్ని 'అరుణతార' మాసపత్రికలో మొదట ప్రింటయ్యాయి. పూర్తికాలం కార్యకర్తగా అడవిలో, దళాల్లో పని చేస్తున్న కాలంలో అసలు తీరిక దొరికేది కాదు. నడక, ప్రజలతో సమావేశాలు, సెంట్రీలు, తప్పక చదవాల్సిన పుస్తకాలు... రోజుకి 6 గంటల నిద్ర పోవడమే అరుదు. 1994 నుంచి ఈ 30 ఏళ్ల కాలంలో 50 కథలు కూడా రాయలేదు నేను. చాలా తక్కువగా రాసాను. ఇంకా చాలా రాయాల్సి ఉండె. ఏదో ఒకటిలే అని రాయలేనితనం. అంతేకాక, బయటికి వచ్చి ఉంటున్న క్రమంలో నా జీవిక కోసం నేను పడుతున్న యాతనలో మరో కారణం.

ఒకోసారి సమయం దొరికినా... గ్లోబలైజేషన్ ప్రభావం, మారుతున్న మనుషులు... ఎవరు అమాయకంగా కనిపిస్తారో వారి మీద చేతులు పెట్టడం, మోసగించడం తప్పు కాదనే భావన... తోటి మనిషిపట్ల బాధ్యతలేనితనం, ఎంతకైనా దిగజారేతనం. కీర్తి, డబ్బు సంపాదన కోసం ఎంతకైనా తెగించడం... వెనకటికి ఎవరో గుప్పెడుమంది పెత్తం దార్లు చేసేదానిని ఇప్పుడూ సామాన్యులు కూడా చేసే స్థితికి చేరుకోవడం - మోతాదుల్లో తేడాలు ఉండవచ్చుకానీ... మోసపోయిన వాడినే తెలివితక్కువ వాడిగా నిందించడం, మోసగించినవాడిని తెలివైన వాడిగా భావిస్తుండటం... విలువలన్నీ తారుమారవుతున్న కాలం... ఈ మార్పంతా కథల్లో రావాలి. రాయాల్సిన ఈ అసలైన కథలను ఎక్కడ పట్టుకోవాలో దిక్కుతోచనితనం. ఇవి నన్ను అతలాకుతలం చేస్తున్నవి. వీటి నుంచి బయటపడినప్పుడు మరికొన్ని కథలు రాయగలనేమో.

మరో విషయం, గతంలో నేను ఒక కథ ('కథ రాయాలబ్బా')లో చెప్పినట్టుగా... 'మనసు, శరీరం సరళ రేఖపై ఉన్నప్పుడే కథలు రాయగలం'. రకరకాల ఒత్తిడుల ప్రభావం వల్ల కథలు చదవడమూ లేదు, అందువల్ల రాయడమూ లేదు. నన్ను నేను కూడగట్టుకునే క్రమంలో (బయటకు వచ్చి 17 ఏండ్లు అయినా) ఇంకా ఉన్నాను.

**తెలుగు సాహిత్యంలో ఇప్పుడు ఏ వాదం నడుస్తున్నదని మీరు అనుకుంటున్నారు? స్త్రీవాదం పని అయిపోయిందా?**

నాకు తెలిసినంత మేరకు... అస్తిత్వవాదం నడుస్తున్నదని అనుకుంటున్న. ఇక స్త్రీవాదం గురించి... ఆ తరం వారు తాము ఎదుర్కొన్న పితృస్వామ్యానికి వ్యతిరేకంగా సాహిత్యసృష్టి చేశారు. పితృస్వామ్య భావజాలంపైనే ఎంతకాలమని రాయగలరు? ఆ పితృస్వామ్య భావజాలం కూడా కులాలను బట్టి, వర్గాలను బట్టి తేడాలతో ఉన్నది. శ్రామిక మహిళకు మొగుడి చేసే ఆధిపత్యం కన్నా పనికి తగిన పైకం ఇవ్వకపోవడమే ప్రధాన సమస్యగా ఉంటుంది. తనను హింసించే మొగుడి కష్టాన్ని కూడా దోచుకునే దొరలున్నారు. కాబట్టి ఉమ్మడి సమస్యపై తక్షణ పోరాటం చెయ్యగలదు. తన కడుపు నిండితేనే ఏ పోరాటమైనా. ఒక ఉదాహరణ: 'పైటను తగలెయ్యమని' ఒక కవయిత్రి రాసింది. పైట ఎన్ని రకాలుగా శ్రామిక మహిళలకు ఉపయోగ పడుతుందో, అది ఎంత అవసరమో జూపాక సుభద్ర తన కవితలో విప్పిచెప్పింది. అదీ శ్రామిక, ఉన్నత వర్గాల; అగ్రవర్ణ, కింది కులాల మహిళలకు ఉన్న తేడా. సాంప్రదాయాలు కూడా మహిళలందరికీ ఒకే రకంగా లేవు - అందరికీ తెలిసిన విషయమే.

ఒకప్పటి వరకట్నపు సమస్య ఇప్పుడు చాలా తగ్గింది. తల్లిదండ్రులు అమ్మాయి లను చదివిస్తున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు కాబట్టి ఆమేరకు స్త్రీలకు



ఆర్థిక స్వాతంత్ర్యమూ ఉంటోంది. ఆడపిల్ల అనగానే 'హత్య' (అబార్షన్)లు చేసీ చేసీ వారి సంఖ్య తగ్గిపోయింది. అందువల్ల ఆడపిల్లల కొరతా ఏర్పడింది. ఇప్పుడు ఏ సంతానమైనా ఒకటే అనే భావనకు చేరుకుంటున్నది సమాజం. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలోనూ ఎక్కువమంది పిల్లలను కనలేని పరిస్థితి. మారిన సమాజంతోపాటు పితృస్వామ్య భావజాలం కూడా మరో రూపంలోకి మారింది. కానీ పూర్తి రూపుమాసిపోలేదు. స్త్రీవాదం ఉధృతి తగ్గిందని భావిస్తున్న.

ఇక, పోరాటానికి లక్ష్యం ఉంటుంది. స్త్రీ పురుష సమానత్వం కావాలంటే, పితృస్వామ్య భావజాలం నశించాలంటే పోరాడాలి. సహజంగానే ఆ పోరాటం అన్నిరంగాల్లో - రాజ్యంతో సహా - చేయాల్సి ఉంటుంది.

**విప్లవవాదం కూడా అవుట్ డేటెడ్ అనే విమర్శ ఉంది. మీరేమంటారు?**

నిజమే. ఏదైనా అవుట్‌డేటెడ్ అవుతుంది. సమసమాజం వచ్చినప్పుడు, కమ్యూనిజం సాధించినప్పుడు - అందరికీ అన్నీ అందుబాటులో ఉన్నప్పుడు, స్త్రీ పురుష సమానత్వం వచ్చినప్పుడు, మొత్తంగా పోరాడాల్సిన అవసరం ప్రజలకు లేకుండా పోయినప్పుడు విప్లవవాదం కాదు, విప్లవమే అవుట్ డేటెడ్ అవుతుంది కదా.

**తెలుగు కథా ప్రయాణం ఎలా ఉందనుకుంటున్నారు?**

మొదటి కథ భండారు అచ్చమాంబదే అయినా పూర్వం మగవారే ఎక్కువ కథలు రాశారు. ఆనాడు మహిళలకు రాయడానికి వీలుకాని పరిస్థితులు. మహిళలు గురించీ మగవారే రాసారు. స్త్రీ, పురుష సంబంధాల గురించే సాహిత్య సృష్టి (నవలలు) ఎక్కువగా జరిగిందని నాకు అనిపిస్తది. తర్వాత క్రమంలో స్త్రీలు రాయడం ప్రారంభించారు. ఆ తర్వాత తమ వర్గ, కుల, అస్తిత్వాలను, వాటిల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలను కూడా కథలుగా రాస్తున్నారు మహిళలు. కానీ తెలంగాణ ప్రాంతంలో మాత్రం



ఎక్కువగా ఉద్యమ కథలు, తిరుగుబాటు కథలు ఎక్కువగా వచ్చాయి. తెలంగాణ ఉద్యమాల గడ్డ కదా. ఈ మధ్య కాలంలో 'దంపతీ వివాహ' వ్యవస్థను దాటిన కథలు కూడా వస్తున్నాయి - ఇలాంటి సంబంధాలు, సాహిత్యమూ స్త్రీలకు ఎప్పటికీ నష్టమే.

తెలుగు కథ అన్నారు కాబట్టి నేను 'వియ్యుక్క' గురించి తప్పక ప్రస్తావించాలి. 'వియ్యుక్క' అనేది గోండీ పదం. తెలుగులో 'వేగుచుక్క' అని అర్థం. విరసం ఈ 'వియ్యుక్క' 6 సంపుటాలను ఇటీవల వెలువరించింది. ఇందులో 350కు మించి కథలు ముద్రించబడ్డాయి. కానీ ఇంకా దొరకని పలు కథలు వున్నాయి. విప్లవోద్యమంలో పని చేసిన, చేస్తున్న, చేసి బయట వుంటున్న మొత్తంగా... 52 మంది మహిళలు రాసిన కథలు ఇవి. ఆదివాసీలు మహిళలు కూడా రాశారు. దాదాపు... సగానికి సగం తెలంగాణ మహిళా కామ్రేడ్స్ రాసిన కథలున్నాయి. ఈ సంపుటాల్లోని పలు కథలు ఎవరి ఊహకు కూడా తట్టనివి. ఎన్నడూ విననివి, కననివి. కొన్ని కథలు చదువుతున్నప్పుడు వాక్యం వెంట వాక్యం పరుగులు తీస్తారు, గసపోస్తారు. కొన్ని కథలను చదివితే...




రెండు కన్నీటిబొట్లు విడవకుండా ఉండలేరు. మళ్లొకసారి... ఇవి కేవలం మహిళలు మాత్రమే రాసిన కథలు. తెలుగు కథకు కొత్త చేర్పు ఇవి. వీటిని కలిపితేనే కానీ తెలుగు కథా ప్రయాణం పూర్తి అవ్వదు. కథకులు, విమర్శకులు ఈ కథలను చదివి తప్పక తమ అభిప్రాయాలను చెప్పాలని కూడా కోరుకుంటున్నా.

**తెలంగాణ కథ దశ దిశ ఏమిటి?**

నిజానికి 6వ ప్రశ్న కూడా దాదాపు ఇలాంటిదే కదా.

సమాజంలోని విషయాలే సాధారణంగా సాహిత్యంలోనూ ప్రతిఫలిస్తుంటాయి. సమాజం ఎప్పుడూ అభివృద్ధివైపే అడుగులు వేస్తుంది - అరాచక మున్నప్పటికీ. పాతదాన్ని బద్దలు కొడుతుంది. సాహిత్యమూ అంతే. మారిన, మారుతున్న సమాజాన్ని సరైన దిశలో నడిపించడానికి సంస్కర్తలు, మేధావులు, విప్లవోద్యమం ఎల్లప్పుడూ పని చేసింది, చేస్తుంది. ఎందుకు విప్లవోద్య మానికి కూడా ఆ క్రెడిట్ ఇవ్వాలి? అంటే, వారు నిస్వార్థంగా ఎన్నో కష్టాలకు ఓర్చి జీవితాలను పణంగా పెడుతున్నవారు. ఎందుకోసం తమ ప్రాణాలను ఇస్తున్నామో తెలిసినవారు. ప్రాణానికంటే మించినది ఏదీ లేదు కదా. ఏ పనీ చేసినా రాత్రి ఇంట్లో సుఖంగా నిద్రపోతున్నవారం మనం. ఎదుటి వ్యక్తితో ఏ ప్రయోజనమూ లేదు అనుకుంటే కనీసపు పలకరింపు, నవ్వు కూడా నవ్వలేని దుష్టసమాజం మనది. ఆస్తుల కోసం, కీర్తి కోసం తెగబడిన సమాజం ఇది. అవేవీ ఆశించకుండా ఇతరుల కోసం పనిచేస్తున్నారు కాబట్టి వారిని, వారి త్యాగాలను గుర్తించాలి. గుర్తించకపోతే

పోదాం. కనీసంగా వారి మీద రాళ్లేయకుంటే చాలు.

**తెలంగాణ కథకు శిల్పం లేదనే విమర్శ ఉంది. దీనికి మీరేమంటారు?**

నా దృష్టిలో... కథను వదలకుండా చదివించేదే శిల్పం. వినసొంపుగా ముచ్చట చెప్తుంటే ఎవరైనా చెవి ఒగ్గి వింటారు. తెలంగాణ వారు 'ముచ్చట' చెప్పడంలో ప్రవీణులు. అలాగే కథలు చెప్పడంలో కూడా. ఆకలి దప్పులతో, అణచివేతలకు వ్యతిరేకంగా ఎప్పుడూ పోరాటాల్లో మునిగి తేలిన, త్యాగాలకు వెరవని నిజాయితీ కలిగిన, ముక్కుసూటితనాన్ని వెన్ను పూసగా కలిగినది తెలంగాణ సమాజం. చూడ, చదవ నిరాకరించిన వారి నుంచి, తామే బాగా రాస్తామన్న అహం ఉన్నవారి నుంచి అలాంటి విమర్శనే ఉంటుంది మరి. ఇది ఒక రకంగా ఎదురుదాడి - అవతలి వారు తమను వేలెత్తి చూపకుండా ఉండటానికి లేదా అవతలి వారి చైతన్యాన్ని దెబ్బతీయడానికి. తెలంగాణ కథను చదివితే కదాశిల్పం ఉందా, లేదా అనే విషయం తెలిసేది. కొందరైనా కథను కథలాగా చూసేవారు ఉన్నారనుకోండి ఇప్పటికీ.

**మీరు ఈ మధ్య విప్లవోద్యమ అంతర్గత జీవితాన్ని ఎక్కువగా కథలుగా రాస్తున్నారు కదా! ఆ అనుభవాలు చెప్పండి?**

అవును, రాస్తున్నాను. బయట ఉంటున్న క్రమంలో నాకర్థమైనదేమంటే.... విప్లవోద్యమం లోపలి జీవితం చాలా మందికి తెలియదు, శత్రువులు చేసిన దుష్ప్రచార ప్రభావమే వారి మీద ఎక్కువగా ఉంది అని. ఉద్యమంలో 14 ఏండ్లు పనిచేసిన దానిగా నేను చూసిన వాటిని కథల రూపంలో, 'లోపల' ఎట్లా ఉంటారు, ఉంటుందో తెలియ చెప్పాలనిపించింది.

ఉద్యమంలో మహిళల పట్ల చాలా వివక్ష ఉంటుందని బయటి ఫెమినిస్టులు భావిస్తుంటారు. అలాగే మాట్లాడు తుంటారు. లోపల, తుపాకీ పట్టుకుని, పోరాడుతున్న మహిళలు - ఈ




సమాజంలోని పెత్తనాన్ని, అవినీతిని లేదా పలురకాల అణచివేతలను ఎదురించి ఉద్యమంలోకి వెళ్లిన మహిళలు - సామాన్య స్త్రీలు భరించినట్టుగా పితృస్వామ్యాన్ని భరిస్తూ ఉంటారా? ఉద్యమ మహిళలకు ఆ మాత్రం చైతన్యం ఉండదా? లోపల కూడా పితృస్వామ్య అణచివేతను ఎదుర్కొంటున్న వారిగా భావిస్తూ మా తరపున వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతారు. మాట్లాడటం మంచిదే. కానీ మేమూ చైతన్యంతో ఉంటామని, పితృస్వామ్యం ఏ రూపంలో ఉన్నా ప్రశ్నిస్తామని, నిలదీస్తామని వారికి తట్టదు (మా విమర్శను పార్టీ స్వీకరిస్తుందనేది వేరే విషయం). ఇది, ఒకరకంగా ఉద్యమంలో పనిచేస్తున్న మహిళల పట్ల వారిలో వున్న తక్కువ భావన, లేదా తమకే ఎక్కువ తెలుసు అనే భావన అయ్యుండాలి.

సహజసిద్ధంగా మహిళలకు వచ్చే నెలసరి కానీ, పిల్లలను కనడంలో కానీ ఎంత చైతన్యంతో ఉంటాము, పార్టీ మాకు ఎట్లా సహకరిస్తుంది? సహచరులు (భార్యాభర్తలు) ఎలా ఉంటారు? అసలు వారి 'కాపురం' ఎలా ఉంటుంది? పార్టీ పని చేస్తున్న ఏరియాల్లో మహిళలను ఎలా చైతన్యం చేస్తున్నారు? ఏ పోరాటాలు చేస్తున్నారు? అసలు వారి దళ, పార్టీ జీవితం ఎలా ఉంటుంది? అసలు వారీ ఉద్యమంలో ఎందుకు పని చేస్తున్నారు... కథలుగా రాసాను. నిజానికి రాసినవి చాలా చాలా తక్కువ. ఇంకా రాయాల్సినవి చాలా ఉన్నాయి.

నేను రాసిన లోపలి కథలతో ఈ సంవత్సరం మరో కథా సంపుటిని వెలువరించాలి అనుకుంటున్నా. ఇప్పటికే పలు కథలు 'కొలిమి' ఆన్‌లైన్ మ్యాగజైన్‌లో, ముద్రించిన రెండు కథా సంపుటాలలో ఉన్నాయి. అనుభవాలు కొన్ని చెప్పినా చాలా పేజీలు అవుతుంది. అందుకని ఇక్కడ చెప్పడం లేదు. వీలున్న వారు నా కథలను చదివితే నా అనుభవాలు కొన్ని తెలుస్తాయి.

**కొత్తగా కథలు రాస్తున్నవారికి మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?**

ప్రస్తుత సమాజంలో అభద్రత, ఒత్తిడి చాలా పెరిగింది. తాము సమాజాన్ని చూస్తున్న కోణం నుంచి కథలు రాస్తున్నారు. ఒక్కటి మాత్రం చెప్పగలను... ఇప్పుడు కథకు విస్తృతి చాలా పెరిగింది. సాహిత్యాన్ని చదివినప్పుడే రాయగలం అని నా అనుభవం. మొదట విస్తృతంగా చదవండి. వీలైనంత మందిని కలవండి. ముచ్చటించండి. జీవితపు పలు పార్శ్వాలను తెలుసుకుంటే కథలను ఆమేరకు బాగా రాయగలం. ప్రస్తుత సమాజాన్ని సాహిత్యంలో ప్రతి ఫలించగలం. పుట్టు కథలే పాఠకులను గెలుస్తాయి. కట్టుకథలు నీటిబుడగలు.



ఇంటర్వ్యూ :
డా॥ వెల్దండి శ్రీధర్
సెల్ : 98669 77741

వ్యాసం

# తెలుగు సినీగీతరచనలో స్త్రీలు ఎక్కడ?!

**మహిళలూ, మీరు సినిమాకి రాయరా...**




నెల్లుట్ల రమాదేవి
94406 22781


'పులకించని మది పులకించు, వినిపించని కథ వినిపించు... మనసునే మరిపించు.. గానం' అన్నాడు ఓ సినీ కవి. 1932లో తెలుగు సినిమా పుట్టిన తరువాత ఈ తొమ్మిది దశాబ్దాలుగా ఎన్నో పౌరాణిక, జానపద, చారిత్రిక, సాంఘిక చిత్రాలు వచ్చాయి. ఆ సినిమాలను చూస్తూ పెరిగిన నాలుగో తరం కూడా వచ్చేసింది.

మన సినిమాల్లో పాటలు ఓ విడదీయరాని భాగం. సన్నివేశానికి బలం చేకూర్చడానికో, ఒక భావం గానీ, అనుభూతి గానీ గాఢంగా చూపడానికో, పాత్రధారుల స్వభావాల్ని తెలుపడానికో మొదలైన పాట ఇన్నేళ్ల ప్రయాణించి ప్రేక్షకుల మదిలో స్థిరమైన చోటు సంపాదించుకుంది. కొన్ని సార్లు సినిమా నిడివి పెరుగుతుందనుకున్నప్పుడు ఒక పాటను ప్రవేశపెట్టి అందులోనే చాలా భాగం కథను వేగంగా చెప్పేస్తారు. పాటకున్న వెసులుబాటు అది.

పాట చాలా సార్లు సినిమాను దాటి విస్తృతిని పొందుతుంది. పూర్వం గ్రామఫోన్ రికార్డులుగా, ఆ తర్వాత కేసెట్లుగా, సీడీలుగా, డిస్క్‌లుగా, పెన్ డ్రైవ్ లుగా ... చాలా రూపాల్లో పాట ప్రయాణించింది. సినిమా చూడకపోయినా .. విడిగా పాటలు విని ఆనందించే వారున్నారు. ఇంత ప్రాధాన్యత కల్గిన పాటల్లో సాహిత్యం పాత్ర తక్కువేమీ కాదు. లిరిక్స్ చెబితే ట్యూన్ తో సహా పాడగల్గిన సంగీతాభిమానులూ, పాటలో వరుసల్ని హమ్ చేస్తే పల్లవీ, చరణాల్లోని మాటలను అలవోకగా చెప్పగలిగే సాహిత్యాభిమానులూ కోకొల్లలు.

గత ఎనభై సంవత్సరాలకు పైగా సముద్రాల, మల్లాది, పింగళి, వీటూరి, ఆత్రేయ, శ్రీశ్రీ, దేవులపల్లి, దాశరథి, సినారె, ఆరుద్ర, వేటూరి, సిరివెన్నెల గార్ల నుండి గత కొన్నేళ్లుగా రాస్తున్న చంద్రబోస్, సుద్దాల అశోక్ తేజ, భువన చంద్ర, అనంత్ శ్రీరామ్ వంటి వారి దాకా కొన్ని వందల మంది గీత రచయితలు తెలుగు సినీ గేయ రచనను సుసంపన్నం చేశారు. సినీ కళామతల్లికి తమ పాటలతో పుష్పార్చన చేశారు. అయితే... వీరిలో స్త్రీలెవరూ లేరన్న వాస్తవం, ఎందుకు లేరనే సందేహం సినీ గీతాభిమానులకు తెలియక, కలుగక మానదు.

స్త్రీలంటేనే పాటలు. పంటపొలాల్లో, ఇతర చోట్లా కాయకష్టం చేసే మహిళలు తమకు తోచిన రీతిలో పాటలు అల్లుకుని వరుస కూడా కట్టి పాడుకుంటారు. దంపుళ్ళు, విసురుళ్లు, కుప్ప నూర్పుళ్ళు మొదలుకొని ఎన్నో పాటలు స్త్రీల కల్పనే. ఇక ఇళ్లల్లో పండుగలు, వేడుకలు జరుపుకునే సందర్భాలలోనూ, దేవుళ్లను కీర్తించే మంగళ హారతులూ, ఆపద వస్తే వేడుకునే పాటలూ స్త్రీల సొత్తే.యుక్త వయసు పిల్లలు ఆడుకునేటప్పుడూ, తల్లులు పిల్లలకు జోల పాడేటప్పుడూ, అన్నాలు తినిపించేటప్పుడూ పాటలు తప్పనిసరి. అందులో ఎన్నో పాటలు స్త్రీల సొంత రచనలేనన్నది నిర్వివాదాంశం.

'సడి సేయకో గాలి', 'తోటలో నా రాజు తొంగి చూసెను నాడు', 'ఆరడుగులుంటాడా, ఏడడుగులేస్తాడా' ' హి ఈజ్ సో క్యూట్, హి ఈజ్ సో స్వీట్.. హి ఈజ్ సో హ్యాండ్సమ్' లాంటి కథానాయికలు పాడే పాటలు కూడా అమ్మాయి అంతరంగాన్ని చదివేసినట్టుగా పురుష కవులు రాయగా లేనిది స్త్రీలు అలాంటి పాటలు వ్రాయకపోయేవారా అనిపిస్తుంది. పైగా ప్రేమ, దయ, కరుణ, ఉత్సాహం, సంతోషం, విరహం, వియోగం, విషాదం.. లాంటి భావాలు, అనుభూతులు వ్యక్తీకరించడం సున్నిత మనస్కులైన స్త్రీలకు సాధ్యం కాదా అన్న ప్రశ్న తప్పక ఉదయిస్తుంది.

ఆకాశవాణిలో 'ఈ మాసపు పాట'తో సహా ఎన్నో లలిత గీతాలు, పండుగల సందర్భంలో ప్రత్యేక నృత్య రూపకాలెన్నింటినో రచించిన ప్రసిద్ధ గేయ కవయిత్రి గంగరాజు సుశీలాదేవి ఈ వ్యాసకర్తకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'ఇన్ని మంచి పాటలు రాసిన మీరు సినిమా పాటలెందుకు రాయలేదు?' అన్న ప్రశ్నకు "నన్ను తురగా జానకీ రాణి ఓ సారి ప్రముఖ దర్శకులు ఆదుర్తి సుబ్బారావు గారి దగ్గరికి మద్రాసు తీసుకెళ్లింది. నా

పాటలు ఆయనకు నచ్చాయి కూడా. అయితే, సినిమాల్లో ఆయా సందర్భాలకు తగ్గట్లుగా పాటలు రాయాలంటే కొన్నాళ్ళు అక్కడే ఉండాల్సి వస్తుందని అన్నారు . అన్ని రోజులు వేరే ఊరిలో.. అందునా ఒంటరిగా ఉంటూ... సినిమా వాళ్ళ మధ్య పని చేయడానికి మా ఇంట్లో అస్సలు ఒప్పుకోరని వెనక్కు వచ్చేశాం.'' అన్నారు.

అప్పట్లో చాలామంది మహిళలు సినిమా పాటలు రాయకుండా ఉండడానికి కారణం ఇదే అనుకోవచ్చు. సహజంగానే ఎవరైనా తాము పని చేసే చోట స్థల, సమయానుకూలతలు ఉండాలని కోరుకుంటారు. స్త్రీలకు మరి కొన్ని ప్రత్యేక సందర్భాలూ, అవసరాలూ ఉంటాయి. వారి పైన కుటుంబ సంరక్షణ, పిల్లల పెంపకం, ఇంటిపట్టున ఉండాల్సిన బాధ్యతలు ఎన్నో ఉంటాయి. పైగా సినిమాల్లో పనిచేస్తున్నారంటే ఒకప్పుడు ఉన్న చిన్న చూపు, భర్తతో సహా కుటుంబంలోని ఇతర వ్యక్తుల సహాయ నిరాకరణ కూడా మహిళలు మాటలు, సినిమా అనుసరణ, పాటలు లాంటి విభాగాల్లో పనిచేయకపోవడానికి కారణాలై ఉంటాయనుకోవచ్చు. ఒక ఆఫీసు అని కాకుండా వేరే చోట్లకు వెళ్లాల్సి రావడం, పాటలో పదాలు మార్చాలంటే.. అవసరమయితే ఏ సమయంలోనైనా అందుబాటులో ఉండి వెళ్లాల్సి రావడం మహిళలకు ఇబ్బంది కలిగించే విషయం అన్నది వాస్తవం.

సోషల్ మీడియా ఇంత ప్రబలంగా లేని రోజుల్లో ఎన్నో పత్రికలు సినిమాల గురించీ, సినిమా వాళ్ళ గురించీ కొన్ని వివరాలు, విశేషాలూ, ఇంకొన్ని గాసిప్పూ రాస్తూ ఉండేవి. మాటలూ, పాటలూ రాసే రచయితలను పెద్ద పెద్ద హొటల్ రూముల్లో ఉంచుతారనీ, అవసరమయితే హిల్ స్టేషన్లతో సహా ఎక్కడ అవుట్ డోర్ షూటింగులయితే అక్కడికి వెంట తీసుకెళతారనీ, వారికి వసతితో సహా విందు, చిందు, మందు లాంటివి ఏర్పాటు చేస్తారనీ,మూడ్ రావాలంటే కారులో తిప్పుతారనీ... ఇలా రకరకాల వార్తలు చదివిన జ్ఞాపకం మనలో కొందరికైనా ఉండి ఉంటుంది. అల్లసాని పెద్దన చెప్పినట్లు 'నిరూపహతి స్థలము, రమణీ ప్రియదూతిక ఇచ్చు కప్పురపు విడము' లాంటివి కావ్యరచనకే కాక పాటల రచనకూ అవసరమనే వాదనను ఇలాంటి వార్తలు బలపర్చాయి.

అన్ని సందర్భాలలో, అన్ని నిర్మాణ సంస్థలలో అలాంటి పరిస్థితులుంటాయని చెప్పలేం. పైగా యాభై, అరవై దశకాల్లో ఆకాశవాణి స్వర్ణయుగపు రోజుల్లో ఎందరో కవయిత్రులు రచించిన లలిత గేయాలు వివిధ గాయనీ గాయకులు పాడగా ప్రసారం అవడమే కాక, సినిమా పాటలకు సమాంతరంగా ప్రసిద్ధి పొందాయి కూడా. మరి సినిమాల్లో మాత్రమే స్త్రీలు రచించిన పాటలు ఎందుకు లేవు అన్న ఆరోపణ సత్యదూరం కాదు.

అంతే కాకుండా సినీ రంగంలో కథా నాయికలే కాకుండా, ఇతర నటీమణులు, నేపథ్య గాయనులు, డబ్బింగ్ కళా కారిణులు ఎందరో ఉన్నారు. దర్శకత్వం వంటి క్లిష్టమైన, సాంకేతికమైన పని చేసి మెప్పించిన భానుమతి, సావిత్రి, విజయ నిర్మల, ఘట్టమనేని మంజుల, శ్రీప్రియ, జీవిత వంటి నటీమణులతో బాటు కేవలం దర్శకత్వం వహించి విజయాలు పొందిన బి . జయ, సుధా కొంగర, నందినీ రెడ్డి వంటి వారూ ఉన్నారు.

సినీ గీతాల విషయమే తీసుకుంటే నాటి నుండి నేటి వరకు రావు బాలసరస్వతి, పి. లీల, జిక్కి, జమునా రాణి, పి. సుశీల, ఎస్. జానకి, బి. వసంత, ఎల్.ఆర్. ఈశ్వరి, చిత్ర, ఎస్.పి. శైలజ, చిత్ర, సునీత వరకూ స్టూడియోలకు వచ్చి, వివిధ షెడ్యూల్స్‌కి అనుగుణంగా పాటలు పాడి, ఆయా సినిమాల విజయాల్లో తోడ్పడిన మహిళలెందరో! వీరిలో లీల, జానకి, వసంత వంటి వారు ఒకటి రెండు సినిమాలకి సంగీత దర్శకత్వం వహించారు కూడా! చివరికి అర్థమయ్యేది ఏమిటంటే... తెర మీద స్త్రీ పాత్రల్లో కనిపించడానికి నటించగల అందమైన స్త్రీలు కావాలి, సరే.. ఎలాగూ వారికోసం పాటలు పాడడానికి మధురమైన ఆడ గొంతులే కావాలి, నటీమణుల గొంతులు భావ ప్రకటనకు సరిపోకపోతేనో, వారికి భాష రాకపోతేనో డబ్బింగ్ కోసం స్త్రీలు కావాలి, కానీ పాటలదేముంది... స్త్రీలే రాయాలని లేదు కదా ! ఒక్క గీత రచన అనే కాదు, సినీ రంగానికి చెందిన ఏ విభాగంలోనైనా తప్పనిసరి అయితేనే స్త్రీల ఉనికిని అంగీకరిస్తారన్నది చేదు వాస్తవం.

అయితే అక్కడక్కడా కొన్ని మెరుపులు కనబడి తళుక్కుమన్నాయి. 1966లో వచ్చిన 'విజయ శంఖం అనే సినిమాలో కె.జి. వసంతా దేవి 'దారి కాచి వేచినానురా... రేయిబవలు చూచినానురా' అనే పాట రాసినట్టు కొన్ని ఆధారాలు తెలియజేస్తున్నాయి. ఆ రకంగా చూస్తే తొలి తెలుగు సినీ గీత రచయిత్రిగా వసంతా దేవిని గుర్తించవచ్చు. ఆ తరువాత రెండేళ్లకే 1968 లో మహానటి సావిత్రి దర్శకత్వంలో 'చిన్నారి పాపలు' సినిమాను నిర్మించిన వీరమాచనేని సరోజిని (ప్రముఖ దర్శకులు వి. మధుసూదన రావు భార్య) ఆ సినిమా కోసం 'ఉయ్యాల ఉయ్యాల ఉయ్యాల ... ఊగాలి ఊగాలి అనే పాటను రాశారు. ప్రముఖ గాయని పి. లీల ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం వహించారు. ఆ విధంగా దర్శక, నిర్మాతలతో బాటు సాంకేతిక సిబ్బంది కూడా మహిళలే ఉండడం ఈ సినిమా ప్రత్యేకత కాగా ఇది గిన్నిస్ రికార్డులలోకి చేరింది.

తరువాత పదమూడేళ్లకు గానీ మహిళా కలం సినిమా వారికి కనబడలేదు. బాపు దర్శకత్వంలో 1981 లో వచ్చిన 'రాధాకళ్యాణం' సినిమాలో 'చేతికి గాజుల్లా, కళ్ళకు కాటుకలా, నుదుటికి తిలకంలా రాధకు మాధవుడు' అన్న పాటను కె. జ్యోతిర్మయి రాయగా బాలసుబ్రహ్మణ్యం పాడారు. ఇది కథానాయకుడి అంతరంగ వ్యక్తీకరణ అనేది గమనార్హం. ఆ తరువాత కూడా 1987లో 'మూడు ముళ్ళు చిత్రం కోసం 'లేత చలిగాలులు దోచుకోరాదురా' అన్న పాటను రాసిన జ్యోతిర్మయి ఆ తరువాత ఎందుకో కొనసాగలేదు.

1982లోనే వచ్చిన 'విప్లవ శంఖం' సినిమాకు 'కులం కులమని కుత్సితాలు

పెంచుకోకు' అనే అభ్యుదయ గీతాన్ని 'కాన్రేడ్ విజయలక్ష్మి, 1988లో 'మా తెలుగు తల్లి' కోసం డా॥ సీతాదేవి ఒక పాటను రచించినా మరి రెండు దశాబ్దాల దాకా స్త్రీలు రచించిన పాటలు లేకుండానే సినిమాలు వచ్చాయి. నిజానికి స్త్రీవాద ఉద్యమం వేళ్లానుకుని, అన్ని రంగాల్లోనూ స్త్రీలు ప్రవేశించి విజయాలను చవి చూడడం మొదలు పెట్టిన దశాబ్దాలవి.

ఆ తరువాత 'ఐస్ క్రీం', 'జెంటిల్ మేన్' సినిమాలకు పాటలు రాసిన రాణి పులోమజాదేవి స్ట్రెయిట్, డబ్బింగ్ సినిమా గీతాలు, ప్రైవేట్ లలిత గీతాలు కలిపి 789 పాటలు రాసి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అత్యధిక గీతాలు రచించిన మహిళగా చోటు సంపాదించుకున్నారు. ఉపాధి అధికారిగా ఉద్యోగం చేస్తూనే కథలు, నాటకాలు, గేయాలు రాశారు. 'రాణి పులోమజా దేవి కథలు' పేరుతో కథాసంపుటిని వెలువరించారు. ప్రసిద్ధ సంగీత దర్శకులైన థమన్, గురు కిరణ్ లతో బాటు భర్త అర్జున్, కుమారుడు ప్రద్యోతన్ గార్ల సంగీత దర్శకత్వంలోనూ పాటలు రాశారు. ఉత్తమ గేయ రచయిత్రిగా భరతముని అకాడమీ, అభినందన వంటి ప్రతిష్టాత్మక సంస్థల నుండి పురస్కారాలు అందుకున్నారు. మరెన్నో మంచి పాటలు ఈమె నుండి వచ్చేవో ఏమో గానీ అనారోగ్యంతో 2015లో మరణించారు.

2013 లో విడుదలైన 'మిస్సింగ్' సినిమాలో గీతరచన చేసిన కిరణ్మయి, 2014లో విడుదలైన 'మాయ' సినిమాలో 'పోకిరి రాజా' పాట రాసిన రమాదేవి, 'పవన్ సుబ్బలక్ష్మి ప్రేమించుకున్నారట' సినిమాలో 'నా చూపు' పాటతో అడుగు పెట్టిన కొండముది అనూరాధ ఒకటి రెండు పాటలకే పరిమితమయ్యారు.

2012లో సుష్మ శ్రేష్ఠ అనే యువతి 'ఒక రొమాంటిక్ క్రైమ్ కథ' అన్న సినిమాలో 'ఓ మధురిమవై'తో మొదలు పెట్టి అన్ని పాటలూ రాసి సింగిల్ కార్డు ఎంట్రీ ఇచ్చి ఆశ్చర్యపరిచింది. తెలంగాణా లోని మంచిర్యాలకు చెందిన శ్రేష్ఠ ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి ఎల్ ఎల్.బి. పూర్తి చేసింది. ఈమె తల్లిదండ్రులు చంద్రకళ, జాన్ శామ్యూల్ వెస్లీ. కాలేజీ విద్యార్థిగా ఉన్నప్పుడే 'మై కాలేజ్ లైఫ్' అనే కవితా సంపుటిని వెలువరించింది. అంతకు ముందే చాలా ఆధ్యాత్మిక గీతాలు రాసి, పాడి మంచి పేరు తెచ్చుకుంది. ఆ తరువాత 'కో అంటే కోటి' సిన్మాలో 'బంగారు కొండ', 'జబర్దస్త్'లో 'నిన్నిలాగే చూస్తూ ఉన్నా', 'కొరియో బై కల్యాణ్', 'హలో' చిత్రాల్లో మంచి పాటలు రాసిన శ్రేష్ఠ తన కెరీర్ ఊపందుకుంటున్న సమయంలో బలవంతపు విరామం తీసుకుంది. తిరిగి 2016లో 'పెళ్లి చూపులు' సినిమాలో శ్రేష్ఠ రాసిన 'చినుకు తాకే', 'మెరిసే మెరిసే' పాటలు హిట్ అవడంతో ఈమె కెరీర్ మళ్ళీ పుంజుకుంది. 2017లో వచ్చిన సంచలన చిత్రం 'అర్జున్ రెడ్డి' లో 'మధురమే, గుండెలోన' అనే రెండు పాటలు, 'యుద్ధం శరణం'లో 'ఎన్నో ఎన్నో బంధాలు' వంటి పాటలు రాసి ఒక గుర్తింపును పొందింది. 'అర్జున్ రెడ్డి' లో శ్రేష్ఠ రాసిన 'మధురమె ఈ క్షణమే' పాట హిట్ అయి ఈమెకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇరవై చిత్రాలకు పైగా పాటలు రాసిన శ్రేష్ఠ 2017లో ఉత్తమ గేయ రచయితగా జీ గోల్డెన్ అవార్డు, 2019లో ఈటీవీ వసుంధర పురస్కారం, సినారె - వంశీ ఫిలిం అవార్డులను పొందారు. అయితే, తన మూడేళ్ళ విరామానికి 'కాస్టింగ్ కౌచ్' కారణమనీ , సినీ పరిశ్రమలో తనకు అవకాశాలు రాకుండా చూడడమే కాక అనేక రకాల వేధింపులకు గురి చేశారనీ, అందువల్లనే తన మూడేళ్ళ కెరీర్‌ని వదులుకోవాల్సి వచ్చిందనీ శ్రేష్ఠ చెప్పిన మాటలు వింటే మహిళలపై వేధింపులకు సినీ సాహిత్యం కూడా మినహాయింపు కాదని తెలుసుకోవచ్చు.

2016లో 'ఒక్కడొచ్చాడు' సినిమాతో ప్రారంభించి ఆ తరువాతి సంవత్సరంలో 'అమరావతి అమ్మాయి', 'పెళ్లి రోజు' సినిమాల్లో పాటలు రాసిన డా॥ చల్లా భాగ్య లక్ష్మి కొంతవరకూ తన ముద్రను వేయగలిగారు. జర్నలిస్టుగా ఉండి, సినీ రంగంలోకి స్క్రిప్ట్ రైటర్‌గా శేఖర్ కమ్ముల టీంలో ప్రవేశించి అనుకోకుండా గీత రచయిత్రి చైతన్య పింగళి 2017లో వచ్చి విజయవంతమైన 'ఫిదా' సినిమాలో 'ఊసుపోదు.. ఊరుకోదు 'ఫిదా ఫిదా' పాటలతో లిరిసిస్ట్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. 'ఊసుపోదు' పాటఎంత హిట్ అయిందో అందరికీ తెలుసు. ఆ తరువాత 'నేల టికెట్'లో 'లవ్ యూ లవ్ యూ', 'బిజిలీ' పాటల్నీ, 2020లో వచ్చిన 'లవ్ స్టోరీ'లో 'ఏయ్ పిల్ల', 2022లో 'మసూదా'లో 'దాచి దాచి' పాటనూ కలుపుకుని ఇప్పటివరకూ పద్నాలుగు పాటలు మాత్రమే రాశానని చెప్పే చైతన్య తాను ఎక్కువగా సంగీత దర్శకులు ఇచ్చిన ట్యూన్‌కి మాత్రమే పాటలు రాసాననీ, ఇప్పుడు ఎక్కువగా ఆ పద్ధతే ఆచరణలో ఉందనీ ఓ ఛానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య మునిమ నవరాలుగా, సంచలన పాత్రికేయుడు, 'ఎన్ కౌంటర్' పత్రికను నడిపిన పింగళి దశరథరామ్ కూతురుగా రచన, జర్నలిజం వారసత్వం కల చైతన్య 'చిట్టగాంగ్ విప్లవ వనితలు' అన్న చారిత్రక, కాల్పనిక కథల పుస్తకానికి 2016 సంవత్సరానికి గాను ' కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కారాన్ని ' పొందారు. సినిమా పాటల్లో ఉండేది కూడా కవిత్వమేననీ, చదువు రాని వాళ్ళ కోసం రచించే సాహిత్యమే పాట అనీ భావించే చైతన్య 'మనసులో వెన్నెల' అనే కవితా సంపుటిని కూడా వెలువరించారు.

ఆకాశంలో సగం అంటూ అన్ని రంగాలలోనూ దూసుకుపోతున్న మహిళలకు తెలుగువారేమీ తీసిపోలేదు. రాబోయే రోజుల్లో సినీ గీత రచనా విభాగంలోనూ మరింతగా రాణించి అవకాశాల్లోనూ సగం అందిపుచ్చుకుని వెలుగులు విరజిమ్మాలనీ, శ్రీశ్రీ, వేటూరి, సుద్దాల అశోక్ తేజ, చంద్రబోస్‌ల తరువాత ఆ వరుసలో జాతీయ చలన చిత్ర అవార్డుల్లో మన తెలుగు మహిళ ఉత్తమ గీతరచనకు గాను పురస్కారాన్ని పొందాలనీ ఆశించడం అత్యాశ కాదుగా!!

# సురుకుల వైద్యం చేస్తున్న మల్లారెడ్డి




ఎద్దు, ఎవుసమ్, సురుకుల వైద్యం గులాబీల మల్లారెడ్డి ఇటీవల వెలువరించిన కవితా సంకలనం. ఆయన సమాజానికి చేస్తున్న వైద్యం ఇది. ఏదైనా రోగం వస్తే కర్రు కాల్చి వాత పెట్టడాన్ని చురకల వైద్యం లేక సురుకుల వైద్యం అంటారు. వ్యవసాయాన్నితద్భవంగా ఎవుసమ్ అనడం పరిపాటే. ఈ పేర్లే ఈ సంపుటికి సార్థక నామాలయ్యాయి. ఈయన కవిత్వానికి ఎన్నుకున్న వస్తువును చూస్తే ఈ కవి కవితా తత్వం పట్టుపడుతుంది. పనిగల్ల ఎద్దు, పొలం బావి స్వగతం, ఎవుసమంటే, పెద్దబాడిసె నివేదన, ఎద్దునెమరు, మోట బొక్కెన, రైతు గోస, చెరువే అవ్వ, కర్షకుడు లాంటి శీర్షికలు చూస్తే ఈ కవి ఏ నేపథ్యం నుండి మాట్లాడుతున్నాడో తెలిసి పోతుంది. శ్రామిక స్వేదం ఈ సంపుటం లో అడుగడుగునా గుర్తువస్తుంది. "తప్పును తప్పు అనడమే కవితనం, నా అడవి నాది, నా డెన్ నాది, నా బతుకు నాది, నా దారి నాది, నన్ను నా లాగే బతుకనియ్ తండ్రీ, అంటూ తన మార్గాన్ని స్పష్టం చేస్తారు.ఈ సంపుటం వ్యవసాయానికి మాత్రమే పరిమితం కాలేదు. వ్యవసాయేతరమైన సామాజికాంశాలెన్నో చోటు చేసుకున్నాయి. నయీమ్ కథ, ఖైదీ సంకల్పం, నడవడి పోలీసుల గురించి, చేదుమాత్ర పేదవానిపైన కోర్టులు చివరికి న్యాయస్థానాలు కూడా చేసే వివక్ష, అట్లాగే కార్మికుడి స్వగతం నేటి రాజకీయ వ్యవస్థ ను చిత్రించుతూ, ఆడవాళ్ళ అత్యాచారాల ను నిరసిస్తూ మహిళా విలాపం, ఈ విధంగా బహుళ కోణాలను ఈ సంపుటం లో స్పృశించారు. ఈ సంపుటం లోని సాగువాటు లాంటి పదాలు ఈ కవిలోని Neologism మనకు పట్టి ఇస్తాయి. నిబిడాశ్చర్యం లో జనం శ్రీ శ్రీ ని గుర్తుకు తెస్తుంది. మొగురం లాంటి అరుదైన పదాలు శీర్షికలుగా ఉన్న కవితలున్నాయి. ఈ సంపుటిలో ప్రాసలు ఒక్కోసారి నవ్వు తెప్పిస్తాయి. "వైద్యానికి గీకుడు, సాహిత్యానికి గోకుడు, కవిత్వానికి మూతి నాకుడు, లేనిదెక్కడ పీకుడు, లాంటివి. గుండె కొండ, సెక్యులర్ దిక్సూచి, లాంటి metaphors జలగల సరసు లాంటి symbols ఇందులో దొరుకుతాయి. నిశ్శబ్ద నిరాకార ఛాయా చిత్రాలు అనే కవితలో కవి విశ్వరూపం కనబడుతుంది. "కానీ మా కలలు నిజమౌతాయి, అప్పుడే కటకటాలుండవు, కన్నీళ్లుండవు, ఖైదీ కళ్ళలో తిరుగుబాటు బావుటా రెప రెప లాడింది." లాంటి ఆశావహ దృక్పథంతో ఈ కవిత ముగుస్తుంది. కవిత్వం రాయడమంటే మానవత్వానికి సుప్రభాతం పాడడం అని చెప్పే ఈ గులాబీల కవిత్వం అటు వ్యవసాయానికి, ఇటు సామాజికతకు పూర్తి ప్రాతినిధ్యం అని చెప్పాలి.

ప్రతులకు : గులాబీల మల్లారెడ్డి
3-1-706, వావిలాలపల్లి, కరీంనగర్ - 505 001

# సంపాదకీయాలలో శాస్త్రీయత

మరుమాముల దత్తాత్రేయశర్మ పరిశోధనా గ్రంథం 'ముట్నూరి కృష్ణారావు సంపాదకీయాలు. ముట్నూరివారి రచనా పాటవం, మహోన్నత వ్యక్తిత్వం, మనముందు నిలబెడుతుంది ఈ పరిశోధక రచన.

సాధారణంగా వార్తాపత్రికలు జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను, సాహిత్య సాంస్కృతికాంశాలను ప్రతిఫలిస్తుంటాయి. ఒక్క పేజీలో మాత్రం ఈ నిర్వహణకు మూలకారకుడైన సంపాదకుని వ్యక్తీకరణ ఉంటుంది. Noah Webster అనే పాత్రికేయుని దగ్గరనుండి సంపాదకీయం ప్రారంభమైంది. మహాభారతంలో 'వార్త యందు జగతి వర్ధిల్లుచున్నది' అన్నప్పటినుండి సమాచార స్పృహ సాహిత్యంలో ఉంది. వార్త అనే మాటకు వృత్తాంతం,సమాచారం,నడవడి, మొదలైన అర్థాలు వస్తాయి. దినపత్రికలు, వారపత్రికలు, మాసపత్రికలు, రాజకీయ, వార్తా, సినిమా పత్రికలన్నింటిలోనూ తమ అభిప్రాయ ప్రకటన కోసం తప్పనిసరిగా సంపాదకీయాలుంటాయి. ప్రతి సంపాదకీయంలో ఆ పత్రికా లక్ష్యం ప్రతిఫలిస్తుంది. భావ క్రమీకరణలోను, శీర్షికలు పెట్టడంలోను, కృష్ణా రావుగారి ప్రత్యేకతను ఈ రచయిత నిరూపించారు. కృష్ణా రావు సంపాదకీయాలలో వర్ణాత్మకంగా, విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మకంగా, అధిక్షేపాత్మకంగా ఉన్న వివిధ కోణాలను ఈ పుస్తకంలో చూపించారు. ఆయనలో సందర్భాన్నిబట్టి, వస్తువునుబట్టి, వాడిన గ్రాంథిక, సరళ గ్రాంథిక, వ్యవహార శైలులు వివరించారు. కృష్ణా పత్రిక చరిత్రను, ముట్నూరి వారి సంపాదక శిల్పాన్ని తెలుసుకోవడంతో పాటు దత్తాత్రేయ శర్మ రచనా శిల్పాన్ని కూడా ఈ పుస్తకం చదివి తెలుసుకోవచ్చు.




వెల: రూ. 250/-
ప్రతులకు : రామసదనం,
ఇ.నె. 29-1499/6/1, కాకతీయ నగర్,
రోడ్ నెం. 1, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్ 500056.

# రంగులు వెలిసిపోయిన 'రంగ్‌మహల్'

మాతృభాష మరాఠి అయినా, తెలుగు సాహిత్యంలో ఘనాపాఠీ. నాలుగు దశాబ్దాల బోధనానుభవం, తెలుగు సాహిత్యం మీద ఎనలేని అనురక్తి శ్రీ లక్ష్మణరావు పతంగేని తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక వ్యక్తిగా నిలబెట్టింది. నిరంతర పఠనాసక్తి వీరిని ఉర్దూ భాషలో ఆరితేరినవారిగా మలిచింది. వీరి ఉర్దూ తెలుగు నిఘంటువు. ఉర్దూ భాషలోని మాధుర్యాన్ని సామాన్యుడు కూడా ఆస్వాదించేట్లుగా చేసింది. హైద్రాబాద్ స్టేట్ నుండి తెలంగాణ రాష్ట్రం దాకా లక్ష్మణరావు గారికి స్వానుభవమే.




అట్టి అనుభవమే వీరితో 'హైదరాబాదీ కతలు' 2022లో వ్రాయించింది. ఆ కథలకు వచ్చిన ప్రజాదరణ, అనుకూల స్పందన ప్రస్తుత నవలిక 'రంగ్‌మహల్'ను వ్రాయించింది. 62 పేజీల ఈ నవలికలో మొదట మనకు పరిచయం అయ్యే పాత్ర ప్రభుత్వోద్యోగి రామచంద్రరావు, ఆయన సాహిత్య పిపాస. ప్రతి ఆదివారం కోఠీ, ఆబిడ్స్‌లో అమ్మే పాత పుస్తకాలలో తనకు నచ్చిన పుస్తకాలను కొంటుండేవాడు. అట్టి సందర్భంలోనే ఆయనకు 'రంగ్‌మహల్' అన్న అట్టలు లేని పుస్తకం దొరుకుతుంది.

కథా నేపథ్యం 1950 కంటే ముందున్న హైదరాబాద్ మెహందీ గల్లీ (హైకోర్టుకు వెనక ప్రాంతం) లోని ప్రఖ్యాతిగాంచిన 'రంగ్‌మహల్' అనే భవనం. ఓనర్ సితారాబాయి అనబడే బాయమ్మ, ఆమె నడిపే గానాబజానా, అందమైన యువతులు, వారందించే భౌతికసుఖాలు, అన్నింటికంటే ముఖ్యమైన బాయమ్మ వ్యక్తిత్వం, ఆమె ఉదారత్వం కథలోని ముఖ్యాంశాలు.

ఈనాటి 'రెడ్‌లైట్ ఏరియా'ల్లా కాకుండా నాడు మెహందీ గల్లీ ఒక కళానిలయంగా, మనసుకు ఊరట కలిగించే కేంద్రంగా, వ్యభిచారం అందులో ఒక చిన్నభాగంగా ఉండేది. అక్కడ రసికులను ఆటపాటలతో అలరించేవారు. భౌతిక సుఖాల నాశించే కొందరు ఆటపాటల అనంతరం అక్కడే ఉండి పోయేవారు. ఎక్కడా అసాంఘికత, అవాంఛనీయత ఉండేది కాదు. ఏవైనా చిరు సమస్యలు, ఆరోగ్య సంబంధిత అసౌకర్యాలు వచ్చినా బాయమ్మే పెద్ద దిక్కయి సరిచేసేది. ఇవేకాదు, పండగలకు చీరలు కొద్దిపాటి విలువైన నగలు, పిక్నిక్‌లు, నుమాయిష్ (హైద్రాబాద్ పారిశ్రామిక ప్రదర్శన)కు కూడా తీసుకువెళ్ళేది. తన హయాములో ఉన్న స్త్రీలకు వారు కోరితే పెళ్ళిళ్ళు కూడా చేసి పంపేది. అవసానదశలో తన దగ్గర పనిచేసిన సిబ్బంది అందరికీ తలో కొంత ముట్టచెప్పి పంచుతుంది బాయమ్మ.

రాజులు రాజ్యాలు పోయి, చివరకు 'రంగమహల్' శిథిలావస్థలో మిగిలిపోతే, రోడ్డు వెడల్పులో భాగంగా అది కూడా నేలమట్టం అవుతుంది. నవలిక ముగుస్తుంది.

లక్ష్మణ్‌రావు పతంగే ఎన్నుకున్న వస్తువు, శైలి, బహుశా ఇంతవరకు ఎవరూ ప్రయత్నించినట్లు అవుపించదు. రంగ్‌మహల్ పరిసరాలు ద్వారపాలకుల్లాంటి పోషు, మైనులు, రిసెప్షన్ హాలు, అలంకరణ, మల్లెపూల గజరాలు, అత్తరు వాసనలు, తమలపాకు బీడాలు, చంపా, చమేలీల నృత్యగానాలు, సారంగీ తబలా హార్మోనియం వాద్యాలు, ఉత్తేజ పరిచే పాటలు, చదువుతున్న పాఠకుడికి గానాబజానా మెహఫిల్‌లో కూర్చున్న అనుభూతి లక్ష్మణరావు తన కలం కుంచెతో అత్యంత సహజంగా చిత్రించారు.

'నేటివిటీ' చేకూర్చటానికి 'ఛలో వఖ్త్ హోగయా', ఫర్షీ సలామ్ (వంగి వంగి సలామ్ చేయటం), 'చౌకాబాసన్' (అంట్లు తోమడం), 'టీకా' లాంటి ఉర్దూ పదాలు వాడటం, ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు ఉస్తాద్ బడే గులాం అలీఖాన్ రంగ్‌మహల్‌ను సందర్శించినట్లు చెప్పటం, నాటి ప్రముఖ బిస్కట్ల కంపెనీ జె.బి. మంఘారాం, చార్మినార్ దగ్గరి 'లచ్చీరాం మిఠాయివాలా' నేతిమిఠాయిల ప్రసక్తి సమయోచితంగా ఉంది.

రంగ్‌మహల్ పతనానంతరం, దగ్గరే ఉన్న చాయ్ దుకాణం ముసలాయన "క్యా బోలూ సాబ్! యాద్ ఆయేతో బడా దుఃఖ్ హోతాహై" అని వాపోవటం సన్నివేశానికి సహజత్వం చేకూరింది. నవల చివరి వాక్యం చదువుతూ పుస్తకం మూసేసిన పాఠకుడు కూడా అంతే ఉద్విగ్నతకు, ఉత్తమ గ్రంథంగా ఎంపిక చేసి అవార్డు ఇచ్చారు. నేటి నవలల ట్రెండ్‌లో ఖచ్చితంగా ఇది వెరైటీ నవల.

**'రంగ్‌మహల్' నవలిక;**

రచన : లక్ష్మణరావు పతంగే;

వెల : 160/-

ప్రతులకు అన్ని ప్రముఖ పుస్తకాలయాలు.

**-కూర చిదంబరం, 8639338675**



## పరిశోధకుడిగా సుంకిరెడ్డి సేవలు అభినందనీయం

సుంకిరెడ్డి నారాయణరెడ్డి సాహిత్య పరిశోధకుడిగా తెలంగాణకు ఎంతో సేవ చేశాడని, చేస్తున్నాడని ఆయన పీహెచ్డీ సిద్ధాంత గ్రంథం "వినిర్మాణం" ముందు తరాలకు గొప్ప రెఫరెన్స్ గా ఉపయోగపడుతుందని, ఆ పుస్తకాన్ని తనకు అంకితం ఇవ్వడం గర్వకారణంగా భావిస్తున్నానని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎన్ గోపి అన్నారు. ఆయన ఫిబ్రవరి 18వ తేదీ ఆదివారం సాయంత్రం తెలంగాణ కళాభారతిలో కొనసాగిన హైదరాబాద్ బుక్ ఫెయిర్ వేదికపై ప్రసిద్ధ పరిశోధకులు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి రచించిన "వినిర్మాణం", "తాత్విక నేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామం" పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంపాదకులు కే శ్రీనివాస్, వేణుగోపాల్, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఆచార్య రఘు, కాసుల ప్రతాపరెడ్డి, డాక్టర్ పసునూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## సాహిత్యం మానవత్వానికి దారి దీపం

సాహిత్యం మానవత్వానికి దారి చూపుతోందని మానవత్వం సాహిత్యానికి దోహదకారి అవుతుందని ఒకదానికి ఒకటి విడదీయరాని అనుబంధాన్ని కలిగి ఉంటాయని తెలంగాణ ప్రభుత్వ పూర్వ కార్యదర్శి టి చిరంజీవులు అన్నారు. ఫిబ్రవరి 4 ఆదివారం సాయంత్రం ఆయన హరిదారచయితల సంఘం ఆధ్వర్యంలో హెూటల్ వంశీ ఇంటర్నేషనల్ సమావేశ మందిరంలో నిర్వహించిన డాక్టర్ మద్దుకూరి సాయిబాబు రచించిన మనశ్శాంతి కోవెల నవల ఆవిష్కరణ సభలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సభలో "సాహిత్యం - మానవత్వం" అనే అంశంపై కీలక ఉపన్యాసం చేసిన తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ మానవతామూర్తులు సాహిత్యంలో రాణించిన సమాజంపై చెరగని ముద్ర వేసిన సాహితీవేత్తల గురించి ఆయన వివరించారు. ఆ కోవలో మన నిజామాబాద్ కవి, రచయిత సాయిబాబు ఉండడం ఎంతో గర్వకారణమని ప్రశంసించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ మానవతా దృష్టి హృదయంలో పుడుతుందని అది ఒక వెలుగుగా మారి జీవితాలను పునరుజ్జీవింప చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది ఐ గోపాల్ శర్మ, డాక్టర్ అమృత లత, డాక్టర్ త్రివేణి, తిరుమల శ్రీనివాస్ ఆర్య, కంకణాల రాజేశ్వర్, దారం గంగాధర్, సుమీల శర్మ, లక్ష్మి, తొగర్ల సురేశ్, వరలక్ష్మి, మండల సుధా, హరిప్రియ పాల్గొన్నారు.

## ఫీచర సునీతా రావు పురస్కారాలు



ఇప్పటికీ మూడేళ్లుగా అంటే 2021 నుంచి కొనసాగుతున్న ఫీచర సునీతారావు పురస్కారాలను 2023 కు ఎన్నికైన వాళ్ల పేర్లను ఫీచర సునీత రావు ఫౌండేషన్ ప్రకటించింది. కవిత్వంలో "దీపముండగానే" సంపుటం గజ్జల రామకృష్ణకు, కథా రచనలో "ఉడుకు బెల్లం"చింతకింది శ్రీనివాస్‌కు, విమర్శలో "షడ్చక్రం"లక్ష్మణ చక్రవర్తి, "దిక్ చక్రం" ఆడెపు లక్ష్మీపతికి, లభించాయి. ప్రతి విజేతకు 15000 నగదు జ్ఞాపికతో సత్కారం ఉంటుంది. విమర్శలో మాత్రం ఇద్దరు వ్యక్తులు సమానమైన మార్కులు సాధించి ఎంపిక కావడం వల్ల ఉమ్మడి విజేతలుగా ప్రకటించడం జరిగింది. కవిత్వానికి న్యాయ నిర్ణేతలుగా సుంకిరెడ్డి నారాయణరెడ్డి, నాళేశ్వరం శంకరం, కథలకు న్యాయ నిర్ణేతలుగా కాసుల ప్రతాపరెడ్డి, కెపి అశోక్ కుమార్, విమర్శకు అమ్మంగి వేణుగోపాల్, విహారి వ్యవహరించారు. త్వరలో ప్రముఖ సాహితీవేత్తలతో ఈ పురస్కార ప్రదానం జరుగుతుందని ఫీచర సునీతా రావు ఫౌండేషన్ చైర్మన్ పి విజయేందర్ రావు పురస్కారాల కమిటీ కన్వీనర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు తెలియజేశారు.

## గులాబీల మల్లారెడ్డి పుస్తకావిష్కరణ సభ

ఫిబ్రవరి 10 2024 ఎన్టీఆర్ స్టేడియం పుస్తక ప్రదర్శనశాలలో రవ్వ శ్రీహరి ప్రాంగణం పైన గులాబీల మల్లారెడ్డి రచించిన మూడు సాహితీ గ్రంథాల ఆవిష్కరణ జరిగింది. ప్రేమ పవనాలు మానవతా సౌరభాలు అనే నవలను శ్రీ పెనుగొండ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఎద్దు ఎవుసం సురుకుల వైద్యం అనే కవితా సంపుటిని డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు ఆవిష్కరించారు. అదేవిధంగా ఐదు తరాల కథలను డాక్టర్ గంటా జలంధర్ రెడ్డి, పాలపిట్ట ప్రత్యేక సంచికను డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ సభకు వేముల ప్రభాకర్ ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు. పాలపిట్ట నిర్వహణలో జరిగిన ఈ సభలో పలువురు వక్తలు గులాబీల మల్లారెడ్డి సాహితీ సేవను సామాజిక సేవను అభినందించారు. హాజరైన సాహితీవేత్తలు అందరికీ రచయిత గులాబీల మల్లారెడ్డి తన స్పందనలో కృతజ్ఞతలు తెలియజేశారు.






## విజ్ఞానం- వికాసం

తెలంగాణ సారస్వత పరిషత్

వెల : రూ.165/-




## పిల్లల పాటల పరిమళం

తెలంగాణ సారస్వత పరిషత్

వెల : రూ.180/-




## పుత్తూరు పిల'గోడు'

ఆర్.సి.కృష్ణస్వామిరాజు

సెల్ : 93936 62821

వెల : రూ. 160/-




## ముక్కాలు-2

డా॥ జి.వి. పూర్ణచంద్

సెల్ : 94401 72642

వెల రూ. 100/-




## హోమ్ మేకర్

నాంపల్లి సుజాత

సెల్ : 98480 59893

హైదరాబాద్

వెల : రూ. 100/-




## ఓ జ్ఞాపకాల్లారా..

రూపాకృష్ణ

సెల్ : 76750 42763

హైదరాబాద్

వెల రూ. 150/-




## యోగక్షేమం వహామ్యహం

ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సెల్ : 93936 62821

వెల రూ. 160/-




## రహదారి

కొరుప్రోలు హరనాథ్

సెల్ : 97035 42598, 91821 78653

నవ తెలంగాణ బుక్ హౌస్

హైదరాబాద్

వెల రూ. 130/-




## బాల కథా సౌరభం

తెలంగాణ సారస్వత పరిషత్

వెల : రూ. 120/-




## సాక

సిద్దంకి యాదగిరి

సెల్ : 94412 44773

జంబో సాహితీ

సిద్దిపేట్

వెల రూ. 150/-

స్వీకారం కోసం మీ పుస్తకాలు ఈ చిరునామాకు పంపించండి వీలైతే సమీక్ష కూడా వేస్తాం.

**తెలంగాణ జాగృతి :** పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 4వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

# మహిళా దినోత్సవ శుభాకాంక్షలతో...



నందగిరి ఇందిరా దేవి



పోల్కంపల్లి శాంతాదేవి



పాకాల యశోదా రెడ్డి



మాదిరెడ్డి సులోచన



చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ



మల్లు స్వరాజ్యం